07-04-2024
ఆదివారం
హైదరాబాద్
సంపుటి 26, సంచిక: 290
పేజీలు: 8 | ఖమ్మం : 8+8
కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్: 8
వెల రూ. 5.00
Published from:
Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

భర్తృహరి నీతి శతకము
రూ॥40/-
పేజీలు:48

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.






‘మా మ్యానిఫెస్టో విప్లవాత్మకమైన మ్యానిఫెస్టో . ఇది భారతదేశ ముఖచిత్రాన్ని మార్చబోతున్నది. ఇది మా మ్యానిఫెస్టో కాదు. భారతదేశ ఆత్మ . మీ మ్యానిఫెస్టో . మీ మనస్సులోని మాట, గుండెల్లోని మాటను విని, దీనిని రూపొందించాం. ప్రతి ఒక్కరూ మా మ్యానిఫెస్టోను చదవండి. అది పేదలు, యువత, మహిళలు, కార్మికులు, రైతుల జీవితాలను మార్చబోతున్నది’

– రాహుల్‌గాంధీ

# ఎవరి వాటా వారికే...

## అన్నింట్లో ఒబిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీలకు జనాభా ప్రకారం భాగం

కులగణన కాగానే ఆర్థిక సర్వే నిర్వహిస్తాం
భారత్‌లో ధనం ఎవరిచేతిలో ఉందో వెలుగులోకి వస్తుంది
మహిళల కనీస వార్షిక కుటుంబ ఆదాయం రూ.లక్ష
యువతకు రూ.లక్షతో ఏడాదిపాటు శిక్షణ
తుక్కుగూడలో కాంగ్రెస్ తెలుగు మేనిఫెస్టో ఆవిష్కరించిన రాహుల్‌గాంధీ

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్రంలో తమ ప్రభుత్వం రాగానే తెలంగాణ తరహాలోనే దేశవ్యాప్తంగా కులగణన అమలు చేస్తామని, తరువాత ఆర్థిక, సంస్థాగత సర్వే చేయిస్తామని కాంగ్రెస్ అగ్రనేత , పార్టీ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ ప్రకటించారు. దీని ద్వారా భారతదేశంలో ధనం ఎవరి చేతుల్లో ఉందో, ఏ వర్గం చేతుల్లో ఉందో తెలిసిపోతుందన్నారు. ఈ చారిత్రక అడుగు తరువాత విప్లవాత్మక పనులు చేయబోతున్నామని, మీడియాలో, బ్యూరోక్రసీ( అధికార యంత్రాంగం), భారతదేశ అన్ని సంస్థల్లో ఓబిసి, దళిత, ఆదివాసీ, మైనారిటీ, పేదలకు జనాభా ప్రాతిపదికన దక్కాల్సిన వాటాను వాళ్ళకే ఇవ్వబోతున్నామని వాగ్దానం చేశారు. హైదరాబాద్ శివారులోని తక్కుగూడ రాజీవ్ గాంధీ ప్రాంగణంలో శనివారం నాడు ‘కాంగ్రెస్ జన జాతర’ పేరుతో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహా కొండా సురేఖ, సీతక్క తదితర మంత్రులతో కలిసి తెలుగులో రూపొందించిన ‘కాంగ్రెస్ న్యాయ్’ పార్లమెంటు ఎన్నికల మ్యానిఫెస్టో, కాంగ్రెస్ గ్యారంటీ కార్డులను సభికుల కరతాళ ధ్వనుల మధ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా నలభై నిమిషాల పాటు రాహుల్‌గాంధీ మ్యానిఫెస్టో అంశాలను వివరించారు. కొద్ది నెలల కోసం ఇలాంటి సభలోనే తెలంగాణలో మీకు వాగ్దానాలు చేశామని, అలాగే జాతీయ స్థాయి ఎన్నికల్లో గ్యారంటీలను ఇస్తున్నామని తెలిపారు. మీకిచ్చిన గ్యారంటీల ప్రకారం మీకు రూ.500లకు గ్యాస్ సిలిండర్ , 200 యూనిట్‌ల వరకు ఉచిత విద్యుత్, గృహలక్ష్మీ , ఫ్రీబస్ గ్యారంటీ అమలు చేశామని, ఇది తెలంగాణ ప్రజలందరికీ తరువాయి 2లో

## అతిపెద్ద వాషింగ్ మెషిన్ బిజెపి

మాజీ సిఎం ఇక్కడ ట్యాపింగ్ చేయించి డబ్బులు లూటీ
ఢిల్లీలో తెలంగాణ సిపాయిగా ఉంటా : రాహుల్

తెలంగాణలో బిజెపి బి టీమ్‌ను ఓడించామని, ఇప్పుడు దేశంలో ‘ఎ’ టీమ్‌ను ఓడిస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. భారతదేశంలో అతిపెద్ద వాషింగ్ మెషిన్ బిజెపి అని , దేశంలో అత్యంత అవినీతి మంత్రులు, నాయకులు నరేంద్ర మోడీ పక్కన నిలబడ్డారని, ఎన్నికల కమిషన్‌లో కూడా మోడీ తన మనుషులను కూర్చోబెట్టారని మండిపడ్డారు. తెలంగాణలో మాజీ సిఎం వేలాది మంది ఫోన్‌లు ట్యాపింగ్ చేశారని, ఇంటెలిజెన్స్ ఏజెన్సీ, పోలీసులను దుర్వినియోగం చేసారని, మిమ్మల్ని భయపెట్టి బెదిరించి డబ్బులు లాగేసుకున్నారని రాహుల్‌గాంధీ అన్నారు. తక్కుగూడలో జరిగిన ‘కాంగ్రెస్ జన జాతర సభ’లో ఆయన బిజెపి, బిఆర్‌ఎస్‌లపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ మాజీ సిఎం వేలాది మంది ఫోన్‌లను ట్యాపింగ్ చేయించారని, రాత్రికి రాత్రి మీకు ఫోన్‌లు చేసి, బెదిరించి, డబ్బులను లాగేసుకున్నారని, లూటీ చేశారని చెప్పారు. తెలంగాణలో విచారణ జరుగుతుండడంతో వాస్తవాలు మీ ముందుకు వచ్చాయని, మీ పాత సిఎం ఏమి చేశారో ఢిల్లీలో ప్రధాని, బిజెపి నేతలు అదే పని చేస్తున్నారని అన్నారు. ఎన్‌ఫోర్స్‌డైరెక్టరేట్‌ను (డబ్బులకోసం బెదిరించే ) ఎక్స్‌టార్షన్ డైరెక్టరేట్ మార్చేశారని మండిపడ్డారు.

**మేము భయపడం.. నిజమే గెలుస్తుంది**

ఎలక్టోరల్ బాండ్స్ ప్రపంచంలోనే అతి పెద్ద కుంభకోణమని రాహుల్ గాంధీ అన్నారు. సిబిఐ ఒక కంపెనీ బెదిరించిన నెలలోనే ఆ కంపెనీ ఎలక్టోరల్ బాండ్‌లను కొని బిజెపికి ఇస్తుందని, ఒక కంపెనీకి మౌలిక సదుపాయాల ప్రాజెక్టు మంజూరయ్యే 15 రోజుల ముందే బిజెపికి బాండ్ రూపంలో విరాళం ఇస్తుందన్నారు. కాంగ్రెస్ తరువాయి 2లో

## నిరుద్యోగం– ధరల పెరుగుదలే ప్రధాన సమస్యలు

కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిందే
సిపిఐ ఎన్నికల ప్రణాళిక విడుదల




**న్యూఢిల్లీ :** దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదలే ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) ఎన్నికల ప్రణాళికలో స్పష్టం చేసింది. 2024లో జరిగే 18వ లోక్‌సభ ఎన్నికలక పార్టీ ప్రణాళికను సిపిఐ శనివారంనాడు ఢిల్లీలోని అజయ్‌భవన్‌లో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శులు అజీజ్‌పాషా, బాలచంద్ర కాంగో తదితరులు విడుదల చేశారు. కేంద్రంలోని బిజెపి సారథ్యాన గల ప్రభుత్వం దేశానికి వినాశకరమైనదని రుజువైందని, అందువల్ల ప్రభుత్వాన్ని మార్చవలసిందేనని సిపిఐ మేనిఫెస్టో పిలుపు ఇచ్చింది. ఆర్థికపరిస్థితుల నిర్వహణలో వైఫల్యం కారణంగా నరేంద్ర మోడీ పరిపాలనలో దేశ ప్రజల జీవితాలు దుర్భరంగా మారాయని నిరుద్యోగం, ధరల పెరుగుదల ప్రజల ప్రధాన సమస్యలుగా మారాయని ఎన్నికల ప్రణాళిక పేర్కొంది. ‘‘బిజెపి పరిపాలన ఫలితంగా సంపన్నవర్గాలల్లో అసాధారణ రీతిలో సంపద కేంద్రీకరణకు దారి తీసింది, అదే సమయంలో పేదలు మరింత పేదరికంలోకి దిగజారారు. హిందుత్వ సిద్ధాంతమే లక్ష్యంగా ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ నియంత్రణలో ఉన్న బిజెపి, మనదేశ రాజ్యాంగ స్వరూపమైన సెక్యులరిజం, సోషలిజం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి మౌలిక విలువలపై దాడి చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. బిజెపి గనుక ఇదేవిధంగా అధికారంలో కొనసాగితే దేశ ప్రజల కష్టాలు మరింతగా పెరిగిపోతాయి, మోడీ విజయం రాజ్యాంగ లక్ష్యాలకు మరణశాసనంగా మారుతుంది’’ అని ఎన్నికల ప్రణాళిక పేర్కొంది.

**బ్యాలెట్ ద్వారా బుద్ధి చెప్పాలి**

‘‘ఈ లోక్‌సభ ఎన్నికలు మన దేశానికి, భవిష్యత్తుకు ఎంతో కీలకమైనవి. ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో బిజెపి విఫలమైంది. జనరంజకమైన, ప్రజల బాధలు, సమస్యలు పట్టించుకునే ప్రభుత్వం మాత్రమే ఈ సంక్షోభం నుండి ప్రజలను బయట పడేయగలదు. దేశంలో సామాజిక వ్యవస్థ, ప్రజల మధ్య సంబంధాలు చాలా ఒత్తిడికి గురి అవుతున్నాయి, కానీ మోడీ గ్యారంటీలు, వికసిత్ భారత్ పేరుతో దేశ ప్రజల దృష్టిని బిజెపి దారి మళ్ళించే ప్రయత్నం చేస్తోంది. అదేసమయంలో మనదేశ వ్యవసాయదారులు, గ్రామీణ ప్రజలు గతకంటే దారుణ కష్టాలు అనుభవిస్తున్నారు. మోడీ ఇంతకుముందు ఇచ్చిన గ్యారంటీలు, అచ్చే దిన్ వాగ్దానాలు ఏపోయాయో అందరికీ తెలిసిందే. మన స్వాతంత్ర్య సమరయోధులు లౌకిక, ప్రజాస్వామ్య, సంక్షేమరాజ్యంగా భారత దేశాన్ని తీర్చిదిద్దాలని కోరుకున్నారు. కాననీ బిజెపి ప్రయత్నాలతో ఈ విలువలన్నీ ప్రజా జీవితం నుండి తుడిచిపెట్టుకుపోతున్నాయి.నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరలు దారుణంగా పెరిగిపోయాయి. ఎన్నికల బాండ్ల బాగోతం వెలుగులోకి వచ్చాక ఆధునిక భారతదేశ చరిత్రలో బిజెపి అత్యంత అవినీతికర పార్టీగా అవతరించింది. నయానో భయాలో ఎలాగో అలా ఈ ఎన్నికల్లో గెలిచి తీరాలని బిజెపి భావిస్తున్నద, ఒదదుకోసం ప్రతిపక్షాలను భయపెట్టేందుకు ఇడి, సిబిఐ, ఆదాయపన్నుశాఖ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నది. ఈ నేపథ్యంలో ఓటర్లు తమ ఓటు హక్కు ద్వారా తీర్పు చెప్పి ఈ ప్రభుత్వాన్ని సాగనంపాలి. తగిన బుద్ధి చెప్పాలి. అందువల్ల పార్లమెంటు లోపలా, వెలుపలా ప్రజల తరపున పోరాటం చేసేందుకు భారత కమ్యూనిస్టుపార్టీ జనాభిప్రాయాన్ని కూడగడుతున్నది’.

**పార్టీ ఎన్నికల ప్రణాళికలో కీలక అంశాలు ఇవే**

* ప్రజలమధ్య స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం, లౌకికతత్వం, సోషలిజం, సమాఖ్యవాదం పెంపొందించేందుకు సిపిఐ పోరాడుతుంది.
* పెరుగుతున్న అసమానతల నిర్మూలన, సంపద పన్ను,వారసత్వ పన్ను, కార్పొరేట్ పన్ను పెంపుదల వంటి చర్యల ద్వారా దేశ వనరుల వృద్ధి చర్యలను సిపిఐ ప్రవేశపెడుతుంది.
* ఆరోగ్యం, విద్య, వైద్య రంగాలకు నిధుల పెంపు, విద్యా, ఆరోగ్య రంగాలలో మౌలిక సదుపాయాల పెంపుదల, ప్రజలకు వాటిని అందుబాటులోకి తేవడం.
* సమాన అవకాశాలతో ప్రభుత్వ రంగ వ్యవస్థకు ప్రోత్సాహం, ప్రైవేటు తరువాయి 2లో



తెలంగాణ–ఛత్తీస్‌గఢ్

## సరిహద్దుల్లో ఎన్‌కౌంటర్

ముగ్గురు మావోయిస్టులు హతం
ముమ్మర గాలింపు చర్యలు
బిక్కుబిక్కు మంటున్న అటవీ గ్రామాలు

ప్రజాపక్షం/భద్రాచలం/ములుగు

తెలంగాణలోని ములుగు జిల్లా వెంకటాపురం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని పూజారి కాంకేరీ జిల్లా అటవీ సరిహద్దుల్లో గల కర్రెగుట్టల్లో శనివారం ఎన్‌కౌంటర్ జరిగింది. ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు హతమయ్యారు. ఇందులో నిషేధిత మావోయిస్టు పార్టీ ప్లాటినం రెండో కమాండర్ సంతోష్ అలియాస్ సాగర్, అలియాస్ శ్రీధర్ లు ఉన్నట్లు తెలుస్తోంది. మృతదేహాలతో పాటు ఏకె 47, ఎల్‌ఎంజి తుపాకీ 1, 12 బోర్ తుపాకులతో పాటు పేలుడు పదార్థాలు, కిట్‌బ్యాగులు, విప్లవ సాహిత్యం స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బీజాపూర్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఎన్‌కౌంటర్‌ను బీజాపూర్ జిల్లా ఎస్‌పి జితేందర్ యాదవ్ తరువాయి 8లో

## మోడీ, గాంధీ పరివార్‌ల మధ్య యుద్ధం



మోడీ కుటుంబంలోని ఇవిఎం, ఇడి, సిబిఐ, ఐటి శాఖలను ఓడిస్తాం
‘జనజాతర’ సభలో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

వచ్చేది లోక్‌సభ ఎన్నికలు కాదని, మోడీ కుటుంబానికి, గాంధీ కుటుంబానికి మధ్య జరుగుతున్న యుద్ధమని, ఈ యుద్ధంలో గాంధీ కుటుంబం గెలుస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. మోడీ కుటుంబంలోని ఇవిఎం, ఇడి, సిబిఐ, ఆదాయ పన్ను శాఖలను ఓడిస్తామని ధీమా వ్యక్తం చేశారు. హెలిక్యాప్టర్‌లో విదేశీ పర్యాటన చేస్తూ, గంట గంటకూ దుస్తులను మారుస్తూ అబద్దాలు చెబుతున్న మోడీ ప్రధాని కావాలా?, నిత్యం ప్రజలలో ఉంటూ వారి కష్టాలు తెలుసుకునే రాహుల్ ప్రధాని కావాలా? ఒకసారి ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో భవిష్యత్తులో మంచి పాలన అందించాలన్నా, ఢిల్లీ నుండి మరిన్ని నిధులను, పలు అనుమతులను రాబట్టాలన్నా, మరింత అభివృద్ధి జరగాలన్నా రాష్ట్రంలో కాంగ్రెస్‌కు 14 మంది ఎంపిలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని తరువాయి 2లో

### ఏది పడితే అది మాట్లాడితే ఊరుకోం..

తమపై ఏది పడితే అది మాట్లాడితే ఊరుకోబోమని, ఎన్నికల ముందు తాము చెప్పినట్టుగా కెసిఆర్‌కు చర్లపల్లి జైలులో చిప్పకూడు తినిపిస్తామని సిఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. కెసిఆర్ కుటుంబ సభ్యుల కోసం చర్లపల్లి జైలులో డబుల్ బెడ్‌రూమ్ నిర్మిస్తామని అన్నారు. ఏదో కట్టె పట్టుకని నడుస్తున్నారని, కూమార్తె జైలులు వెళ్లిందని, ఇటువంటి సమయంలో కొంత కాలం సంయమనం పాటించాలని కెసిఆర్ పట్ల కొంత మానవత్వంతో ఆలోచిస్తే, కెసిఆర్ మాత్రం తమపై ఏది పడితే అది మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. డబుల్ బెడ్ రూమ్ కట్టిన ఇండ్లలో బిఆర్‌ఎస్, ఇందిరమ్మ ఇండ్లలో తాము ఓట్లు అడుగుదామని, కనీసం బిఆర్‌ఎస్‌కు డిపాజిటైనా వస్తుందో చూసుకుందామా? అని సవాలు విసిరారు. కరీంనగర్, తరువాయి 2లో





## బెంగాల్‌లో ఎన్‌ఐఎ అధికారుల కారుపై రాళ్ల దాడి

**కోల్‌కతా :** బంగాల్‌లో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ) వాహనంపై దాడి కలకలం రేపింది. 2022 బాంబు పేలుడు కేసులో దర్యాప్తు కోసం వెళ్లిన ఎన్‌ఐఎ అధికారుల వాహనాన్ని ఓ గుంపు చట్టుముట్టి రాళ్లు రువ్వారు. దీంతో వాహనం ధ్వంసమైంది. పేలుడు కేసుకు సంబంధించిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కోల్‌కతాకు తిరిగి వెళుతుండగా పుర్బా మేదినీపూర్ జిల్లాలోని భూపతినగర్ ప్రాంతంలో శనివారం ఈ ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో తమ అధికారి ఒకరు గాయపడ్డారని ఎన్‌ఐఎ తెలిపినట్లు ఓ సీనియర్ పోలీసు ఆఫీసర్ చెప్పారు. దీనిపై తరువాయి 8లో

## కాంగ్రెస్‌లోకి 25 మంది బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు !



కెసిఆర్ మాట్లాడిన ప్రతి మాటా అబద్ధమే
మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

కెసిఆర్ పొగరుతోనే బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎల సంఖ్య 104 నుంచి 39కి చేరిందని, ఇందులో 25 మంది కాంగ్రెస్‌లో చేరుతున్నారని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. నీటిపారుదల రంగంపైన శాసనసభలో చర్చ జరిగినప్పుడు కెసిఆర్ ఇంట్లో పడుకున్నారని, ఇప్పుడు పిచ్చిలేచినట్లుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ నైరాశ్యంలో వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. కమీషన్లకు కక్కుర్తి పడి అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కాస్త కాళేశ్వరం ప్రాజెక్టు గా మారిందని ఆరోపించారు. కెసిఆర్ కరీంనగర్ లో మాట్లాడిన ప్రతీ మాట అబద్దమేనని, తరువాయి 8లో

## ఉపాధి వసతులేవీ ?

పని ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కరువు
జాడలేని గుడారాలు, మెడికల్ కిట్లు
తీవ్రమైన ఎండతో కూలీల ఇబ్బందులు

ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి



ఉపాధి హామీ కూలీలు పని ప్రదేశాలలో అసౌకర్యాల మధ్య ఇబ్బందులు పడుతున్నారు. ఒక వైపు తీవ్రమైన ఎండ, మరో వైపు అసౌకర్యాల కొరత వారిని పట్టి పీడిస్తున్నాయి. కుటుంబానికి ఎంతో కొంత చేదోడుగా ఉంటుందన్న ఉద్దేశ్యంతో ఇజిఎస్ పనులకు వెలుతున్న వారికి ఇక్కట్లే ఎదురవుతున్నాయి. పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలైన తాగు నీరు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు, కాసేపు సేద దీరేందుకు నీడ కోసం టెంట్లు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం తీవ్రమైన ఎండ కాస్తుండడంతో పలువురు ఎండకు అస్వస్థతకు గురవుతున్నారు. గతంలో హనుమకొండ జిల్లాలో తీవ్రమైన ఎండ కారణంగా వడదెబ్బకు గురై ఇద్దరు ఉపాధి కూలీలు మృతి చెందిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఎండలు ప్రతాపం చూపిస్తున్నాయి. ఏప్రిల్ ప్రారంభం నుంచే వేడిగాలులు మొదలై వాతావరణం నిప్పుల కొలిమిని తలపిస్తూ వస్తున్నది. గడిచిన తరువాయి 2లో

## గిన్నిస్ రికార్డుల్లోకి 111 ఏళ్ళ ప్రపంచ వృద్ధుడు



**లండన్ :** బ్రిటన్‌కు చెందిన 111 సంవత్సరాలు వయసుగల జాన్ టిన్నిస్ వుడ్ ప్రపంచంలో ఇంకా సజీవంగా ఉన్న వృద్ధుడుగా గిన్నిస్ రికార్డులోకి ఎక్కారు. యునైటెడ్ కింగ్‌డన్ సౌత్‌పోర్టులో ఆయన నివసిస్తున్నారు. ఆయన రెండో ప్రపంచ యుద్ధంలో వేతనం తీసుకుని సైనికుడుగా పనిచేశారు. తాను ఈనాటికీ సజీవంగా ఉండటం వెనుక దాగి ఉన్న రహస్యం ''ప్యూర్ లక్'' మాత్రమేనని గిన్నిస్ రికార్డుల్లో చేరిన సందర్భంగా వ్యాఖ్యానించారు. కచ్చితంగా చెప్పాలంటే ఆయన వయసు 111 సంవత్సరాల 224 రోజులు. 1912 వ సంవత్సరం ఆగస్టు 26న జాన్ ఆల్ఫ్రెడ్ టిన్నిస్ వుడ్ లివర్‌పూల్‌లో జన్మించారు. సైన్యంలో పనిచేశాక ఆయన ఎకౌంటెంట్‌గా స్థిరపడ్డారు. వెనిజులాకు చెందిన జువాన్ వెసెంటే పెరెజ్ మోరా ఏప్రిల్ 2వ తేదీన మరణిచడంతో ఆయన స్థానంలో టిన్నిస్‌వుడ్ ప్రపంచ వృద్ధుడుగా గిన్నిస్ రికార్డుల్లో గుర్తింపు పొందారు. పెరెజ్ మోరా 114 సంవత్సరాల 311 రోజులు జీవించిన తర్వాత నాలుగు రోజుల క్రితం మరణించారు.

## ఈక్వెడార్‌తో బంధం తెంచుకున్న మెక్సికో

**క్విటో :** దక్షిణ అమెరికాలోని వాయువ్యప్రాంత దేశం ఈక్వెడార్‌తో మెక్సికో ప్రభుత్వం దౌత్యసంబంధాలు తెంచుకుంది. ఈక్వెడార్‌లో అత్యంత అవినీతి పరుడుగా ముద్ర పడిన ఆ దేశ మాజీ ఉపాధ్యక్షుడు జోర్జ్ గ్లాస్ గడచిన ఐదు నెలలుగా మెక్సికో దౌత్యకార్యాలయాన్ని ఆశ్రయించి అక్కడే ఉంటున్నారు. ఐతే ఈక్వెడార్ పోలీసులు శుక్రవారం సాయంత్రం మెక్సికో దౌత్యకార్యాలయంలోకి దౌర్జన్యంగా ప్రవేశించి గ్లాస్‌ను అరెస్టు చేసి తీసుకుపోయారు. గ్లాస్ తమ దేశంలో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ అని పోలీసులు చెప్పారు. దీంతో మెక్సికో ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈక్వెడార్ పోలీసులు తలుపులు బద్దలుకొట్టి బలవతంగా దౌత్యకార్యాలయంలోకి ప్రవేశించారనీ, ఆ దేశంతో బంధం తెంచుకుంటున్నామనీ మెక్సికో దేశాధ్యక్షుడు ఆండ్రూస్ మాన్యువల్ లోపెజ్ ఒబ్రాదర్ ప్రటించారు. కాగా పోలీసుల దాడిలో అనేకమంది దౌత్యవేత్తలు గాయపడ్డారని మెక్సికో విదేశీ సంబంధాల కార్యదర్శి అలిసియా బార్‌సెనా చెప్పారు.




# ఐక్యరాజ్యసమితికి ఇజ్రాయిల్ క్షమాపణ

### మానవతా సహాయ పంపిణీకి తలుపు తెరుస్తాం
### కైరోలో చర్చలకు నేతన్యాహు సంసిద్ధత

**టెల్అవీవ్ :** గాజాలో జరిగిన దాడుల్లో ఐక్యరాజ్యమితి ఎయిడ్ వర్కర్లు ఏడుగురు మరణించిన ఘటనపై ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ఒత్తిడితో ఇజ్రాయిల్ ఉక్కిరి బిక్కిరి అవుతున్నది. బిక్కమొఖం వేస్తున్నది. వరల్డ్ కిచెన్ సెంటర్ కాన్వాయ్ వాహనాలపై దాడి అత్యంత విషాదకరమైన తప్పిదని ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. సాంకేతిక పరమైన లోపాల కారణంగా వరుస తప్పిదాలు జరిగాయని అంగీకరించింది. ఇలాంటి తప్పిదాలు మరోసారి జరగకుండా చూస్తామని కూడా ఇజ్రాయిల్ సైన్యం భరోసా ఇచ్చింది. ఇదే నేపథ్యంలో ఐక్యరాజ్యసమితికి ఇజ్రాయిల్ దౌత్యవేత్త కూడా క్షమాపణలు తెలియజేశారు. గడచిన సోమవారం సైన్యం జరిపిన దాడిలో వరల్డ్ కిచెన్ సెంటర్ ఫౌండేషన్‌కు చెందిన ఏడుగు రు కార్యకర్తలు మరణించారు. ఐతే దీనిపై ఇజ్రాయిల్ చేసిన దర్యాప్తులో కనుగొన్న విషయాలపై తమకు నమ్మకం లేదని స్వతంత్ర దర్యాప్తు జరపాలని వరల్డ్ కిచెన్ సెంటర్ ఫౌండేషన్ డిమాండ్ చేసింది. కైరోలో చర్చలకు సంసిద్ధత వ్యక్తం చేసింది. అదేవిధంగా గాజా ఉత్తర భాగంలోకి ప్రవేశించి మానవతా సహాయాన్ని తరలించేందుకు వీలుగా ఎరెజ్ క్రాసింగ్‌ను తెరుస్తామని కూడా ఇజ్రాయిల్ ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునక్ ఇజ్రాయిల్ తీరును తీవ్రంగా ఖండించారు. హమాస్‌ను చర్చలకు వచ్చేందుకు వీలుగా మధ్యవర్తుగా ఒప్పించాలని ఈజిప్టు, ఖతార్ దేశాల నాయకులకు జో బైడెన్ విజ్ఞప్తి చేశారు. సిఐఎ డైరెక్టర్ బిల్ బర్న్ నాయకత్వానగల ఒక బృందం కూడా తన పర్యటన సందర్భంగా హమాస్‌ను చర్చకు ఒప్పించాలని కోరారు. సిరియాపై దాడుల నేపథ్యంలో ప్రతి దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరిక కారణంగా అమెరికా కూడా హై ఎలర్ట్ ప్రకటించింది. కాగా గాజాలో లక్ష్యాలపై దాడులు చేయడానికి ఇజ్రాయిల్ సైన్యం ఆర్టిఫీషియల్ ఇంటిలిజన్స్‌ను ఉపయోగించిందనత్రలు ప్రపంచ దేశాలకు కలవరం కలిగిస్తున్నా రు. గత ఏడాది అక్టోబరు 7న పాలస్తినా–ఇజ్రాయిల్ మధ్య యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇప్పటివరకూ ఇజ్రాయిల్ దాడుల్లో 136 మంది జర్నలిస్టులు మరణించారు. 33,000 మంది పాలస్తీనియన్లు, 173 మంది ఐ క్యరాజ్యసమితి సిబ్బంది, వందలమంది పాలస్తినా ఆరో గ్య కార్యకర్తలు మరణించారు. 70 లక్షలమంది ఇళ్ళు కోల్పోయారు. 75,750 మంది గాయపడ్డారు. మరోవైపు 256 మంది ఇజ్రాయిల్ సైనికులు మరణించారు.






## ఖార్కీవ్‌పై రష్యా క్షిపణి దాడి
### ఆరుగురు మృతి

**కీవ్ :** ఉక్రేన్ నగరం ఖార్కీవ్‌పై రష్యా డ్రోన్లు, క్షిపణులతో తాజా దాడులు జరిపింది. ఈ దాడుల్లో ఆరుగురు పౌరులు మరణించారు. మరో 11 మంది గాయపడ్డారని స్థానిక అధికారులు తెలియజేశారు. క్షిపణి దాడుల్లో స్థానిక నివాసిత భవనాలు, గ్యాస్ స్టేషన్, చిన్న పిల్లల సంరక్షణ కేంద్రం, ఒక కేఫ్‌తో పాటు కార్లు కూడా ధ్వంసమయ్యాయని తెలియజేశారు. శుక్రవారం రాత్రి పొద్దుపోయాక 32 క్షిపఫేలపే. 28 డ్రోన్లను రష్యా ప్రయోగించిందని లెఫ్టినెంట్ జనరల్ మైకోలా ఓలెష్చుక్ చెప్పారు. ఈ దాడి ఫలితాలపై రష్యా సైనికులు ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదు. దీనికి ప్రతిగా ఉక్రేన్ శనివారం ఉదయం వాంపైర్ రాకెట్లను రష్యాపై ప్రయోగించింది. ఐతే వీటిల్లో పది డ్రోన్లను రష్యా బెల్‌గోరోడ్ ప్రాంత సరిహద్దుల్లోనే కూ ల్చివేసింది. రష్యా రక్షణ మంత్రిత్వశాఖ ఈ విషయం వెల్లడించిం ది. కాగా రష్యా పదాతిదళ విభాగాలు తమ భూభాగంలోకి చొచ్చుకువచ్చాయని, వారిని వెనక్కు నెట్టడం కష్టంగా మారిందనీ ఉక్రేన్ కమాండర్ ఒలెంకసాంద్ర సైర్స్కి చెప్పారు.

## చైనా సముద్రంలో కయ్యానికి కాలుదువ్వుతున్న అమెరికా

### నేడు నౌకా విన్యాసాలు

**మనీలా :** వివాదాస్పద దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో ఆమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, ఫిలిప్పైన్స్ దేశాలే ఆదివారం నావికా దళాలు విన్యాలు చేయడానికి స న్నద్ధమయ్యాయి. ఒకవైపు చైనాతో రోజువారీ సంభాషణలు చేస్తూనే మరోవైపు ఆసి యా పసిఫిక్ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెంచేందుకు అమెరికా ఆజ్యం పోస్తున్నది. మొట్ట మొదటిసారి ఈ నాలు గు దేశాలూ నౌకా విన్యాసాలు తలపెట్టాయి. వీటి ల్లో జలాంతర్గాములను ప్రతిఘటించే యుద్ధవిన్యాసాలు కూడా చేస్తారు. అమెరికా పిలిప్పై న్స్ చర్యలను చైనా తీవ్రంగా వ్యతిరేకించింది. వీటిని దుందుడుకు చర్యగా అభివర్ణించింది. దక్షిణ చైనా సముద్రంలో సర్వ హక్కులూ తమవేనని ఇప్పటికే చైనా ప్రకటించింది. రెచ్చగొట్టే చర్యలకు తలపడవద్దనికూడా హెచ్చరించింది. ఇండో–పసిఫిక్ ప్రాంతం లో శాంతి సాధనకు, నౌకా రవాణా స్వేచ్ఛగా సజావుగా కొనసాగడానికి వీలుగా ఈ విన్యాసాలు దోహ దం చేస్తాయని భాగస్వామ్య దేశాలు తెలియజేశా యి. దక్షిణ చైనా సముద్రంలో చైనా విస్తరణవాదం చెల్లుబాటు కాదని, 2016 నాటి అంతర్జాతీయ మ ధ్యవర్తిత్వ నిబంధనల వైఖరికి కట్టుబడిఉండాని పే ర్కొన్నాయి. చైనా దీనిని తిరస్కరించింది. ఈ సము ద్ర జలాల విషయంలో చైనా – పిలిప్పైన్స్ మధ్య 2013 నుండి వివాదం కొనసాగుతున్నది. ఐతే చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ఈ విన్యాసాల ప్రతిపాదన పై తీవ్రంగా స్పందించింది. ఈ విధమైన చర్యలు ప్రా దేశిక ప్రయోజనాలకు తీవ్ర విఘాత కలిగిస్తాయని, సముద్ర జలాల్లో రాకపోకల భద్రతకు నష్టం వాటిల్లుతుందని హెచ్చరించింది. కాగా జపాన్ ప్రభుత్వం దీనిపై స్పందిస్తూ ఈ ప్రాంత శాంతి ప్రయోజనాలపై దక్షిణ చైనా జలాల వివాదం తీవ్ర ప్రభావం చూపిస్తోందని వ్యాఖ్యానించింది. ఈ ప్రాంత జలాలలో అ న్ని దేశాల నౌకలూ స్వేచ్ఛగాప్రయాణించడానికి పూర్తి భరోసా ఉండాలని ఆమెరికా రక్షణశాఖామంత్రి లోయడ్ ఆస్టిన్ పేర్కొన్నారు.

**బైడెన్ – జిన్‌పింగ్ ఫోన్ సంభాషణ**

ఒకవైపు అమెరికా–చైనా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నప్పటికీ శాన్‌ఫ్రాన్సిస్కో ఒప్పందం మేరకు రెండు దేశాలమధ్య ఉద్రిక్తతల నియంత్రణపై అప్పడప్పుడు సంభాషణలు జరుగుతున్నాయి. ఇందులోభాగంగా గడచిన మంగళవారం అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ విజ్ఞప్తి మేరకు చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్,బైడెన్ మధ్య ఫోన్ సంభాషణ జరిగింది. భవిష్యత్ సహకారాన్ని కొనసాగించేందుకు ఈ ఆదాన ప్రదానాలు కొనసాగాలని రెండు దేశాల నాయకులూ అభిప్రాయ పడ్డారు. గత ఏడాది నవంబరులో జిన్‌పింగ్ అమెరికా పర్యటన సందర్భంగా తరచు రెండు దేశాల నాయకులమధ్య సంభాషణలు జరగాలన్న ఒప్పందం జరిగింది.

## ఇద్దరు మహిళలు సహా భువికి దిగొచ్చిన ముగ్గురు వ్యోమగాములు



**మాస్కో :** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుండి ముగ్గురు వ్యోమగాములు సురక్షితంగా భువికి చేరుకున్నారు. కజకస్థాన్‌లోని గడ్డి భూముల్లో సోయూజ్ క్యాప్సూల్ ఎంఎస్–24 శనివారంనాడు దిగింది. రష్యాకు చెందిన వ్యోమగామి ఓలెజ్ నోవిట్‌స్కీ, నాసాకు చెందిన వ్యోమగాములు లోరెల్ ఓహరా, బెలారస్‌కు చెందిన మరినా వాసిలెవ్‌స్కయాలు శనివారం మధ్యాహ్నం 12.17 గంటలకు భూమి మీద తిరిగి కాలుపెట్టిరు. దీంతో ప్రస్తుతం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో నాసాకు చెందిన మైఖేల్ బారెట్, ట్రేసీ డైసన్, మాథ్యూ డొమినిక్, జీన్నెట్ ఎప్స్, రష్యాకు చెందిన కాస్మొనాట్లు నికొలాయ్ ఛబ్, అలెగ్జాండర్ గ్రబెన్‌కిన్, ఓలెజ్ కొనోనెంకోలు ప్రస్తుతం అక్కడే ఉన్నారు. ఓహరా మొత్తం 204 రోజులు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో గడిపారని నాసా వెల్లడించింది. గత ఏడాది సెప్టెంబరు 15న ఓహరా అంతరిక్షంలోకి వెళ్ళారు. ప్రచ్ఛన్న యుద్ధానంతర అంతర్జాతీయ సహకారంలో భాగంగా ఈ అంతర్జాతీయ అంతరిక్షకేంద్రం పనిచేస్తోంది. 2030 వరకూ ఈ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం చురుగ్గా పనిచేస్తుంది.



## పరివార్‌ల మధ్య యుద్ధం
(మొదటి పేజీ తరువాయి)

తుక్కుగూడలో శనివారం జరిగిన ''జనజాతర '' సభలో సిఎం రేవంత్ రెడ్డి ప్ర సంగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ వంద రోజుల పాలనను ప్రజల ముందు పెట్టామని, సంక్షేమ పథకాలు, ఆరు గ్యారంటీ అమలు తీరును చూసి ప్రజలు రాష్ట్రంలో 14 ఎంపి స్థానాలను గెలిపించాలని, తమ పాలన మంచిగా లేకపో తే ఓట్లు వేయాలా? లేదా? ఆలోచన చేయాలని కోరారు. ఇందిరామ్మ రాజీ వ్, సోనియా గాంధీ, దేశ ప్రజల కోసం ప్రాణాలు త్యాగం చేసేందుకు సిద్ధమైన రాహుల్ , ప్రియాంక గాంధీ, లక్షలాది మంది కాంగ్రెస్ శ్రేణులే గాంధీ కుటుంబమని వివరించారు. రాజ్యాంగ , ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రస్తు తం జరగబోతున్న యుద్ధంలో కాంగ్రెస్ శ్రేణులంతా భాగస్వాములు కావాలని, రాహుల్‌వెంట తెలంగాణ ప్రజలు, తాము అందరూ అండగా ఉన్నామని రేవంత్ రెడ్డి భరోసనిచ్చారు. జూన్ 4న జరిగే ఎన్నికల ఫలితాల్లో 'ఇండియా కూటమి' గెలిచి, జూన్ 9న ఎర్రకోటలో మువ్వెన్నల జెండాను ఎగురవేసేందుకు రాహుల్ గాంధీ ఇక్కడికి(తెలంగాణకు) వచ్చారాన్నరు. ఉత్తర తెలంగాణలో గోదావరి నది, దక్షిణ నుండి కృష్ణా నది పోటెత్తి ఉక్కుగూడలో సునామిసృష్టిస్తే ఎలా ఉంటుందో, రాజీవ్ గాంధీ ప్రాంగణానికి అందరూ కదం తొక్కారని అన్నారు.

**బిజెపిని తుక్కుతుక్కుగా తొక్కుదాం:** తుక్కుగూడలో అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌ను ఎలా తుక్కుతక్కుగా తొక్కామో, అదే ఊపుతో, పట్టుదలతో బిజెపిని కూడా తుక్కుతుక్కుగా తొక్కాలన్నారు. కార్యకర్తలే పార్టీకి పునాది అని, పునాది బలంగా ఉండాలన్నారు. ఎంతో మంది కార్యకర్తలు జైలులో ఉన్నారని, తమ రక్తాన్ని చమటగా మార్చి, చివరకు ఊపరిని వదిలినా, మువ్వెన్నల జెండాను మాత్రం వదిలిపెట్లేదని, అటువంటి కార్యకర్తల త్యాగం, కష్టంతోనే రాష్ట్రంలో ఇందిరామ్మ రాజ్యం ఏర్పడిందని రేవంత్ అన్నారు. సోనియాగాంధీ సంక్షేమాలను, ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామన్నారు. బిఆర్‌ఎస్‌ను బొంద పెట్టినట్టుగానే బిజెపిని కూడా బొందపెట్టే వరకు నిద్రపోవద్దన్నారు. జాతీయ స్థాయిలో గుజరాత్ మోడల్‌పైన వైబ్రేంట్ తెలంగాణ మోడల్ ఆదిపత్యాన్ని చూపిస్తూ, తెలంగాణ అభివృద్ధి దేశాన్ని నడిపిస్తుందని చెప్పారు.

**హమీలు అమలు చేయనందుకు ఓటు వేయాలా? : రేవంత్ రెడ్డి**

బిజెపి తమకు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారని, 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సిన మోడీ ప్రభుత్వం,ఈ పదేళ్ల కాలంలో 7,21,000 ఉద్యోగాలు ఇచ్చినందుకు, రైతులను చంపినందుకు లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి ఓటు వేయాలా? అని రేవంత్ రెడ్డి కేంద్రంలోని బిజెపిని నిలదీశారు. రైతుల ఆధాయం రెండింతలు చేస్తామని చెప్పిన మోడీ ప్రభుత్వం, నల్లా చట్టాలకు వ్యతిరేకంగా సైనికుల్లా పోరటం చేసి, 750 రైతులు అమరులయ్యారన్నారు. ప్రతి ఒక్కరికీ ఇల్లు ఇస్తామని చెప్పిన మోడీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో పదేళ్ల కాలంలో ఎంత మందికి ఇండ్లు ఇచ్చారో సమాధానం చెప్పి, తెలంగాణలో ఓట్లు అడగాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సవాల్ విసిరారు. మతాల మధ్య చిచ్చు పెట్టి,దక్షిణ ,ఉత్తర భారతదేశంగా విభజించే పరిస్థితి తెచ్చినందుకు బిజెపికి ఓట్లు వేయాలా అని మండిపడ్డారు. హైదరాబాద్‌లో వరదలు వస్తే, సికింద్రాబాద్ ఎంపిగా ప్రతినిధ్యం వహించే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఒక్కపైసా తీసుకొచ్చారా? , సిగ్గు లేకుండా ఇప్పుడు ఓట్లు అడుగుతున్నారని దుయ్యబట్టారు. నమో అంటే నమ్మితే మోసం అని, మరోసారి బిజెపికి ఓటు వేస్తే మోడీ ఏమైనా చంద్రమండలానికి రాజు అవుతారా? అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ చేసిన విభజన హామీలలో బయ్యారం ఉక్కు కార్మాగరం, పాలమూరుకు జాతీయ మోదా ఇవ్వలేదని, ఏడు మండలాలను బిజెపి ఎపికి తాకట్టు పెట్టిందని విమర్శించారు.

## మాట్లాడితే ఊరుకోం..
(మొదటి పేజీ తరువాయి)

సూర్యాపేటలో కెసిఆర్ వాడిన భాషపై రేవంత్ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కెసిఆర్ పదేళ్ల సిఎంగా తెలంగాణ రాష్ట్రాన్ని పట్టి పీడించారని, దోపిడీదొంగ తరహా వ్యవహారించారని మండిపడ్డారు. ఈ పదేళ్ల కాలంలో తెలంగాణను వంద సంవత్సరాల విధ్వంసం చేశారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతభత్యాలు ఇవ్వలేని ఆర్థిక పరిస్థితిని భట్టి విక్రమార్క గాడిలో పెట్టారని రేవంత్ అన్నారు.

# ఎవరి వాటా వారికే...
(మొదటి పేజీ తరువాయి)

తెలుసునని చెప్పారు.

**యువతకు ఏటా రూ.లక్ష గ్యారంటీ..**




భారతదేశంలో 40 ఏళ్ళలో అత్యధికంగా నిరుద్యోగం ఉన్నదని, కానీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 30 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిందని, కొద్ది రోజుల్లేనే మరో 50 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు రాబోతున్నాయని రాహుల్ గాంధీ తెలిపారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో ఆత్మ ఐదు గ్యారంటీలు (పాంచ్ గ్యారంటీలు) అని, వాటిలో అన్నిటికంటే మొదటి గ్యారంటీ నిరుద్యోగుల కోసమని, భారతీయ యువత కోసం ఏటా రూ.1లక్ష ఉద్యోగం ప్రతి యువకుడికి దొరుకుతుందన్నారు. దీనికోసం మేము ఒక్క అప్రంటిస్‌షిప్ చట్టం తీసుకువస్తామని, దీని ద్వారా భారతదేశంలోని ప్రతి యువకుడికి ఉపాధి హామీ పథకంలో తరహాలో ఒక ఏడాది ప్రభుత్వ రంగం, ప్రైవేటు రంగం, ఆరోగ్య, వైద్య రంగాలలో ఏదో ఒక రంగంలో అప్రంటిస్ గ్యారంటీ ఇస్తామన్నారు. ఒక ఏడాది అప్రెంటిస్ షిప్ కింద రూ.లక్ష ఇస్తామని వివరించారు.

**రూ.లక్ష కంటే తక్కువ కుటుంబం ఉండబోదు..**

భారతదేశంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కోట్లాది ప్రజలు తిరిగి పేదరికంలోకి జారి పోయారని రాహుల్ గాంధీ తెలిపారు. అందుకే తాము నారీ న్యాయ్ చట్టం తీసుకురానున్నామన్నారు. దీని ద్వారా దేశంలో ప్రతి పేద కుటుంబంలో ఒక మహిళలకు ఏటా రూ.లక్ష బ్యాంకు అకౌంట్‌లో వేస్తామని, ఇది విప్లవాదత్మక అడుగు, ఇది దేశ ముఖచిత్రం మారబోతుందన్నారు. దీని అర్థం భారతదేశంలో ఏ కుటుంబ వార్షికాదాయం రూ.లక్ష కంటే తక్కువ ఉండబోదన్నారు.

**రైతులకు ఒక రూపాయి మాఫీ చేయలేదు..**

దేశంలో రోజుకు 30 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, నరేంద్ర మోడీ భారతదేశంలో అత్యంత ధనికుల కోసం రూ.16 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేశారే తప్ప రైతులకు ఒక్క రూపాయి రుణమాఫీ చేయలేదని రాహుల్ గాంధీ విమర్శించారు. అందుకే తాము రైతుల కోసం 'కిసాన్ న్యాయ్' పేరుతో మూడవ గ్యారంటీ ద్వారా రైతుల అప్పులు మాఫీ చేస్తామని, స్వామినాథన్ ఫార్ములా ప్రకారం పంటలకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర గ్యారంటీ ఇస్తామని తెలిపారు.

**రోజుకు రూ.400 కనీస వేతనం ..**

కాంగ్రెస్ నాలుగవ వాగ్దానం 'శ్రామిక్ న్యాయ్' అని , దీని ద్వారా దేశంలో ఉపాధి హామీ సహా, ఇతర కార్మికులకు ఉపాధి మామీ కోసం,ఇతర కార్మికుల కోసం కనీసం ప్రతి రోజు రూ.400 ఇవ్వబోతున్నాయని రాహుల్ గాంధీ ప్రకటించారు.

**90 శాతం జనాభాకు అన్నిట్లో వారి వాటా ఇస్తాం..**

భారతదేశంలో 50 శాతం జనాభా ఒబిసి, 15 శాతం జనాభా ఎస్‌సి, 8 శాతం జనాభా ఆదివాసీలు, 15 శాతం జనాభా మైనారిటీలు, 5 శాతం జనాభా జనరల్ కేటగిరిలో పేదలదని , వీరందరినీ కలిపితే జనాభాలో 90 శాతం ఉంటారని రాహుల్‌గాంధీ తెలిపారు. కాని భారతదేశ సంస్థలు, కంపెనీలలో ఈ 90 శాతం మంది కనిపించరని అన్నారు. మీడియాలో అతి పెద్ద కంపెనీ జాబితా తీస్తే , వారి యజమానులో ఒక బిసి, దళిత, ఆదివాసీ , మైనారిటీ కనిపించబోరని, దేశంలో అతిపెద్ద 200 కంపెనీల యజమానుల జాబితాలో వారు ఉండరని ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశ ప్రభుత్వాన్ని 90 మంది ఐఎఎస్ అధికారులు నడిపిస్తారని, వారిలో ఓబిసి అధికారులు ముగ్గురే అని, 50శాతం జనాభా ఉన్న ఓబిసిల వాటా కేవలం 5 శాతమేనని చెప్పారు. ఎస్‌టిలు జనాభా 8 శాతం ఉంటే, 90 మంది ఐఎఎస్‌లలో ఒక్కరే ఆ వర్గం నుండి ఉన్నారని, కేవలం ముగ్గురు దళితులు ఉన్నారని వివరించారు. బడ్జెట్‌లో వంద రూపాయలు ఖర్చు పెడితే, అందులో ఒబిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ, వర్గాల అధికారులే కేవలం 7 శాతం మాత్రమే నిర్ణయం తీసుకుంటారని అన్నారు. అందుకే దేశవ్యాప్తంగా కుల గణన చేస్తామని, తరవాత ఆర్థిక, సంస్థాగత సర్వే చేస్తామని, దీంతో ఒబిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ , జనరల్ కేటగిరిలో పేదల వాటా ఎంతో తెలిసిపోతుందన్నారు.

## అతిపెద్ద వాషింగ్ మెషిన్ బిజెపి
(మొదటి పేజీ తరువాయి)

పార్టీ బ్యాంక్ ఖాతాలన్నీ బంద్ చేశారని, కాని మేము వీళ్ళకు భయపడబోమని స్పష్టం చేశారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలకుర రాజ్యాంగం రక్షణ కల్పిస్తుందని, బిజెపి అదే రాజ్యాంగాన్ని రద్దు చేయాలని చూస్తోందన్నారు. తాము రాజ్యాంగాన్ని ఎన్నటికీ రద్దు కానివ్వబోమన్నారు. తాము చేసేది రాజ్యాంగం, లౌకికవాదాన్ని పరిరక్షించే పోరాటమని, నరేంద్ర మోడీ కేవలం 3 – 4 శాతం ప్రజల కోసమే పని చేస్తున్నారని, వాళ్ళ దగ్గర మీడియా, ధనం, ఇంటెలిజెన్స్, సిబిఐ, ఇడిలు ఉన్నాయని, మా దగ్గర నిజం, ప్రేమ మాత్రమే ఉన్నాయన్నారు.

**ఎప్పుడు పిలిచినా తెలంగాణకు వస్తా.. :** కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే ఎలాగైనా అమలు చేస్తుందని తెలంగాణ ప్రజలకు బాగా తెలుసునని, అలాగే జాతీయ స్థాయిలో కూడా గ్యారంటీలను అమలు చేస్తామని రాహుల్‌గాంధీ తెలిపారు. తానిక్కడ రాజకీయ ప్రసంగం చేశానని, కాని తెలంగాణ ప్రజలతో తనది రాజకీయ బంధం కాదని, కుటుంబ బంధమని చెప్పారు. సోనియాజీ మీకు మద్దతు ఇచ్చారని, తాను కూడా మీ సిపాయిలాగా ఢిల్లీలో పని చేస్తానన్నారు. తెలంగాణ ప్రజలు చిన్న సైగ చేసినా చాలు వెంటనే ఇక్కడకు వస్తానని, మీ ముందు ఉంటానని చెప్పారు. ఇదేదో రెండు మూడేళ్ళ కోసం మాట్లాడడం లేదని, జీవితాంతం తాను తెలంగాణలో చిన్న పిల్లాడు పిలిచినా వెంటనే వస్తానన్నారు. దేశానికి అత్యంత కొత్త రాష్ట్రమైన తెలంగాణ దారి చూపుతోందని, మేడిన్ చైనాతో మేడిన్ తెలంగాణ పోటీ పడాలని, అలాగే అన్ని రాష్ట్రాలు రావాలని కోరారు. దేశంలో బిజెపి విద్వేషం వ్యాపింపజేస్తే, తెలంగాణలో మాత్రం విద్వేష బజారులో లక్షలాది ప్రేమ దుకాణాలు తెరిచారన్నారు.

## ఉపాధి వసతులేవీ?
(మొదటి పేజీ తరువాయి)

వారం రోజులుగా మరింతగా ఉష్ణోగ్రతలు పెరిగి జిల్లాలో 43 డిగ్రీలకు చేరుకున్నది. దీంతో జనం బయటికి రావాలంటేనే జంకుతున్న పరిస్థితి ఏర్పడిం ది. ఈ క్రమంలో ఉపాధి హామీ కూలీలు ఉదయం 7 గంటలకే పనిలోకి వెలుతున్నా అప్పటికే వేడి మొదలై మధ్యాహ్నం వరకు తీవ్ర రూపం దాల్చుతున్నది.కానీ కూలీలు పని చేసే ప్రదేశాలలో కొద్ది సేపు సేద దీరేందుకు,ఎండ నుంచి రక్షణ పొందేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేయడం లేదు.ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 1688 గ్రామ పంచాయతీలు ఉండగా వీటి పరిధిలో దాదాపు 7.12 లక్షల ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉండగా,సుమారు 12 లక్షల మంది కూళీలు ఈజీఎస్‌లో పని చేస్తున్నారు. వీరందరికీ పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని చట్టంలో ఉన్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అమలు చేయడం లేదు.పని ప్రదేశంలో నీడ కల్పించేందుకు గతంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు పంచాయతీ పరిధి,కూళీల సంఖ్యను బట్టి టార్పాలిన్లు,టెంట్లు అందజేశారు.కానీ అవి ప్రస్తుతం ఎక్కడా కనిపించడం లేదు.అలాగే కూళీలకు ఎండదెబ్బ తగులకుండా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు,నీళ్లు ఇవ్వాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని కూళీలు వాపోతున్నారు.

**పని ప్రాంతాల్లో సరైన సౌకర్యాలు కరువు :** ఎండలు ముదురుతున్న నేపథ్యంలో జిల్లాలో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పని ప్రాంతాల్లో సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో అవస్థలు ఎదుర్కోంటున్నారు. మండుటెండల్లో పనులు చేసి అలసిన కూలీలు సేద తీరడానికి అవసరమైన టెంట్లు వేయాల్సి ఉన్నా..కొన్నేళ్ల నుంచి వీటిని సరఫరా చేయడం లేదు. దీంతో ఎండలోనే భోజనం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. వేసవిలో మార్చి నుంచి జూన్ రెండో వారం వరకు జరిగే ఉపాధి పనులు జరిగే ప్రాంతాల్లో కూలీలకు సరైన వసతులు కల్పించి,వడ దెబ్బ తగలకుండా గుడారాలు వేసి రక్షణ కల్పించాల్సి ఉంటుంది. కానీ ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. దీంతో కూలీలు ఎండలో పనిచేస్తూ తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. పనులు చేసే సమయంలో కూలీలకు ఏదైనా గాయానికి గురైతే అక్కడే ప్రథమ చికిత్స అందించాలి. వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి. కానీ జిల్లా వ్యాప్తంగ ఇవెక్కడా కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం నీటి వనరుల్లో పూడిక తీత, పంటల కాలువలు,మట్టిదారుల నిర్మాణాలు,కందకాల తవ్వకాలు, వరద మళ్లింపు,నర్సరీల్లో మొక్కలు పెంపకం తదితర పనులు కొనసాగుతు న్నాయి. ప్రభుత్వమే గడ్డపార,పార,గుల్ల(తట్ట) పంపిణి చేయాలి,రాష్ట్ర ఆ విర్భావానికి ముందు ఇవన్నీ ఉచితంగా ఇచ్చారు. కానీ ఇప్పుడు వాటి ఊసేలేదు.

# నిరుద్యోగం–ధరల పెరుగుదలే
(మొదటి పేజీ తరువాయి)

రంగంలో కూడా రిజర్వేషన్లకు ప్రోత్సాహం

- చట్టపరంగా రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని తొలగించేందుకు రాజకీయ, న్యాయపరమైన పోరాటాన్ని సిపిఐ కొనసాగిస్తుంది.
- నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ నిబంధనలు తొలగించి వెంటనేమహిళా రిజర్వేషన్ అమలుకు పోరాటం
- స్తంభించిన జనగణన చేసేందుకు పోరాటం.
- అణగారిన వర్గాలకు విద్య, కుల గణన
- పౌరసత్వ సవరణ చట్టం రద్దు
- ఉపాధిహామీ పథకం కింద కూలీలకు రోజువారీ వేతనం రూ.700, ఏడాదికి 200 రోజులు పని లభించేలా చర్యలు
- పట్టణ ఉద్యోగ హామీ చట్టం, గిగ్ వర్కర్లకు సాంఘిక భద్రతకు పోరాటం.
- అగౌరవకరమైన అగ్నిపథ్ పథకం రద్దుకు డిమాండ్
- పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు కృషి
- కేంద్ర దర్యాప్తు సంస్థలు పక్షపాతం లేకుండా పనిచేసేందుకు వాటిని దుర్వినియోగం చేయకుండా పార్లమెంటు పరిధిలోకి తీసుకురావడం
- సమాఖ్యవ్యవస్థ పటిష్టతకోసం గవర్నర్ల వ్యవస్థ రద్దుకోసం పోరాటాన్ని కొనసాగించడం
- ప్రవేశపరీక్షల్లో పాఠ్యాంశాలు వంటి విధానపరమైన పెద్ద నిర్ణయాలు రాష్ట్రాల జాబితాలోకి వచ్చేలా కృషి
- పుదుచ్చేరి, ఎన్‌సిటి ఢిల్లీలకు పూర్తి రాష్ట్రప్రతిపత్తి తేవడం, జమ్మూ కశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తిని పునరుద్ధరించడం
- మణిపూర్‌లో శాంతికి కృషి
- ఎన్నికలకు ప్రభుత్వ నిధుల సమకూర్పు (ఇంద్రజిత్ గుప్తా కమిటీ సిఫార్సు)తో పాటు సమగ్ర ఎన్నికల సంస్కరణలకు ప్రజాభిప్రాయ సేకరణ.
- సిఇసి, ఇసిల నియామకంలో కార్యనిర్వహణా వ్యవస్థ జోక్యం నిర్మూలన, ఎన్నికల సంఘం సర్వస్వతంత్రతకు కృషి
- నీతీ ఆయోగ్ రద్దు, ప్రణాళికా సంఘం పునరుద్ధరణ చర్యలు
- ఎన్నికల బాండ్ల వంటి వివరాలు ప్రజలకు చెప్పడం, ఇలాంటి నిధులను ఉద్యోగావకాశాలు పెంచేందుకు ఉపయోగించడం
- ఎన్‌సిఇఆర్‌టిలో మతోన్మాదాన్ని జొప్పించేందుకు బిజెపి చేసిన అశాస్త్రీయ మార్పుల రద్దు
- నూతన విద్యావిధానం రద్దు, ప్రజానుకూల ఆధునిక విద్యకు రూపకల్పన. బిజెపి తీసుకున్న వినాశకర విధానాలు రూపుమాపడం వంటివన్నీ పార్టీ లక్ష్యాలుగా ఎన్నికల ప్రణాళికలో పేర్కొంది. ప్రజానుకూల ఎజెండాతో సిపిఐ ఈ ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళుతోందని పార్టీ ప్రకటించింది 18వ లోక్‌సభలో వామపక్షాల బలాన్ని పటిష్టం చేసేందుకు వీలుగా లౌకిక, ప్రజాస్వామ్య శక్తులకే ఓటు వేయాలని సిపిఐ ప్రజలకు పిలుపు ఇచ్చింది. దేశాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యా న్ని, ప్రజల జీవనాన్ని రక్షించేందుకు ఈ ఎన్నికల్లో ఆర్ఎస్ఎస్–బిజెకి పాలనను ఓడించేందుకు మనందరం ఐక్యం కావాలని ఎన్నికల ప్రణాళికలో సిపిఐ పిలుపు ఇచ్చింది.

## టిప్పర్ బోల్తా...
## ఒకే కుటుంబంలో ముగ్గురు దుర్మరణం

**ప్రజా పక్షం / హుజురాబాద్ :** టిప్పర్ బోల్తా పడిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన అన్నా చెల్లితో పాటు మరో యువతి మృతి చెందిన విషాద సంఘటన శుక్రవారం అర్ధరాత్రి బోర్నపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బోర్నపల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి బోనాలు జరుగుతుండగా శుక్రవారం అర్ధరాత్రి గంట విజయ్ (17), గంట వర్ష (15) అన్నా చెల్లెలు, గంట సింధుజ (18) లు జాతరకు వెళ్లి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా ఎలబోతారం నుంచి హుజూరాబాద్ వైపు మట్టి లోడుతో టిప్పర్ అతి వేగంగా వస్తుండటాన్ని గమనించి మూలమలుపు వద్ద ఆగారు. టిప్పర్ వారు ఆగిన చోటే ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తా పడటంతో ముగ్గురు మట్టిలో కూరుకుపోయారు. గమనించిన గ్రామస్తులు అక్కడికి చేరుకొని మట్టిని తొలగించి వర్షను బయటకు తీసి 108లో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నట్లు తెలిపారు. మట్టిలో కూరుకుపోయిన విజయ్, సింధూజలను జెసిబి సాయంతో బయటకు తీయగా అప్పటికే మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ప్రమాదస్థలానికి చేరుకొని తమ పిల్లల మృతదేహాలను చూసి గుండెలు బాదుకుంటూ రోదించారు. టిప్పర్ డ్రైవర్ పరారీలో ఉండగా మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలి
### ఒయు ఎఐఎస్ఎఫ్ కార్యదర్శి నెల్లి సత్య

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రధాన గ్రంధాలయంలో కనీస మౌనికసౌకర్యాలు కల్పించాలని ఎఐఎస్ఎఫ్ ఒయు కార్యదర్శి నెల్లి సత్య కోరారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రధాన గ్రంధాలయంలో కనీస మౌలికసౌకర్యాలు కల్పించాలని ఎఐఎస్ఎఫ్ ఒయు కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ లక్ష్మి



నారాయణకు వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు శనివారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మి నారాయణ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రధాన గ్రాంధాలయాన్ని సందర్శించి, విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నెల్లి సత్య మాట్లాడుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రధాన గ్రంధాలయం దేశంలోని అత్యంత పురాతనమైన చారిత్రాత్మాకమైన గ్రంధాలయమని తెలిపారు. గ్రంధాలయంలో నిర్వహణ లేకపోవడం, మౌలికసౌకర్యాలు కల్పించకపోవడంతో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపా రు. కావున తక్షణమే ఒయు పరిపాలన అధికారులు గ్రంధాలయంలో సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరిశోధన విద్యార్థులు లక్ష్మ ణ్, సోమనాథ్, నాయకులు సుమన్, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఓటరు తప్పనిసరిగా..
## ఓటుహక్కు వినియోగించుకోవాలి
### స్వీప్ నోడల్ అధికారి అరుణకుమారి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజాస్వామ్య వ్యవస్థకు కీలకమైన ఎన్నికల ప్రక్రియలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు వేసి ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని స్వీప్ నోడల్ అధికారి అరుణ కుమారి పిలుపునిచ్చారు. ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా శని



వారం ఖైరతాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలోని జివికె షాపింగ్ మాల్‌లో ఓటు హక్కు వినియోగం, ఓటు ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐ ఓట్ ఫర్ షూర్ అని రాసిన ప్లకార్డులను ప్రదర్శించారు. ఓటర్లను చైతన్య పరిచే విధంగా విద్యార్థులతో సాంస



్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. షాపింగ్ మాల్‌కు వచ్చిన ప్రతి ఒక్కరూ ఓటరు చైతన్య కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా స్వీప్ నోడల్ అధికారి అరుణ కుమారి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో అతి కీలకమైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటరు జాబితాలో తమ పేరును పరిశీలన చేసుకోవాలన్నారు. పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు కోసం ఎన్నికల సంఘం కల్పిస్తున్న అవకాశాన్ని యువత వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించు కోవాలన్నారు. అందరు స్ఫూర్తి వంతంగా ఓటింగ్‌లో పాల్గొని, పోలింగ్ శాతాన్ని పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వీప్ అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్ ఆశా, జూబ్లీహిల్స్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ (డిపిఓలు), ఆర్పిలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
### అన్నదాతలు చనిపోతున్నా ప్రభుత్వంలో స్పందన లేదు

**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి :** మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని సిద్దిపేట ఎంఎల్ఎ హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ మొద్దు నిద్ర వదిలించేందుకే దీక్షలు చేపట్టామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత 200 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని వెల్లడించారు. అన్నదాతలు చనిపోతున్నా ప్రభుత్వంలో స్పందన లేదని విమర్శించారు. లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వానికి పట్టింపులేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం రైతులకు భరోసా ఇవ్వాలని సోయి కూడా సర్కారుకు లేదని చెప్పారు. సంగారెడ్డి పట్టణంలో బిఆర్ఎస్ రైతు దీక్షలో హరీష్‌రావు, ఎంఎల్ఎ చింతా ప్రభాకర్, జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మానవత్వం కోల్పోయిందన్నారు. కెసిఆర్ రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండుగలా మార్చారని చెప్పారు. కాంగ్రెస్ చిల్లర రాజకీయాలు మాని రైతులకు సాయం చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బిజెపి దొందూందేనని ఎద్దేవచేశారు. సాగుకు ఊరేసిలా బిజెపి నల్లచట్టాలు చేసిందని విమర్శించారు. కేంద్రం తీసుకొచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో రైతులు పోరాటం చేశారని గుర్తు చేశారు. ఈ పోరాటంలో 700 మందికి పైగా అన్నదాతలు చనిపోయారన్నారు.

# ఆర్థిక, విద్యుత్ రంగాలను గాడిలోపెట్టాం : భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ మాడల్‌గా దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోనికి తీసుకొచ్చేలా కార్యకర్తలంతా నడుం బిగించి, పని చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పిలుపునిచ్చారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక, విద్యుత్ రంగాలను కాంగ్రెస్ ప్రభుత్వం గాడిలో పెట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకూ న్యాయం జ రుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ హమీనిస్తే తప్పకుండా అమలు చేస్తుందన్నారు. గతంలో తుక్కుగూడలో ప్రజలకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హమీనిచ్చామని, అధికారంలోనికి రాగానే వాటిని అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు మొదటి తేదీనే వేతనాలను, పె న్షన్‌ను ఇస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 50 లక్షల మందికి జిరో విద్యుత్ బిల్లును ఇచ్చామని వివరించారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంపై కెసిఆర్ బురదజల్లే యత్నం : ఉత్తమ్ కుమార్ రెడ్డి**

కాంగ్రెస్ ప్రభుత్వంపై కెసిఆర్ బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. కెసిఆర్ అధికారంలో ఉన్నప్పుడు వర్షాలు పడలేదన్నారు. కెసిఆర్ ప్రజలను మోసం చేసి లూటీ చేసుకున్నారని విమర్శించారు. పంట నష్టం తగ్గించేలా ఉన్న నీటిని సక్రమంగా ఉపయోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. నాలుగు నెలలు ఫామ్‌హౌజ్‌లో పండుకుని, ఎన్నికల వచ్చేసరికే కెసిఆర్ బయటకు వచ్చారని విమర్శించారు. కెసిఆర్ చెప్పింది అబద్ధమన్నారు. తెలంగాణ రాష్ట్రానికి మోడీ ప్రభుత్వం ఏమీ చేయలేదని, తెలంగాణ రాష్ట్రాన్నిమోసం చేసిందని, అటువంటి బిజెపికి తెలంగాణలో ఓటు అడిగే హక్కు లేదన్నారు.




**అన్ని వర్గాలను కలిసిన రాహుల్ : మంత్రి శ్రీధర్‌బాబు**

దేశంలోని అన్ని వ్యవస్థలను కాలరాస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, గత బిఆర్ఎస్ ప్రభుత్వంపైన రాహుల్ గాంధీ పోరా టం చేశారని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. భారత్ జోడో, న్యాయ యాత్ర పేరుతో దేశ వ్యాప్తగా దాదాపుగా 10 వేల కిలోమీటర్ల వరకు రాహుల్ గాంధీ పర్యటించారని, అన్ని వర్గాలనూ కలిసి వారి కష్టాలను తెలుసుకున్నారని తెలిపారు. ఆరు గ్యారంటీలలో నాలుగు ప్రధానమైన అంశాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేశామన్నారు.

**మంది సంసారాల్లో తొంగి చూడాల్సిన అవసరం ఏమొచ్చింది: మంత్రి జూపల్లి**

టెలిఫోన్ ట్యాపింగ్ ద్వారా మంది సంసారాల్లో తొంగి చూడాల్సిన అవసరం ఏమొచ్చిందని కెసిఆర్‌ను మంత్రి జూపల్లి కృష్ణారావు నిలదీశారు. ఇంత దొంగ, బతుకులు ఎందుకని మండిపడ్డారు. 80వేల పుస్తకాలు చదివిన కెసిఆర్‌ది నోరా?మోరా?అని నిలదీశారు. నాలుగు మాసాల ప్రభుత్వంపైన విమర్శలు గుప్పిస్తున్నారన్నారు. ధనిక రాష్ట్రాన్ని అప్పగిస్తే, వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని, ఇందు కు కల్వకుంట్లకవిత అరెస్ట్ రుజువు అని అన్నారు.

**కెసిఆర్‌ను బహిరంగంగా ఉరితీసినా తప్పు లేదు: కొండాసురేఖ**

కరీంనగర్‌లో కెసిఆర్ మాట్లాడిన మాటలకు క్షమాపణ కూడా లేదని, ఆయనను బహిరంగంగా ఉరి తీసినా తప్పులేదని మంత్రి కొండా సురేఖ మండిపడ్డారు. ఏది పడితే అది తిడితే పడేందుకు తాము సిద్ధంగాలేమన్నారు. అధికారాన్ని అనుభవించి, ప్రజల నమ్మకం పోగొట్టుకుని , ప్రజా సంక్షేమం కోసం పని చేస్తున్న తమపై ఒక్క మాట మాట్లడినా మర్యాద ఉండబోదని ఆమె కెసిఆర్‌ను హెచ్చరించారు. అధికారం పోయిందనే అసలే ఫ్రస్టేషన్‌లో ఉన్న కెసిఆర్, కెటిఆర్‌లకు బిఆర్ఎస్ ఖాళీ అవుతుండడంతో మరింత ఫ్రస్టేషన్‌లో ఉన్నారని ఎద్దేవా చేశారు. ఏమీ మాట్లడని తనకు కెటిఆర్ నోటీసులు పంపించారని, మరి కెసిఆర్ చేసిన వ్యాఖ్యాలపై తాము ఏం కేసులు నమోదు చేయాలని కెటిఆర్‌ను కొండా సురేఖ ప్రశ్నించారు.

**అప్పుడు రైతులపై కాల్పులు ... ఇప్పుడు రైతుల కోసం ధర్నాలా? : బిజెపిపై సీతక్క విమర్శ**

నల్లా చట్టాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన రైతులపై కాల్పులు జరిపిన బిజెపి, రాష్ట్రంలో రైతు సమస్యలపైన ధర్నా చేస్తోందని మంత్రి సీతక్క ఎద్దేవా చేశారు. సహజ వనరులను దోచుకునేందుకే బిజెపి ప్రభుత్వం ఆదివాసి హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. దేశం కోసం, ప్రజాస్వామిక హక్కుల కోసం నలుగు దిక్కులా తిరుగుతున్న రాహుల్‌గాంధీకి ప్రజలు ఒక్కసారి ప్రధానిగా అవకాశం ఇవ్వాలని కోరారు. పదేళ్ల కాలంలో విద్వేశ కుట్రతో బిజెపి ప్రభుత్వం భారతదేశాన్ని బంధీ చేసిందని విమర్శించారు. అధికారం కోల్పోయిన బిఆర్ఎస్ నేతలు అసహనంతో మాట్లాడుతున్నారన్నారు.

**రైతు సమస్యలపై బిఆర్ఎస్, బిజెపి డ్రామాలు: పొన్నం**

అప్పులపై ఎక్కడా జవాబు చెప్పాల్సి వస్తుందోనని అసెంబ్లీలో జరిగిన చర్చకు కూడా రాని కెసిఆర్, ఇప్పుడు సిరిసిల్లాకు వచ్చి అబద్దాలు చెబుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో తాము ప్రజల వద్దకు వెళ్తే గృహ నిర్భందం చేసేవారని, కానీ తమ ప్రజా ప్రభుత్వంలో కెసిఆర్‌కు ప్రజల వద్దకు వెళ్లేందుకు పూర్తి అవకాశం కల్పించామని తెలిపారు. బిఆర్ఎస్, బిజెపి తోడు దొంగులలగా రైతు సమస్యలపై డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. రామున్ని తీసుకొచ్చి, అక్షింతలు అంటున్నారని, రామున్ని రాజకీయాల్లోకి తీసుకొచ్చారని మండిపడ్డారు.

# ‘ఇండియా’ కూటమి బలపడాలంటే సిపిఐకి ప్రాధాన్యం

### కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ సమావేశంలో సిపిఐ జాతీయ నేత చాడ

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** దేశంలో వ్యాప్తంగా ఇండియా కూటమి బలపడాలంటే సిపిఐకి తగిన ప్రాధాన్యతనివ్వాలని, అన్ని స్థానాల్లో సిపిఐని కలుపుకుని పోయి కొన్ని పార్లమెంటు స్థానాలు కేటాయించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. ఆ దిశగా కూటమి ప్రధాన భాగస్వామి కాంగ్రెస్ అడుగులు వేయాలని చాడ వెంకటరెడ్డి సూచించారు. శనివారం సిపిఐ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గంలోని కరీంనగర్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, హన్మకొండ, జగిత్యాల జిల్లాల సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుల, ప్రజాసంఘాల ఆఫీస్ బేరర్స్ సమావేశం కరీంనగర్‌లో సిద్దిపేట సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరై చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా దేశాన్ని పరిపాలిస్తున్న బిజెపి నిరంకుశంగా వ్యవహరిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత భారతదేశ సంపదను బడా పారిశ్రామిక వేత్తలకు, కార్పోరేట్ శక్తులకు అప్పనంగా అప్పగిస్తూ ప్రభుత్వరంగాలను పూర్తిగా నిర్వీర్యం చేశాడన్నారు.

భారతదేశ ప్రజాస్వామ్యాన్ని, పౌరహక్కులను, చట్టాలను మార్చివేసిన దుర్మార్గపు పరిపాలన బిజెపిదన్నారు. ఆర్ఎస్ కనుసన్నల్లో హిందుత్వ ఎజెండాతో పరిపాలన నడిపిస్తూ మతోన్మాదాన్ని పెంచి పోషించడానికి బిజెపి అనేక కుట్రలు పన్నుతోందన్నారు. పదేళ్ల కాలంలో అనేకమంది దళిత, మైనార్టీ, బడుగు బలహీన వర్గాలను, మేధావులను హతమార్చినట్లు అనేక ఆరోపణలు బిజెపి ఎదుర్కొంటున్నదని ఆరోపించారు. అనేక రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీలను ఎన్నో ఇబ్బందులకు గురిచేసి కేంద్రంలో అధికారంలో ఉన్నామని భయభ్రాంతులకు గురిచేసి, మెజార్టీ స్థానాలు లేకపోయినప్పటికీ అధికారం చేజిక్కించుకుని పెత్తనం చెలాయిస్తున్నదని, దేశవ్యాప్తంగా అనేక



మందిపై ఇడి, ఐటి, సిబిఐ దాడులు చేయిస్తున్నదన్నారు. ఏ ఒక్క బిజెపి నాయకునిపై దాడు లు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఇలాంటి బిజెపి పరిపాలనను రానున్న ఎన్నికల్లో ఓడించేందుకు సిపిఐ శ్రేణులు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణ కోసం వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తుల ఏకీకరణ, బిజెపి పరిపాలన అంతంకోసం ఏర్పడ్డ ఇండియా కూటమి పూర్తి స్థాయిలో బలపడాలంటే సిపిఐకి తగిన ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు సిపిఐకి బలమున్న చోట కొన్ని పార్లమెంటు స్థానాలు కేటాయించాలని, పార్లమెంటులో వామపక్ష సభ్యులుంటేనే ప్రజల గొంతుకై వినిపిస్తారని, ప్రజాస్వామ్య, రాజ్యాంగ రక్షణకై పనిచేస్తారని అన్నారు. ఇటీవల కాలంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో సిపిఐ అవగాహన చేసుకుని ఎన్నికల్లో కలిసి పనిచేసిన సందర్భంగా మంచి ఫలితాలు వచ్చాయని, తెలంగాణ లో గతంలో కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం లాంటి ప్రాంతాల్లో పార్లెంటు సభ్యులుగా ఎన్నికైన చరిత్ర సిపిఐకి ఉందన్నారు. అందుకే రానున్న పార్లమెంటు ఎన్నికల్లో సిపిఐకి బలం ఉన్న చోట అవకాశం ఇవ్వాలని, పార్టీ జాతీయ నాయకత్వానికి తెలియజేయడం జరిగిందన్నారు. ఎన్నికల్లో జాతీయ పార్టీ నిర్ణయం మేరకు రాష్ట్రంలో కలిసి పనిచేయడానికి సిపిఐ శ్రేణులు సంసిద్ధం కావాలన్నారు.

సమావేశంలో సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిరిసిల్ల జిల్లా కార్యదర్శి గుంటి వేణు, జగిత్యాల జిల్లా కార్యదర్శి వెన్న సురేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొనగంటి కేదారి, గడిపె మల్లేష్, ఆదరి శ్రీనివాస్, భారత జాతీయ మహిళా సమాఖ్య కరీంనగర్, సిద్దిపేట జిల్లాల కార్యదర్శులు, కిన్నెర మల్లవ్వ, గూడ పద్మలతో పాటు కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు, ప్రజాసంఘాల ఆఫీస్ బేరర్స్ పాల్గొన్నారు.

**రైతులపై మాజీ సిఎం కెసిఆర్ మొసలి కన్నీరు**

తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా పదేళ్ల పాటు పని చేసిన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అధికారం కోల్పోయిన తర్వాత రైతులపై మొసలి కన్నీరు కారుస్తుండటం సిగ్గుచేటుగా ఉందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి విమర్శించారు. శనివారం కరీంనగర్‌లో సిపిఐ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పై గద్దలా వాలుతాం.. వదలబోము అంటూ మాట్లాడుతున్న కెసిఆర్ ఆయన హయాంలో ఏం చేశాడని ప్రశ్నించారు. సొంత నియోజకవర్గం గజ్వేల్‌లో రైతులు చనిపోతే కనీసం కుటుంబాన్ని పరామర్శించిన పాపాన పోలేదన్నారు. కాళేశ్వరం కట్టినామంటూ నభూతో న భవిష్యత్తులా మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు. కట్టిన ప్రాజెక్టు లో మేడిగడ్డ కుంగిపోవడానికి కారణమెవరని ప్రశ్నించారు.

వరద కాల్వకు నీరందించి సాగు సస్యశ్యామలం చేశామంటున్న కెసిఆర్ ఆ కాలువకు శంకుస్థాపన చేయించిందే సిపిఐ అని గుర్తు చేశారు. మిడ్ మానేరు నిర్వాసితులకు నష్టపరిహారం ఇప్పించడంలోనూ సిపిఐ ప్రధాన పాత్ర పోషించిందన్నారు. వరద కాలువ ఆకృతిని మార్చేసి రైతులను ముంచింది కెసిఆర్ అన్నారు. 2007లో మొదలుపెట్టిన గౌరవెల్లి ఎందుకు పూర్తికాలేదని? కుర్చీ వేసుకుని చేపిస్తా అన్న మాట ఏమయ్యిందన్నారు. స్వార్థపూరితంగా ఆలోచించడం వల్లే 2016లో మొదలు పెట్టిన మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టులు పూర్తయ్యాయని అన్నారు. ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసిన ఘనత కెసిఆర్‌దేనన్నారు. బిఆర్ఎస్ నుంచి వలసలు పోతుంటే రాజీనామా చేసి పార్టీని వీడాలంటున్నారని, కెసిఆర్ హయాంలో పార్టీ ఫిరాయింపుల్లో నెంబర్ వన్‌గా నిలిచారన్నారు. చెడపకురా చెడేవు అనే నానుడి కెసిఆర్‌కే వర్తిస్తుందన్నా రు.

# పెరుగుతున్న సంఘ్ పరివార్ క్రూరనేరాలు

### ‘కర్కారేను ఎవరు చంపారు?’ అనువాద పుస్తకావిష్కరణలో జనసాహితి, అధ్యక్షుడు దివి కుమార్

**ప్రజాపక్షం /హైదరాబాద్:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అండతో దేశంలో సంఘ్ పరివార్ శక్తుల క్రూరమైన తీవ్రవాద నేరాలు నిత్యం పెరుగుతున్నాయని జన సాహితి అధ్యక్షులు దివి కుమార్ ఆందోళన వ్యక్తం చేసారు. హైదరాబాద్ హిమాయత్ నగర్ సత్యనారాయణరెడ్డి భవన్ లో శనివారం ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరమ్ (ఎఐపిఎఫ్) నిర్వహించిన సభలో మహారాష్ట్ర మాజీ ఇన్‌స్పెక్టర్ జనరల్ అఫ్ పోలీస్ ఎస్.ఎం.ముష్రిఫ్ రచించిన ‘కర్కా రేను ఎవరు చంపారు?’ అనే తెలుగు అనువాద పుస్తకాన్ని దివి కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ చీఫ్ హేమంత్ కర్కారే హత్య ఎలా జరిగిందో తెలుసుకోవాలంటే ముందుగా భారతదేశంలో రాజకీయ ప్రయోజనాల కోసం మతాన్ని ఉపయోగించి రాజకీయం చేసే పార్టీల చరిత్ర తెలుసుకోవాలని అన్నారు. హిందూమతంలో ఉన్న మూడు విశ్వాసాలు అసమానతలు, వాస్తవ చరిత్రను బయటకు తీసుకు వచ్చిన బుద్ధి జీవులైన నరేంద్ర దబోల్కర్, గోవింద్ పన్సారే, ఎంఎం.కల్బుర్గి, గౌరీ లంకేష్‌లను సంఘ్ పరివార్ హత్య చేశాయని ఆయన ఆరోపించారు. హైదరాబాద్ మక్కా మసీద్, అజ్మీర్ దర్గా, సంఝౌతా ఎక్స్‌ప్రెస్‌లలో జరిగిన పేలుళ్లకు సంఘ్ పరివార్ శక్తులకు, మాజీ ఆర్మీ ఉన్నతాధికారులకు ప్రత్యక్ష సంబంధం ఉందన్న సాక్ష్యాలతో, వాస్తవ ఆధారాలతో హేమంత్ కర్కారే నేరస్థులను



న్యాయస్థానానికి రప్పించి శిక్ష పడే విధంగా చేసాడని, దానిని జీర్ణించుకోలేని సంఘ్ పరివార్ శక్తులు ఆయనను హత్య చేసి ప్రతీకారం తీర్చుకున్నారని, దానికి సాక్ష్యమే బిజెపి ఎంపి సాధ్వి ప్రజ్ఞా ఠాకూర్ నా శాపం వల్లే హేమంత్ కర్కారే మరణించాడని పేర్కొనడమని ఆయన పేర్కొన్నారు. మెజారిటీ లేదా మైనారిటీ కమ్యూనిటీకి చెందిన స్వదేశీ ఉగ్రవాదులు దేశానికి అత్యంత ప్రమాదకరం అని అన్నారు. ఉగ్రవాదం యువత జీవితాలను, అవకాశాలను, వారి వర్తమానాన్ని, వారి భవిష్యత్తును దోచుకుంటుందన్న వాస్తవాన్ని గుర్తించాలన్నారు. విభిన్న మతాలు, సంస్కృతులు, సంప్రదాయాలు ఉన్న భారత దేశం ప్రజల మధ్య సహనం, శాంతి సంస్కృతిని ప్రోత్సహించడానికి యువత కృషి చేయాలన్నారు. ఆర్ఎస్ఎస్, బిజెపి దాని అనుబంధ సంఘాలు హిందూ మతాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్న విషయాన్ని యువత, విద్యార్థులు యావత్తు సమాజం గుర్తించి రానున్న ఎన్నికలలో బిజెపిని ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని దివి కుమార్ కోరారు. ఈ సభకు ఉస్మానియా యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్ సత్య అధ్యక్షత వహించగా, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బల్‌రాజ్, ప్రముఖ సినీ దర్శకులు సి.ఉమా మహేశ్వర్‌రావు, సామాజిక శాస్త్రవేత్తలు డాక్టర్ సోమ్ మర్ల, డాక్టర్ అజయ్‌శర్మ, ఎఐపిఎఫ్ తెలంగాణ రాష్ట్ర కో కన్వీనర్‌లు వి.ఎస్.బోస్, బి.స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి 200 సీట్లు గెలవడం కూడా కష్టమే
### ప్రియాంకా ఖర్గే

**బెంగళూరు :** కర్నాటక మంత్రి ప్రియాంకా ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. ఆర్ఎస్ఎస్ చేసిన అంతర్గత సర్వే ప్రకారం లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బిజెపి 200 సీట్లలో కూడా గెలవలేదని, కర్నాటకలో 8 స్థానాల్లో కూడా విజయం సాధించదని తేలిందన్నారు. ఖర్గే శనివారం బెంగళూరులో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పూర్తిగా అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. కరువు నిధులకు సంబంధించి కేంద్రాన్ని కోరుతూ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యంగా సమర్పించిందని ఇటీవల షా వ్యాఖ్యానించారని, అదంతా పచ్చి అబద్ధమని ఖర్గే పేర్కొన్నారు.

షా ‘తప్పుడు సమాచారశాఖ’మంత్రిగా పనిచేయాలని ఎద్దేవ చేశారు. ఆర్ఎస్ఎస్ నిర్వహించిన అంతర్గత సర్వే లో బిజెపి 200 సీట్లలో కూడా గెలవబోదని తేలదని, ఇ విషయాన్ని స్వయంగా ఆర్ఎస్ఎస్ వెల్లడించిందన్నారు. కాషాయ పార్టీలో అంతర్గత కుమ్ములాటులు నడుస్తుంటే 14 లేదా 15 స్థానాల్లో ఎలా గెలుస్తుందని ప్రశ్నించారు. కేవలం ఒక కుటుంబం వల్ల కర్నాటకలో బిజెపి కలుషితమైందని ఆ పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయని చెప్పారు. నిజమైన బిజెపిని పునరుద్ధరించాలని వారు పట్టుబడుతున్నారన్నారు. బిజెపిలోని కొంతమంది హిందుత్వ నాయకుల వల్ల కొందరికి అన్యాయం జరుగుతుందని పార్టీలో చర్చించుకుంటున్నారని ఖర్గే చెప్పారు.

కర్ణాటకకు కరువు సాయం విషయంలో హోంమంత్రి అమిత్ షా అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించిన ఖర్గే.. కరువు సాయం కోరుతూ సిఎం సిద్ధరామయ్య ‘ప్రధాని, కేంద్ర హోం మంత్రి, ఆర్థిక మంత్రి (సహాయం కోరుతూ)తో భేటీ అవ్వడం అబద్ధమా? ఐఎంసిటి (ఇంటర్ మినిస్ట్రీరియల్ కేంద్ర బృందం) కర్ణాటకలో సర్వే చేసి కేంద్రానికి నివేదిక సమర్పించడం అబద్ధమా? ఆ తర్వాత నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సమావేశాన్ని నిర్వహించి, కర్ణాటకలో కరువును అధిగమించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను లిఖితపూర్వకంగా ప్రశంసించడం అబద్ధమా? అని ప్రశ్నలు సంధించారు. అమిత్ షా ఎందుకు ఇలా అబద్ధాలు ఆడుతున్నారోనని అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు.

# హామీలు అమలు చేయాలి

### సిరిసిల్లాలో రైతుదీక్షలో వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల :** దగాకోరు కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ప్రజలకు తెలియచేయాలని; పార్టీని, రాష్ట్రాన్ని, రైతాంగాన్ని కాపాడుకునే బాధ్యత బిఆర్ఎస్ శ్రేణులందరిపై ఉందని కెటిఆర్ పిలుపునిచ్చా రు. శనివారం సిరిసిల్లా తెలంగాణ భవన్ రైతుదీక్షలో కెటిఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య అధ్యక్షతన కెటిఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయం సంక్షోభంలో ఉందని, గడ్డుపరిస్థితిలో నాలుగు నెలల్లోనే మాట్లాడుకునే పరిస్థితి వచ్చిందన్నారు. ఏడుపదుల వయస్సులో మండుటెండల్లో జనగామ, సూర్యపేట, నల్గొండ, కరీంనగర్, సిరిసిల్లా 5 జిల్లాలు పర్యటించి రైతులకు ధైర్యాన్ని ఇచ్చారు. ఎన్నికల కమీషన్ ఉత్తరాలు రాసి హామీలు ఇవ్వాలని అన్నారు. రైతుబంధు ఆపినట్లుగా తాము బోనస్ ఆపబోవద్దన్నారు. రాళ్ళవాన,వడగండ్లుతో రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు నెలలు పనిచేసి వంగిన పిల్లర్లను సరిచేస్తే 48 టిఎంసిల నీరు వినియోగంలోకి వచ్చి ఎకరం కూడా ఎండిపోని పరిస్థితి ఉండేదన్నారు. రాజకీయంగా చిల్లరపనులు చేయకూడదని ఇప్పటికే 110పదిరోజులు ఓపికపట్టామన్నారు. 420 హామీలు ఇచ్చి మహిళలకు ఇస్తామన్న తులం బంగారం స్కూటీ లు, రెండులక్షల ఋణ మాఫీ, బోనస్ అటే పోయిందన్నారు. డిసెంబర్9 అని చెప్పి రెండురోజుల ముందే తన కుర్చీ ఎవరో ఎత్తుకెళ్తారనే భయం తో రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశాడని అన్నారు. మహాలక్ష్మి పథకం కింద రూ.2,500 మహిళలకు ఇవ్వాలని, వృద్ధుకు పింఛను డబ్బులు నాలుగు వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేతన్నల కోసం సిరిసిల్లాతో పాటు పోచంపల్లి, గద్వాల, దుబ్బాక ప్రతీచోట దీక్షలు చేపడతామని కాంగ్రెస్‌ను హెచ్చరించారు. ప్రతిచోట ఫ్లెక్సీలు కడతామని, ధర్నాలు, రాస్తారోకోలు, వంటావార్పు చేస్తామని అన్నారు. ఇందుకోసం ప్రజలందరు కలిసి రావాలని బిఆర్ఎస్ కార్యనిర్వాహకుడు కెటిఆర్ అన్నారు. గులాబి, ఆకుపచ్చ కండువాలు కప్పుకుని నిరసన తెలపాలని చెప్పారు. కార్యక్రమంలో నాఫ్కాబ్ చైర్మెన్ కొండూరి రవీందర్‌రావ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్,సెస్ చైర్మెన్ చిక్కాల రామారావ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, జడ్‌పిటిసిలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలుసుకుందాం

## ప్రయోగాల సమయం..



అరుదుగా సంభవించే సంపూర్ణ సూర్యగ్రహణాన్ని ఒక్కొక్కరూ ఒక్కో కోణంలో చూస్తారు. మతవిశ్వాసాలు, ప్రాంతాల వారీగా నమ్మకాలు ఎలావున్నా, శాస్త్రవేత్తలు మాత్రం సూర్యుడిపై అధ్యయనం చేయడానికి అనుకూలమైనదిగా భావిస్తారు. ఈనెల 8న సంభవించనున్న సంపూర్ణ సూర్యగ్రహణం సందర్భంగా పరిశోధనలకు నాసా శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు. ఈ సూర్యగ్రహణం దృశ్యం సూర్యుని కరోనాలో భాగమైన స్ట్రీమర్లను కలిగి ఉంటుంది, ఇది వాతావరణ వెలుపలి భాగం కావడంతో, అంతరిక్షం కేంద్రంగా పరిశోధనలు జరపనుంది. 'ఎక్లిప్స్ సౌండ్స్‌స్కేప్'గా పేర్కొనే ఈ అధ్యయనంలో, సూర్యగ్రహణ సమయంలో ప్రకృతిలో సంభవించే మార్పులను రికార్డు చేస్తారు. సూర్యగ్రహణం కారణంగా అకస్మాత్తుగా చీకటిపడినప్పుడు పక్షులు, జంతువులు, కీటకాలు గందరగోళానికి గురవుతాయి. విచిత్రంగా ప్రవర్తిస్తాయి. ఆ సందర్భంగా అవి చేసే ధ్వనులను రికార్డు చేయడం ద్వారా, సూర్యగ్రహణ ప్రభావ తీరుతెన్నులను శాస్త్రవేత్తలు అధ్యయనం చేస్తారు. ఒక రకంగా దీనిని 1935 నాటి అధ్యయనానికి కొనసాగింపుగా చెప్పుకోవాలి. కాగా, 'సన్‌స్కెచర్'ను కూడా పరిశోధకులు తెలుసుకునే అవకాశం ఉంది. నిజానికి సూర్యుడు ఓ నక్షత్రం. దీని ఆకారం ఏ విధంగా ఉంటుందనేది మనకు ఇప్పటికీ తెలియదు. ఇది గుండ్రంగా కనిపిస్తున్నప్పటికీ, దాని భ్రమణం కారణంగా, శాస్త్రవేత్తలు ఇది బృహస్పతి మాదిరి ఎక్కువ చదునుగా లేదా ఉబ్బినట్టుగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇప్పుడు, సంపూర్ణ గ్రహణం ఏర్పడనున్న నేపథ్యంలో, సూర్యుడి కరోనాను నిశితంగా పరిశీలించే వీలు ఉంటుంది. నాసా బృందం టెక్సాస్ నుంచి మైనే వరకూ విమానంలో ప్రయాణిస్తూ, సూర్యుడి ఆకృతి తదితర అంశాలను పరిశీలించనున్నారు. అటు అంతరిక్షం నుంచి, ఇటు భూవాతావరణం నుంచి సూర్యుడి గురించి అధ్యయనం చేయడానికి సంపూర్ణ సూర్యగ్రహణాన్ని మించిన సమయం లేదని శాస్త్రవేత్తలు అంటున్నారు. ఈ ప్రయోగాలు ఎలాంటి ఫలితాలనిస్తాయో చూడాలి.

## ఈ రాళ్ల మర్మం ఏమిటో?



జపాన్‌లోని, అసుకా ప్రాంతంలోని వేర్వేరు ప్రదేశాల్లో, అక్కడి కొండపై అసాధారణ ఆకారంలో ఉన్న రాళ్లు కనిపిస్తాయి. వాటికి చతురస్ర ఆకారంలో కన్నాలు ఉంటాయి. పూర్వం అక్కడ నివసించిన వారు వాటిని తయారుచేసి ఉంటారన్న వాదన ప్రచారంలో ఉంది. కానీ ఎందుకు చేశారన్న ప్రశ్నకు సమాధానం మాత్రం లేదు. క్రీస్తు శకం 250 నుంచి 552 మధ్య కాలాన్ని తుములస్ కాలం అంటారు. ఆ కాలంలోనే ఈ రాళ్లను తయారుచేసినట్లు చెబుతారు. ఈ రాళ్లలో అతిపెద్ద దాన్ని మసుదానోఇవాఫున్ అని అంటారు. అంటే మసుదాకి చెందిన రాతి నౌక అని అర్థం. ఇది 11 మీటర్ల పొడవు, 8 మీటర్ల వెడల్పు, 4.7 మీటర్ల ఎత్తు ఉంది. బరువు 800 టన్నులు. ఈ రాళ్లు ఇప్పటికీ మిస్టరీగానే ఉన్నాయి. వీటి మర్మం ఏమిటో తెలుసుకునేందుకు శతాబ్దాలుగా శాస్త్రవేత్తలు చేస్తున్న పరిశోధనలు ఇంకా ఒక కొలిక్కి రాలేదు. ప్రస్తుతానికి మాత్రం ఆ రాళ్లపై సస్పెన్స్ కొనసాగుతోంది.

## బోస్నియా అడవిలో..



రాళ్ల వింత బోస్నియా అడవిలోనూ దర్శనమిచ్చింది. పది అడుగుల వెడల్పు ఉన్న ఒక గుండ్రటి రాయి ఉంది. దీనిని క్షుణ్ణంగా పరిశీలించిన శాస్త్రవేత్తలు సుమారు 30 టన్నుల బరువు ఉంటుందని అంచనా వేశారు. ఎవరో తీర్చిదిద్దినట్టు గుండ్రటి ఆకాలంలో ఉన్న ఈ రాయిని ఎవరైనా చెక్కారా? లేక స్వతఃసిద్ధంగా ఏర్పడిందా? అన్న చర్చ కొనసాగుతున్నది. మన పూర్వీకులు లేదా గత నాగరికతలకు చెందిన వారు ఎవరైనా దీనిని తయారు చేసి ఉండవచ్చన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఇలాంటివే మరికొన్ని రాళ్లు అడవిలో కనిపించాయి. ఇవన్నీ కొన్ని లక్షల సంవత్సరాల క్రితం నాటివని శాస్త్రవేత్తలు తేల్చారు. అయితే, ఇవి మనకు తెలియని నాగరికతను చెందినవని చెప్పడానికి ఆధారాలు లేవు. ప్రకృతిపరంగానే ఏర్పడ్డాయా అన్న ప్రశ్నకు సమాధానం కూడా లేదు.

## దేవకన్యల ఇల్లు..



ప్రాచీన భవనాలు, అద్భుతమైన కళాఖండాలకు నిలయమైన ఇటలీలో లీనింగ్ టవర్ ఆఫ్ పీసాతోపాటు కొలొస్సియం కూడా చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకుంది. వీటిని చూసేందుకు పర్యాటకులు కూడా ఎక్కువ సంఖ్యలో వస్తూ ఉంటారు. కానీ, అక్కడి దేవకన్యల ఇల్లు (హౌస్ ఆఫ్ ఫైరీస్ లేదా డోమస్ డి జనాస్) గురించి చాలా తక్కువ మందికి తెలుసు. ఇది చిన్న గుహమాదిరి ఉంటుంది. ఒక రకంగా రాతి ఇల్లు అనుకోవచ్చు. అయితే, దాని నిర్మాణాన్ని బట్టి, అందులోకి దూరి, లోపలికి వెళ్లడం మనుషులకు సాధ్యం కాదు. అందుకే, దేవకన్యలు మాత్రమే వెళతారని స్థానికుల నమ్మకం. కొన్ని అంచనాల ప్రకారం ఈ ఇంటిని సుమారు ఆరు వేల సంవత్సరం క్రితం నిర్మించారు. క్రీస్తుపూర్వం 3,400 నుంచి క్రీస్తుపూర్వం 2,700 మధ్య నిర్మించి ఉండవచ్చని అంచనా.

## నాటి అనుమానం.. నేటి ఆనందం



కొన్ని చిత్రమైన పద్ధతులు మనకు తెలియకుండానే జీవితంలోకి వచ్చేస్తాయి. ఎందుకు? ఏమిటి? అని ఆలోచించుకోకుండానే వాటిని అనుసరిస్తూ ఉంటాం. వాటిలో ఒకటి 'చీర్స్' కొట్టడం. మద్యం తాగేవారేకాదు.. తాగని వారికి కూడా 'చీర్స్' తెలుసు. అంతగా ప్రచుర్యం పొందిన ఈ సంప్రదాయానికి ఎలా వచ్చింది? డ్రింక్స్ తాగడానికి ముందు గ్లాసులను తాకించి చీర్స్ ఎందుకు చెప్పుకోవాలి? అనే ప్రశ్నలకు, ఇది ఒక అనుమానంతో మొదలైన చర్యగా సమాధానం చెప్పాలి. మధ్యయుగం నాటి సముద్రపు దొంగలు ఈ సంప్రదాయానికి ఆద్యులు. ఎందుకంటే, వారు తాము దోచుకున్న సొమ్మును వాటాలు వేసుకోవడానికి ఏదైనా దీవిపైకి చేరేవారు. అక్కడ ఆ సొమ్మును పంచుకోవడానికి ముందు మద్యం తాగేవారు. అయితే, కొంత మంది దొంగలు సొమ్మును తామే కాజేయాలన్న ఉద్దేశంతో, సహచరులు తాగే మందులో విషం కలిపేవారు. రానురాను ఇలాంటి ఘటనలు పెరగడంతో, ఒకరిపై ఒకరికి నమ్మకం తగ్గింది. ఇకపై అలాంటి దుర్మార్గపు చేష్టలు జరగకుండా, అంతా ఒప్పందం కుదుర్చుకున్నారు. మద్యం తాగే ముందు తమ గ్లాసుల్లోని మద్యం ఒకదానిలో నుంచి మరో దానికిలోకి చిందేలా గట్టిగా తాకించుకోవడం ద్వారా విషయం లేదని నిర్ధారించుకోవచ్చన్న ఆలోచనే 'చీర్స్'. దొంగల చావు భయం నుంచి వచ్చిన ఈ సంప్రదాయం ఇప్పుడు విశ్వవ్యాప్తమైంది. ఆనందాన్ని పంచుకోవడానికి, ఏదైనా సందర్భాన్ని సెలబ్రేట్ చేసుకునేందుకు మందు పార్టీలు.. వాటితోపాటే 'చీర్స్' సామాన్యమైంది. వందల సంవత్సరాల నాటి సంప్రదాయం ఇప్పటికీ కొనసాగడం విచిత్రమే.

## అంతరిక్షంలో కాంతి ప్రయాణం..



కాంతి కదలాలంటే ఏదో ఒక యానకం లేదా మధ్యస్థం ఉండాలి అనే అభిప్రాయం చాలా మందిలో ఉంటుంది. కానీ, ఇది నిజం కాదు. పాదార్థిక తరంగాల నిలువకోసం మాత్రమే యానకం కావాలి. అందుకే, శబ్ద తరంగాలు ప్రయాణించడానికి యానకం ఉండాలిగానీ, పాదార్థిక తరంగం కాని కాంతికి అవసరం లేదు. కాంతి స్వభావ రీత్యా విద్యుత్ అయస్కాంత తరంగాల క్రమానుగమనం లేదా విద్యుత్ అయస్కాంత తరంగ ప్రచారం. ఈ విధమైన తరంగాల గమనానికి యానకం అవసరం ఉండదు. వాస్తవానికి శూన్యంలో కాంతి మరింత వేగంగా ప్రయాణిస్తుంది. ఈ వేగం సెకనుకు 3x108 మీటర్లు. యానకం అవసరం లేదు కాబట్టే అంతరిక్షంలో కాంతి ప్రయాణించగలుగుతుంది.

## కప్పలు జారిపోతాయి ఎందుకు?



కప్పలను ఎప్పుడైనా పట్టుకున్నారా? అయితే, అవి పట్టుకున్న వెంటనే జారిపోవడాన్ని తెలుసుకునే ఉంటారు. ఇలా ఎందుకు జరుగుతుంది? నీటిలోనే కాకుండా నేలపై చరించే ఉభయ చరాల శరీరాల పై ఉండే చర్మంపై పొర తడిగా, జిగురుగా పట్టుకొంటే జారిపోయే ధర్మం ఉంటుంది. దీనివల్ల అవి వాతావరణంలోని ఉష్ణాన్ని గ్రహించి పొడిబారిపోకుండా ఉంటాయి. కప్ప శరీరంపై ఉంటే చర్మం దృఢంగా ఉండకుండా పలుచగా ఉండటంతో ఆ చర్మానికి భాష్పీభవనం (బాష్పీభవనం) నుండి అంతగా రక్షణ లభించదు. దాంతో 25 శాతం నుంచి 30 శాతం కంటే దేహంలోని ద్రవపదార్థాలు ఆవిరైతే అది జీవితంలో ఉండలేదు. అందువల్ల కప్ప చర్మం నిరంతరం శ్లేష్మం (శ్లేష్మం)ను, ఇతర పదార్థాలను స్రవించే గ్రంధులను కలిగి ఉంటుంది. గ్రంధుల నుండి స్రవించే ఈ స్రావాలు కప్పదేహంలోని నీటిని తీసుకోవడంలో ఉంచుతాయి. అలాగే ఆ స్రావాలలో ఉండే విషంతో కూడిన సమ్మేళనాలు కప్పలను తినే ప్రాణుల నుండి, బాక్టీరియా, ఫంగస్‌ల బారినుంచి రక్షణ కల్పిస్తాయి. కప్పలు తమలో ఉండే గ్రంధుల ద్వారా సూర్యరశ్మి ప్రభావం తమ చర్మంపై పడకుండా ఒక తెరను కూడా ఏర్పరచుకోగలవు.

సేకరణ: బిఎస్ఎస్ మైత్రేయి

# కాంగ్రెస్ 'న్యాయ పత్రం'

18వ లోక్‌సభ ఎన్నికలకు ప్రధాన ప్రతిపక్షమైన భారత జాతీయ కాంగ్రెస్ తన వాగ్దాన (ఎన్నికల) ప్రణాళికకు ప్రస్తుత పరిస్థితులకు తగినట్లు 'న్యాయ పత్ర' అని నామకరణం చేసింది. 10 సంవత్సరాలుగా నరేంద్రమోదీ పరిపాలనలో కొనసాగుతున్న మతవాద, మితవాద శక్తుల స్వైరవిహారాన్ని నిలువరించి, అధికారంనుంచి తొలగించే కర్తవ్యంతో ఏర్పడిన దాదాపు 25 ప్రతిపక్ష పార్టీల ఐక్యవేదిక 'ఇండియా' కూటమిలో పెద్ద పార్టీ అయిన కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక తమ సాంప్రదాయక ధోరణికి భిన్నంగా జనాభాలో అత్యధిక మెజారిటీగా ఉన్న యువత, రైతులు, మహిళలు, కార్మికుల పక్షం వహించింది. "ఐదు న్యాయాలు" అనే ఐదు మూలస్తంభాలు ఆధారభూతమైన ఈ ప్రణాళిక 25 గ్యారంటీలను దేశ ప్రజలకు హామీ ఇచ్చింది. ఈ గ్యారంటీలను ఇంటింటికీ తీసుకెళ్లే బృహత్ కార్యక్రమాన్ని అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పార్టీ కార్యకర్తలకు నిర్దేశించారు. మాజీ ఆర్థికమంత్రి పి.చిదంబరం అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ రూపొందించిన 'న్యాయ పత్ర'ను శుక్రవారంనాడు ఢిల్లీలో విడుదలచేసే సమయానికే అన్ని గుర్తింపు పొందిన భాషలలోకి సులభ తర్జుమాచేసి సిద్ధంగా ఉన్నారు. హైదరాబాద్ శివారు ప్రాంతం తుక్కుగూడలో శనివారం నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆ ఎన్నికల ప్రణాళికను సెంటిమెంట్‌గా పార్టీ అధినాయకత్వం విడుదల చేసింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇక్కడే బహిరంగసభలో సోనియాగాంధి ఆరు గ్యారంటీలు విడుదల చేశారు. కాంగ్రెస్‌కు విజయం సిద్ధించింది.

మోదీ పాలనలో దేశంలో నిరుద్యోగం రికార్డుస్థాయిలో తాండవిస్తున్నందున, ఖాళీగా ఉన్న 30లక్షల ప్రభుత్వోద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అందుకు యువతను సిద్ధంచేసేందుకుగాను 25సంవత్సరాలలోపు ఉన్న ప్రతి ఒక్క డిప్లమో హోల్డర్, గ్రాడ్యుయేట్ ప్రభుత్వ ప్రైవేటు సంస్థ ల్లో అప్రెంటిస్‌షిప్ పొందే హక్కు కల్పిస్తామంది. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు విద్య, ఉద్యోగావకాశాలు పెంపుచేసేందుకై రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని పెంచుతూ రాజ్యాంగ సవరణ చేస్తారు. ఇడబ్ల్యుఎస్‌కు కల్పించిన 10 శాతం రిజర్వేషన్ కొనసాగిస్తామని స్పష్టం చేసింది. అణచివేతకు గురవుతున్న కులాల జనాభాకు సామాజిక న్యాయం చేకూర్చేందుకై జాతీయస్థాయిలో కుల జనగణన చేపడతామని హామీ ఇచ్చింది. సైన్యంలో రిక్రూట్‌మెంట్‌కు మోదీ ప్రభుత్వం తెచ్చిన అగ్నిపథ్‌ను రద్దుచేసి పూర్తికాలం సైన్యంలో కొనసాగే రిక్రూట్‌మెంట్ విధానాన్ని పునరుద్ధరిస్తామంది.

ప్రజాపక్షం
07-04-2024, ఆదివారం

140 కోట్ల జనాభాకు అన్నం పెడుతున్న అన్నదాతలను కార్పొరేట్ శక్తులకు బానిసలుగావించటానికి మోదీ ప్రభుత్వం తెచ్చిన మూడు నల్లచట్టాలను అపూర్వ ఉద్యమంతో రైతాంగం తిప్పికొట్టింది. ఉత్తరప్రదేశ్ తదితర అసెంబ్లీల ఎన్నికల ముందు ప్రధాని మోదీ వాటిని ఉపసంహరించుకుని దేశ ప్రజలకు తొలిసారి క్షమాపణ చెప్పారు. అయితే వ్యవసాయ పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధ గ్యారంటీ తదితర హామీలను ఏరుదాటాక తెప్పతగిలేసినట్టు తుంగలోతొక్కారు. ఆ హామీల అమలుకోసం పంజాబ్, హర్యానా రైతులు అనేక మాసాలుగా ఆందోళన చేస్తుంటే వారు ఢిల్లీలో ప్రవేశించకుండా హర్యానా బిజెపి ప్రభుత్వం దమనకాండకు ఒడిగడుతున్నది. ఆ ఉద్యమాన్ని బలపరుస్తున్న కాంగ్రెస్ పార్టీ స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసినట్లుగా పంటలకు కనీస మద్దతుధరకు లీగల్ గ్యారంటీని హామీ ఇచ్చింది. గ్రామీణ పేదలకు తోడ్పడేందుకు నోరెగా వేతనాన్ని రోజుకు రూ.400లకు పెంపుదలను హామీ ఇచ్చింది. మార్చి 15వరకు ఉన్న విద్యారుణాల రద్దు, పబ్లిక్ పరీక్ష లు, ప్రభుత్వ ఉద్యోగాల పరీక్షలకు ఫీజు రద్దు, నీట్, క్యాట్ జాతీయస్థాయి పరీక్షల పునఃపరిశీలనను హామీ ఇచ్చింది.

కార్మికులకు సంబంధించి మోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ సంహితలను రద్దు చేస్తామంది.

'ఒక దేశం – ఒక ఎన్నికలు' ఆలోచనను కాంగ్రెస్ తిరస్కరించింది. మోదీ ప్రభుత్వ రాజ్యాంగ విరుద్ధ చర్యలన్నింటినీ సమీక్షించి రాజ్యాంగాన్ని రక్షిస్తామంది. ఎన్నికల బాండ్లు, పిఎం కేర్స్, రాఫెల్ అవినీతిపై దర్యాప్తు చేస్తారు. దుస్తులు, ఆహారం, భాష, వ్యక్తిగత చట్టాల్లో మైనారిటీలకు స్వేచ్ఛ ఇస్తుంది. ప్రతి పేద కుటుంబంలోని మహిళకు ఏటా రూ.1లక్ష సాయంచేసే 'మహాలక్ష్మి స్కీం' ప్రకటించింది. ఓటింగ్ యంత్రాలపై తరచూ అనుమానాలు వ్యక్తమవుతున్నందున ఓటర్ వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రయిల్ (వివిపాట్) స్లిప్పులను పూర్తిగా లెక్కించి యంత్రాల్లో నమోదైన ఓట్ల తో సరిచూసే విధంగా ఎన్నికల చట్ట సవరణను హామీ ఇచ్చింది.

తెలుగు రాష్ట్రాలకు సంబంధించి విద్యాలయాల్లో కుల వివక్షకు వ్యతిరేకంగా రోహిత్ వేముల (హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ప్రాణార్పణ చేసిన త్యాగి) పేరున చట్టం తీసుకురావటం, ఆంధ్రప్రదేశ్‌కు విభజనచట్టం ఆమోదంనాడు ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రత్యేక కేటగిరి హోదా మంజూరు చేయటం ప్రత్యేకించిన వాగ్దానాలు.

ఎన్నికైన ప్రజాప్రతినిధి పార్టీ ఫిరాయించగానే ఆటోమేటిక్‌గా ఆ సభ్యత్వం రద్దు చేస్తూ చట్టం మరో ముఖ్యమైన హామీ. ప్రజలను మెప్పించి ఒప్పించగలిగినప్పుడే ఈ గ్యారంటీలకు సార్థకత, లౌకిక ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది.

# మోడీ కీ గ్యారంటీ వర్సస్ కాంగ్రెస్ న్యాయ్ గ్యారంటీ

లోక్‌సభ ఎన్నికల మొదటి దశ పోలింగ్ తేదీ (ఏప్రిల్ 19) దగ్గర పడటంతో దేశ చరిత్రను మలుపు తిప్పే అత్యంత ప్రతిష్టాత్మకమైన రాజకీయ యుద్ధం మరింత ఉత్కంఠ భరితంగా మారింది. 'ఇండియా' కూటమిలోని కాంగ్రెస్, భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ), సిపిఐ(ఎం)లు కూడా తమ తమ ఎన్నికల ప్రణాళికలు ప్రకటించి జనరంజకమైన వాగ్దానాలు చేశాయి. దీంతో ఇక దేశంలో ప్రధానంగా రెండు సైద్ధాంతిక శక్తులమధ్య హోరా హోరీగా 50 రోజుల పాటు పోరాటం (ఎన్నికల ఫలితాలు వెలువడేవరకూ) కొనసాగనున్నది. ఈ తరుణంలో అటు ఎన్‌డిఎ ఇటు 'ఇండియా' కూటమి తాడో పేడో తేల్చుకోవడానికి ప్రజల్లో ఎప్పటినుండో ప్రచారం ప్రారంభించాయి. భారత ఎన్నికల సంఘం అధికారికంగా షెడ్యూలు ప్రకటించింది. ఒకవైపు మోడీ కీ గ్యారంటీ, మరోవైపు కాంగ్రెస్ న్యాయ్ గ్యారంటీలు ప్రజల్లో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి. భారత్ జోడో యాత్ర రెండు విడతల్లోనూ కాంగ్రెస్‌పార్టీ మొత్తం ఐదున్యాయాలు, 25 గ్యారంటీలు అమలు చేస్తామని ప్రజలకు హామీలు ఇచ్చింది. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక "న్యాయ్ పత్ర–2024'లో కర్షకులు, యువకులు, మహిళలకు కీలక హామీలు ఇచ్చారు. స్వేచ్ఛ,సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం, లౌకికవాదం, సోషలిజం, సమాఖ్యవాదాల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా భారత కమ్యూనిస్టుపార్టీ శనివారంనాడు తన ఎన్నికల ప్రణాళిక విడుదల చేసింది. ఇక కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ పూర్వాధ్యక్షుడు రాహుల్‌గాంధీలు నిర్దిష్ట తరగతులపై దృష్టి కేంద్రీకరించి హామీలు ఇచ్చారు. కులగణన, రిజర్వేషన్ల పరిమితి 50 శాతంపైన పెంపు, రైతుల పంటలకు చట్టబద్ధమైన మద్దతు ధరలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో, విద్యాసంస్థల్లో ఇడబ్ల్యూస్‌కు పదిశాతం కోటా, ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ అమలుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపు, అనేక గ్యారంటీలను కాంగ్రెస్‌పార్టీ తెరమీదకు తెచ్చింది. సుమారు 50 రోజులపాటు వివిధ రాష్ట్రాలలో ఏడు విడతల జరిగే ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా పది కీలకమైన సమస్యలే తెరమీద తారట్లాడుతున్నాయి. నిరుద్యోగం, ధరల పెరుగుదల సమస్యలు పరిష్కరించడంలో కేంద్రం విఫలమైందన్న అంశం ప్రధానంగా ప్రచారంలో ఉంది. సిఎఎ, ఎన్నికల బాండ్ల అవినీతి, ఉమ్మడి పౌర స్మృతి, లఖింపూర్ ఖేరి హత్యలు, విద్వేషప్రచారం, విభజించి పాలించే విధానం వంటివన్నీ ప్రజల్లోకి ఇండియా కూటమి తీసుకు వెళుతున్నది.

**మోడీ కీ గ్యారంటీ**

వరుసగా మూడోసారి కూడా కేంద్రంలో అధికారం చేపడతామని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ధీమాగా ఉన్నారు. 'మోడీ కీ గ్యారంటీ' పేరుతో ఆయన ప్రజలకు హామీలిచ్చి నమ్మబలుకుతున్నారు. ఈ ఎన్నికల ప్రచారంలో ఆయన ప్రధానమైన నినాదం "మోడీ కీ గ్యారంటీ". ప్రధానమంత్రి వెబ్‌సైట్‌లో చెప్పిన ప్రకారం, యువతరాన్ని అభివృద్ధి చేయడం ఈ గ్యారంటీ లక్ష్యం. మహిళలకు సాధికారత, రైతులకు సంక్షేమం మోడీ ప్రచారంలో ప్రధానాంశాలుగా ఉన్నాయి. సమాజంలో అభివృద్ధికి దూరమైన, అణగారిన వర్గాలకు ప్రాధాన్యం ఇస్తామని మోడీ ప్రచారంలో నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. సంక్షేమపథకాలను పరాకాష్టకు తీసుకువెళ్ళాలని..అంటే ఇక అమలు చేయవలసిన అవసరం రానివిధంగా సంక్షేమాన్ని చేరువ చేయాలని భావిస్తున్నట్లు మోడీ ప్రచార వెబ్‌సైట్ చెబుతున్నది. వాస్తవానికి, పథకాల అమలు చేయకుండా ఇప్పటికే కేంద్రం తగినన్ని నిధులు కేటాయించకుండా రాష్ట్రాలను ఎండగడుతున్న విషయాన్ని ప్రచారంలో మరుగున పరుస్తున్నారు. ఈ విషయాలపైనే ఎన్నికల ప్రచారంలో తీవ్రమైన వాగ్యుద్ధం జరుగుతున్నది. దీంతో ఎన్నికల వాతావరణం ఇప్పటికే వేడెక్కిపోయింది.

**కాంగ్రెస్ న్యాయ్ గ్యారంటీ :** 130 ఏళ్ళ చరిత్రగల కాంగ్రెస్‌పార్టీ లౌకిక పార్లమెంటరీ ప్రజాస్వామ్య రక్షణ, రాజ్యాంగ రక్షణ ప్రధాన లక్ష్యాలుగా 'ఇండియా' కూటమికి సారథ్యం వహించి పోరాటంలోకి దిగింది. రాజస్థాన్, చత్తీస్‌ఘడ్ నిరాశపరిచినా హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఈ జాతీయపార్టీకి వెన్నుదన్నుగా నిలిచింది. ఇప్పుడు 18వ లోక్‌సభ ఎన్నికల్లో 25 గ్యారంటీలను సామాన్య పేద ప్రజలకోసం ముందుకు తెచ్చింది. నారీ న్యాయ్, యువ న్యాయ్, కిసాన్ న్యాయ్, శ్రామిక్ న్యాయ్, హిస్సేదారీ న్యాయ్ పేరిట ఐదు న్యాయాలను ప్రధాన వాగ్దానాలుగా ప్రజల ముందు పెట్టింది. రైతులు, యువకులు, మహిళలు, కార్మికులకు ప్రధానంగా ఐదు అంశాలతో న్యాయం చేస్తామని, దేశంలో తమ పాలనద్వారా విప్లవాత్మకమైన మార్పులకు నాంది పలుకుతామని ఖర్గే భరోసా ఇస్తున్నారు. కాంగ్రెస్ ప్రజల ముందుకు తెచ్చిన ఐదు గ్యారంటీలలో ఐదేసి అంశాల వంతున ఉన్నాయి. ఇవన్నీ కలిపితే 25 గ్యారంటీలు. సీనియర్ సిటిజన్లకు, వితంతువులకు నెలకు రూ1,000 వంతున పెన్షన్‌కు కాంగ్రెస్ హామీ ఇచ్చింది రాహుల్‌గాంధీ రెండో విడత భారత్ జోడో న్యాయ్ యాత్రను ప్రారంభించే సమయంలో మణిపూర్ ప్రజలముందు ఈ గ్యారంటీలను వివరించారు. ఈ గ్యారంటీలతోనే కాంగ్రెస్‌పార్టీ తన ఎన్నికల ప్రణాళిక రూపొందించింది.



**నిరుద్యోగం, ధరల పెరుగుదల**

దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల సమస్యలను ఎన్‌డిఎ ప్రభుత్వం పరిష్కరించలేదన్నది కాంగ్రెస్ భాగస్వామిగా ఉన్న 'ఇండియా' కూటమి ప్రధాన ప్రచార అంశాలలో ఒకటి. నిత్యావసర వస్తువుల ధరల సమస్య 'ఇండియా' కూటమి ప్రచారాస్త్రంగా ఉంది. ఉద్యోగాల కొరత, నల్లధనాన్ని నియంత్రించలేకపోవడం వంటి అంశాలతో ఇండియా కూటమి మోడీ ప్రభుత్వాన్ని చుట్టుముట్టింది. 370వ అధికరణ రద్దు, జమ్మూ కశ్మీరులో అసంతృప్తి, మణిపూర్‌లో అశాంతి, అత్యాచారాలు, దాడులు, పౌరసత్వ సవరణ చట్టం వంటి అంశాలను ఇండియా కూటమి ప్రజల్లోకి తీసుకువెళుతున్నది. ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేసేందుకు బిజెపి చేస్తున్న ప్రయత్నాలు, ఎన్నికల బాండ్ల అవినీతి, బిల్కిస్‌బానో కేసులో దోషుల విడుదల వివాదం వంటివన్నీ మోడీ మెడకు గుదిబండలే. బిజెపి దేశాన్ని విభజించి పాలించే విధానంతో ముందుకు వెళుతున్నదని ఇండియా కూటమి ధ్వజమెత్తడం మోడీకి గొంతులో పచ్చివెలక్కాయలా మారింది. ఉమ్మడి పౌరస్మృతి, సిఎఎ, 370వ అధికరణ రద్దులను తమ విజయాలుగా మోడీ ప్రచారం చేసుకుంటున్నారు. ఈ విషయంలో లౌకిక–మతోన్మాద సైద్ధాంతికాంశాలు తెరమీదకు వచ్చాయి.

**రామ మందిరం వర్సస్ ఎన్నికల బాండ్లు**

అయోధ్యలో అట్టహాసంగా ప్రారంభించిన బాలరాముడి విగ్రహావిష్కరణ కార్యక్రమమే తనను ఎన్నికల్లో గెలిపిస్తుందని నరేంద్రమోడీ ఆశలుపెట్టుకున్నారు. జనవరి 22న బాలరాముడి విగ్రహ ప్రతిష్టాపన జరిగింది. 500 ఏళ్ళనాటి దేశ ప్రజల కలను మోడీ నెరవేర్చారని బిజెపి ప్రధానంగా ప్రచారం చేస్తున్నది. హిందీ మాట్లాడే ప్రాంతాలలో ఈ అస్త్రమే తమను గట్టెక్కిస్తుందని మోడీ బలంగా నమ్ముతున్నారు. అదేసమయంలో తాజాగా తెరమీదకు వచ్చిన ఎన్నికల బాండ్ల బాగోతం నరేంద్రమోడీ ప్రతిష్టను దెబ్బతీసింది. దేశ చరిత్రలో ఇంతటి అవినీతి బాహాటంగా జరగలేదనీ, ఎన్నికల బాండ్ల ద్వారా నిధులు సమకూర్చేకునేందుకు సిబిఐ, ఇడి, ఐటి విభాగాలను మోడీ ఐదేళ్ళుగాదుర్వినియోగం చేశారన్నది ప్రజల్లో ప్రధానంగా ప్రచారంలో ఉంది. ఎన్నికల బాండ్ల ద్వారా వచ్చిన సొమ్మును ప్రతిపక్షాలను విభజించేందుకు, వారి పార్టీలను ముక్కలు ముక్కలుగా చీల్చేందుకు ఉపయోగించారన్న వాదన నగర, పట్టణ ప్రాంత ప్రజల్లోకి ప్రధానంగా వెళ్ళింది.

**అమృత్‌కాల్ వెర్సస్ అన్యాయ్ కాల్**

అమృతకాలం అనే పదాన్ని ప్రధామంత్రి ప్రచారంలోకి తెచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047వ సంవత్సరం నాటికి వందేళ్ళు పూర్తి అవుతాయి. అప్పటివరకూ జరిగే ఈ 23 ఏళ్ళ దేశ ప్రయాణాన్ని మోడీ అమృతకాలంగా అభివర్ణించి ఈ 23 ఏళ్ళలో దేశ స్వరూపాన్ని మార్చేస్తామని, తమకే అధికారం ఇవ్వాలని ప్రచారం అందుకున్నారు. కానీ మోడీ పాలనలో ప్రజల జీవన సమస్యలను తప్పదారి పట్టించి వాటికి ప్రచారం ఇవ్వకపోవడంతో 'ఇండియా' కూటమి దీనిని అన్యాయ్ కాల్‌గా పేర్కొంది. ఈ విషయాన్నే ప్రచారంలోకి తెచ్చింది. ధనికులు మరింత ధనికులు కావడం, కార్పొరేట్ శక్తు ల ప్రయోజనాలకోసమే మోడీ పనిచేయడం, మతాన్ని కార్పొరేట్‌శక్తులను చెరో భుజానా వేసుకుని ధీమా వ్యక్తం చేయడాన్ని ఇండియా కూటమి ముఖ్యమైన అంశంగా ప్రజల్లోకి తీసుకువెళుతున్నది. పదేళ్ళ మోడీ పాలనా వైఫల్యాలను ప్రచారంలోకి రానీయకుండా మోడీ తనకు అనుకూలమైన మీడియా ను ఉపయోగిస్తున్న విషయాన్ని ప్రజల్లో పెట్టింది.

**రైతుల మద్దతు ధరలే బర్నింగ్ ఇష్యూ**

నరేంద్రమోడీ రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా తన గోతిని తానే తవ్వుకున్నారని ఇండియా కూటమి ప్రచారంలో ప్రధానాంశంగా ఉంది. వ్యవసాయ చట్టాలను రద్దుచేసినప్పుడు ఇచ్చిన హామీలు ఆయన అమలు చేయలేదు. పైగా రైతుల ఆందోళనలపై దారుణమైన అణచివేతను దేశ ప్రజలంతా చూశారు. రెజ్లర్లపై అణచివేతను కూడా ప్రజలు గమనించారు. లఖింపూర్‌ఖేరీలో సాక్షాత్తూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్‌మిశ్రా కుమారుడు నలుగురు రైతులను హత్య చేసి అరెస్టు అయ్యాడు. ఐనాగానీ అజయ్ మిశ్రాం కేంద్ర మంత్రిగా కొనసాగడం, ఆయనకు మళ్ళీ పోటీ చేసేందుకు టిక్కెట్టు కేటాయించడం, లఖింపూర్ ఖేరి నిందితులను కాపాడే ప్రయత్నం, రైతుల మద్దతు ధరలపై ఇటీవల జరిగిన ఆందోళనపై మోడీ ఏ మాత్రం స్పందించకపోవడం, హర్యానా సరిహద్దుల్లో యువరైతు హర్యానా పోలీసు దాడిలో మరణించడం వంటి విషయాలన్నీ మోడీకి ఇబ్బందికరంగా మారాయి.

కార్మికులు, కర్షకులు, సామాన్య ఉద్యోగులు సమైక్యంగా దేశ వ్యాప్తంగా ఉద్యమాలు చేయడం, జాతీయస్థాయిలో శ్రామికవర్గం సమైక్య ఉద్యమాలు మోడీ ప్రజావ్యతిరేక పరిపాలనను ఎండగడుతున్నాయి. ఈనాడు మోడీ మణిపూర్ సమస్యతో సహా అనేక ప్రశ్నలకు దేశ ప్రజలకు సమాధానాలు ఇవ్వకుండా దాటవేశారు. ఇవన్నీ మోడీకి ఇబ్బందికరంగా మారాయి. ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకం కూడా కొడిగట్టింది. ఆయన ప్రచారం చేస్తున్న వికసిత భారత్‌కు తాజాగా తెరమీదకు వచ్చిన సమస్యలన్నీ అడ్డంగా నిలబడ్డాయి. ప్రధానంగా దేశంలో రాజ్యాంగం, లౌకిక పార్లమెంటరీ వ్యవస్థ సంరక్షణ, ప్రజాస్వామ్య సంరక్షణ అనే ప్రధానమైన అంశాలు ఈ లోక్‌సభ ఎన్నికల్లో ప్రముఖంగా చర్చనీయాంశమవుతున్నాయి.

తారా

## డిపాజిట్లు గల్లంతు...



భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, 1951–52లో మొదటి లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకూ 17 సార్లు సార్వత్రిక ఎన్నికలు జరగ్గా, 18వ సారి ఎన్నికలను ఈనెల 19 నుంచి ఏడు దశల్లో నిర్వహించనున్న విషయం తెలిసిందే. ప్రధాన రాజకీయ పార్టీల మధ్య పోటీ తీవ్రంగా ఉంటే, 'సందిట్లో సడేమియా' కేవలం నామమాత్రపు గుర్తింపుతో నెట్టుకొస్తున్న కొన్ని పార్టీల అభ్యర్థులు కూడా రంగంలోకి రావడం కొత్తేమీకాదు. ఇక 'మేమూ ఉన్నాం' అంటూ వాలిపోయే స్వతంత్ర అభ్యర్థులు ఎందరో. అయితే, 1991 నుంచి 2019 వరకూ జరిగి ఎన్నికల్లో పోటీకి దిగిన ఇండిపెండెంట్లలో 99 శాతం మంది డిపాజిట్లు కోల్పోయారు. మొదటి నుంచి స్వతంత్ర అభ్యర్థులు పోటీకి దిగుతునే ఉన్నారు. అయితే, 1951–52లో 6 శాతం మంది, 1957లో 8 శాతం మంది స్వతంత్ర్య అభ్యర్థులు గెలుపొందారు. అయితే, 2019 నాటికి గెలిచిన స్వతంత్ర అభ్యర్థుల సంఖ్య 0.11 శాతానికి పడిపోయింది. గుర్తింపు పొందిన ఏ పార్టీతోనూ సంబంధం లేకుండా, వ్యక్తిగతంగా, తనకు తానే పోటీ చేసే అభ్యర్థిని స్వతంత్ర అభ్యర్థి అంటారు. దేశ ఎన్నికల డాటాను పరిశీలిస్తే, 1951–52 మొదటి ఎన్నికలలో 533 మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేయగా, వారిలో 37 మంది (దాదాపు 6.90 శాతం) గెలిచారు.పోలైన మొత్తం చెల్లుబాటయ్యే ఓట్లలో కనీసం ఆరవ వంతు ఓట్లను పొందడంలో విఫలమైతే, వారి డిపాజిట్లను ట్రెజరీకి మళ్లించాలని ఎన్నికల సంఘం నిబంధనలు నిర్దేశిస్తాయి. కాగా, 1951లో సాధారణ అభ్యర్థులకు రూ. 500, ఎస్‌టి, ఎస్‌టి వర్గాల అభ్యర్థులకు రూ. 250 సెక్యూరిటీ డిపాజిట్ ఉండగా, అది ఇప్పుడు సాధారణ అభ్యర్థులకు రూ. 25,000గానూ, ఎస్‌టి, ఎస్‌సి అభ్యర్థులకు రూ. 12,500గానూ ఉంది. కాగా, 1957లో, 1,519 మంది స్వతంత్ర అభ్యర్థులు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయగా, వారిలో 42 మంది (8.7 శాతం) విజయం సాధించారు. అయితే ఈ రెండు ఎన్నికల్లోనూ 67 శాతం మంది స్వతంత్ర అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు. మన దేశం అమలు చేస్తున్న బహుళ పార్టీ ప్రజాస్వామ్య విధానం కారణంగా ఎన్నో పార్టీలు ఉనికిలోకి రావడంతో, గెలిచిన స్వతంత్ర అభ్యర్థుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. 1962లో, 20 మంది (4.2 శాతం) స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. 78 శాతానికి పైగా అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు. అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ మరణించిన వెంటనే జరిగిన 1984 ఎన్నికల్లో, 13 మంది (0.30 శాతం) స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు, 96 శాతానికి పైగా డిపాజిట్లు కోల్పోయారు. స్వతంత్ర అభ్యర్థులపై ఓటర్లకు నమ్మకం కుదరడం లేదన్న విషయం ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. స్వతంత్రంగా పోటీ చేసే వారిలో అత్యధిక శాతం మంది ఏదైనా పార్టీ నుంచి టికెట్ ఆశించి, భంగపడిన వారే కావడంతో, ఓటర్లను ఆకట్టుకోలేకపోతున్నారు.

## ఏదెనా అంటాం..



కొంతమంది రాజకీయ నాయకులు ఎన్నికల ప్రచారం అనగానే పూనకంతో ఊగిపోతారు. విస్పష్టమైన అవగాహనతో, సహేతుకమైన విమర్శలు కాకుండా, నోటికి ఇష్టం వచ్చింది మాట్లాడుతూ ఉంటారు. తమిళనాడులో డిఎంకె పార్టీ నాయకుడొకరు మోడీపై రెచ్చిపోయి విమర్శలు గుప్పించాడు. 'మోడీ మళ్లీ గెలిస్తే, మటన్, చికెన్‌పైన కూడా నిషేధం విధిస్తారు. ఇంక మనమంతా సాంబార్ అన్నం, పెరుగు అన్నం మాత్రమే తినాలి' అంటూ సదరు నాయకులు మాట్లాడిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నది. ఇంతకు ముందు తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, ఎఐఎడిఎంకె నాయకుడు పళనిస్వామి కూడా దాదాపు ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. అయితే, బీఫ్‌పై ఆర్‌ఎస్‌ఎస్ వంటి హిందూత్వ సంస్థలు చేస్తున్న వ్యాఖ్యలు, గోవులను తరలిస్తున్నారన్న పేరుతో జరుపుతున్న దాడులను నిరసిస్తూ ఆయన ఆ మాటలు అన్నారు. 'మనం ఏం తినాలో కూడా మోడీయో నిర్ణయిస్తారు. తినే తిండిపైన కూడా ఆంక్షలు విధిస్తారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, అలాంటి సందర్భం ఏదీ లేకుండా, డిఎంకె నాయకుడు చికెన్, మటన్‌పై మోడీ నిషేధం విధిస్తారని అనడం విచిత్రం. కాగా.. తమిళనాడులో 2024 లోక్ సభ ఎన్నికలు మొదటి దశలో, ఈనెల 19న జరగనున్నా యి. రాష్ట్రంలోని మొత్తం 39 స్థానాలు ఉండగా, సమర్థవంతమైన ఎన్నికల ప్రక్రియకు ప్రసిద్ధి చెందిన తమిళనాడులో 2019 ఎన్నికల్లో కూడా అన్ని స్థానాలకు ఒకే దశలో పోలింగ్ జరిగింది. రాష్ట్రంలోని లోక్‌సభ స్థానాల్లో 32 స్థానాలు అన్ రిజర్వ్‌డ్ కాగా, ఏడు స్థానాలు ఎస్‌సి అభ్యర్థులకు రిజర్వ్ అయ్యాయి. 2019 ఎన్నికల్లో డిఎంకె నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయెన్స్ 39 స్థానాలకుగాను 38 స్థానాలు గెలిచి, దేశంలోనే అతి పెద్ద పార్టీ బిజెపికి ఒక్క సీటు మాత్రమే మిగిల్చింది.

## చెక్ పోస్టుల్లో పటిష్టమైన నిఘా

సూర్యాపేట కలెక్టర్ ఎస్ వెంకట్రావు

**ప్రజాపక్షం/సూర్యాపేట:** పార్లమెంట్ ఎన్నికల నేపద్యంలో జిల్లాలోని అన్ని చెక్ పోస్టుల్లో పటిష్టమైన నిఘాతో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ వెంకట్రావు అన్నారు. అక్రమ నగదు, మద్యం, బంగారం, వెండితో పాటు ఇతర వస్తువులను పట్టుకొని బాధితులు ఆధారాలు గ్రీవెన్స్ కమిటీకి అందజేస్తే పరిశీలించి 24 గంటల లోపు తిరిగి అప్పగిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 32 బృందాలు విధుల్లో ఉన్నారని, జిల్లాలో అంతటా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలులో ఉందని తెలిపారు. ప్రజలు అందుకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. ఇప్పటి వరకు జిల్లాలో రూ. 143.63 లక్షలు, మద్యం 11389.75 లీటర్లు కాగా వాటి విలువ రూ. 46.36 లక్షలు, 12 వాహనాల విలువ రూ. 3.39 లక్షలు, బంగారం, ఇతర ఆభరణాల విలువ రూ. 113.63లక్షలు, ఇతర వస్తువుల వివరాలు రూ. 72.07 లక్షలు మొత్తం 379.30 లక్షలు ఉంటుందని తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ద్వారా నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తామనడం హర్షణీయం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 50శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తామని పేర్కొనడం పట్ల బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర రిజర్వేషన్లన్ని కలిపి 50 శాతానికి మించి ఉండరాదని రాజ్యాంగంలో ఉందని, రాజ్యాంగాన్ని సవరించైనా సరే 50శాతంకు పరిమితి ఎత్తివేస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పేర్కొనడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం దేశ జనాభాలో 60 శాతానికి పైగా బీసీలు ఉన్నారని, కాని కేవలం 27 శాతం మాత్రమే రిజర్వేషన్లు బీసీలకు అమలవుతున్నాయని అన్నారు. రిజర్వేషన్లపై పరిమితి ఎత్తివేయడం వల్ల బీసీలకు న్యాయం జరుగుతుందని అన్నారు. దేశ వ్యాప్తంగా బీసీల కులగణన ద్వారా కూడా బీసీల సామాజిక, ఆర్థిక పరిస్థితులు తెలుస్తాయని అన్నారు.

## నాణ్యమైన విద్య అందించాలి



**ప్రజాపక్షం/ రామన్నపేట:** నేటి విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలని రామన్నపేట అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.చందన సూచించారు. మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వార్షికోత్సవాన్ని స్థానిక జేపీ.గార్డెన్స్‌లో అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిధిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మారుతున్న నేటి సామాజిక మార్పులను దృష్టిలో పెట్టుకోని విద్యార్థి దశలోనే వారిలో నైతిక విలువలు పెంపొందే విధంగా విద్యాబోధన సాగించాలన్నారు. ప్రముఖ సాహితీవేత్త, మధురకవి కూరెళ్ల విఠలాచార్య మాట్లాడుతూ ఒక వ్యక్తి సర్వతోముఖాభివృద్ధి విద్యా అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందని అన్నారు. అనంతరం విద్యార్థుల వివిధ నృత్య ప్రదర్శనలు అందరిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గంగుల నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జేవీఎన్ఎస్ మణి, డైరెక్టర్లు జెల్లా వెంకటేశం, ఉట్కూరి నరసింహా, ఎండి.అజీమొద్దిన్, ఉపాధ్యాయులు రషీద్, మురళి, నరేష్, ప్రవీణ్, అయితరాజు శ్రీనివాస్, సత్తయ్య, స్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 200 రోజులు 'ఉపాధి' పనులు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్‌రూరల్ :** తీవ్ర కరువు పరిస్థితులు ఉన్నందున పనులు లేక వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వ్యవసాయ కూలీలను ఆదుకునేందుకు ప్రభుత్వం 200 రోజులు అన్ని గ్రామాలలో ఉపాధి హామీ పనులు కల్పించి వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని అమరవరం గ్రామంలో వ్యకాస సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ పరిధిలో సాగర్ జలాలు ఖమ్మం జిల్లాకు ప్రభుత్వం తీసుకపోతుందని ఈ ప్రాంత ప్రజలకు ఎందుకు తాగునీరు ఇవ్వడం లేదని ప్రశ్నించారు.నియోజకవర్గ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తుందని విమర్శించారు. తాగు నీటి కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీను,పోసనబోయిన హుస్సేన్,వ్యకాస మండల అధ్యక్షుడు షేక్ ఖాసీం, రైతు సంఘం మండల నాయకులు షేక్ సైదా పాల్గొన్నారు.

## సాగర్ ఎడమకాల్వ నీటి ద్వారా చెరువులు నింపాలి : మేదరమేట్ల

**ప్రజాపక్షం/కోదాడ:** నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ద్వారా వచ్చే నీటిని నియోజకవర్గంలోని అన్ని చెరువులు,కుంటలు నింపాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం పట్టణంలోని రైతు సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో సూర్యనారాయణకు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడురోజులుగా సాగర్ ఎడమకాల్వ నుండి ఖమ్మం జిల్లా పాలేరుకు తాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కాల్వ మీద పోలీస్,రెవిన్యూ అధి కారులను కాపలా ఉంచి ఇక్కడున్న నీటిని అక్కడకు తరలించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బెల్లకొండ వెంకటేశ్వర్లు, సిపిఎం పట్టణ కార్యదర్శి ఎం.ముత్యాలు,నడిగూడెం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ,కౌలుదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు షేక్ సైదా,డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాసాని కిషోర్ పాల్గొన్నారు.

## ముందస్తు అడ్మిషన్లపై గుర్తింపు రద్దు చేయాలి : వెంకటేష్

**ప్రజాపక్షం/వీణవంక :** జిల్లాలో ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఇంటర్ బోర్డు నిబంధనలు పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ముందస్తు అడ్మిషన్లు, వేసవి తరగతులు నిర్వహిస్తున్నారని జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు వెంటనే ప్రైవేట్ జూనియర్ కళాశాలల ఆగడాలు అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రైవేట్ కార్పొరేట్ జూనియర్ కళాశాలల ముందు ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఎటువంటి ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వివిధ కోర్సుల పేరుమీద, పండుగల పేరుమీద, వివిధ ఆకర్షనీయమైన పేర్లు పెట్టి విధ్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తూ ఫీజుల రాయితీ ఇస్తామంటూ ఇష్టానుసారంగా అడ్మిషన్లు చేపడతున్నా జిల్లా ఇంటర్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని, ఇప్పటికే కార్పోరేట్ కళాశాలల యాజమన్యాలు, ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసిన విధ్యార్థులకు ఇంకా ఫలితాలు రాక ముందే రెండవ సంవత్సరం తరగతులు నిర్వహిస్తూ ఒక్కో విద్యార్థి నుంచి 50 శాతం ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఎటువంటి విద్యాప్రమాణాలు పాటించకుండా ఇరుకు గదులలో తరగతులు నిర్వహిస్తున్నారని, జిల్లా వ్యాప్తంగా నిబంధనలు పాటించని జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## గంజాయి సరఫరా ఆర్థిక మూలాలపై ఉక్కుపాదం

మల్టీజోన్ ఐజిపి ఎవి రంగనాథ్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గంజాయి సరఫరా ఆర్థిక మూలాలపై ఉక్కుపాదం మోపాలని మల్టీజోన్ ఐజిపి ఏవీ రంగనాథ్ తెలిపారు. నేర సమీక్ష సమావేశానికి మల్టీ జోన్ 1 ఐజిపి గా శనివారం మొదటిసారి ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌కు విచ్చేసిన ఐజిపి ఏవీ రంగనాథ్‌కు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ స్వాగతం పలికి పుష్పగుచ్చం అందజేశారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన నేర సమీక్షా సమావేశంలో ఐజిపి మాట్లాడుతూ జిల్లాలో గంజాయి రవాణా విక్రయాల నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా సరిహద్దు రాష్ట్రాల పోలీస్ అధికారులను సమన్వయం చేసుకుని కట్టడి చేయాలని ఇందు కోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అక్రమ ఫైనాన్స్ వ్యాపారానికి అడ్డు కట్ట వేయాలని, పేద, మధ్య తరగతి ఆర్థిక అవసరాన్ని ఆసరాగా తీసుకుని అధిక వడ్డీలు, స్కీముల పేరుతో అమాయకుల నుండి డబ్బులు తీసుకుని ఇవ్వకుండా వేధిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే కేసులు నమోదు చేయాలన్నారు. ఖమ్మం నగరంలో బైక్ ఫైనాన్స్ కిస్తీలు కట్ట లేదని యువకునిపై దాడి, దుర్మారణానికి కారణమైన ఫైనాన్స్ రికవరీ ఏజెంట్లతో పాటు ఫైనాన్సర్ పై కూడా కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. అక్రమార్జనకు అలవాటు పడిన భూ కబ్జాదారులను వదిలి పెట్టవద్దని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మద్యం, నగదు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణ చర్యలు, సరిహద్దు మార్గాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులలో పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలన్నారు. ఇరు రాష్ట్రాల సరిహద్దు పోలీసులు పరస్పరం సమాచార వ్యవస్థను సమన్వయం చేసుకుంటూ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రూపొందించిన ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాలన్నారు. ఎన్నికల సందర్భంగా తీసుకుంటున్న చర్యలు, అనుసరిస్తున్న వ్యూహంపై, ఎన్నికల బందోబస్తు, శాంతి భద్రతల పై పోలీస్ కమిషనర్ సునీల్ దత్ వివరించారు. పెండింగ్‌లో ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల విచారణలో ఎస్సి, ఎస్టి, ఫోక్సో, ఎన్‌డిపిఎస్ యాక్ట్ కేసులతో పాటు దీర్ఘకాలిక పెండింగ్ కేసులు, తీవ్రమైన కేసుల పురోగతిపై సమీక్ష జరిపారు. ఈ సమావేశంలో అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు, అడిషనల్ డిసిపి గణేష్, ఏఎస్పి అవినాష్‌కుమార్, మౌనిక, ఏసిపిలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రెహ్మాన్, రఘు, శ్రీనివాసులు, ప్రసన్నకుమార్, భోజరాజు, మల్లయ్య, ఫణేంద్ర, నర్సయ్య, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

### గంజాయి అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు : ఎస్పి

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా అక్రమ గంజాయి రవాణాపై జిల్లా పోలీసుల ఉక్కుపాదం మోపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలలో 26 కేసులలో 1379 కేజీల గంజాయిని సీజ్ చేసి కోర్టు ఉత్తర్వుల ప్రకారం జనవాసానికి దూరంగా ఉన్నటువంటి నార్కట్ పల్లి మండలం గుమ్మల బావి పోలీస్ ఫైరింగ్ రేంజ్ నందు శనివారం జిల్లా ఎస్పి డ్రగ్ డిస్పోజల్ కమిటీ అధ్వర్యంలో నిర్వీర్యం చేశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 26 కేసులలో 1379 కిలోల గంజాయిని సీజ్ చేసి నిర్వీర్యం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాములు నాయక్,యస్‌బి డియస్‌పి రమేష్, నల్లగొండ డియస్‌పి శివరాం రెడ్డి,డి.సిఆర్‌బి డియస్‌పి సైదా, సీఐ రాఘవ రావు, బీసన్న,సైదులు, నాగరాజు,ఆర్ఐ లు సురాప్ప నాయుడు,సంతోష్,యస్ఐ అంతి రెడ్డి పాల్గొన్నారు.



## తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రావద్దు

ప్రతి ఇంటికి మంచినీరు అందాలి

కలెక్టర్ హనుమంతు కె.జెండగే



**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్:** క్షేత్ర స్థాయిలో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంత్ కే.జండగే ఆదేశించారు. శనివారం ఆయన మున్సిపల్ కమీషనర్లు, ఆర్.డబ్లు.ఎస్. ఇంజనీర్లు, ఎంపీడీఓలు, ఎంపీవోలతో మండలాలు, మున్సిపాలిటీల వారీగా తాగునీటి పంపిణి, సరఫరా,మరమ్మత్తులపై సమీక్షించారు. ఈసంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ సరఫరా, పవర్ బోర్లు, చేతి పంపులే కాకుండా ప్రతి గ్రామంలో, వార్డులో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి పెట్టుకోవాలని సూచించారు. రోజువారి నీటి పంపిణీ అందుకు తగిన విధంగా సరఫరా ఉండాలని, తేడా ఉంటే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టాలని ఆదేశించారు. ప్రతి ఒక్క ఇంటికి నిర్దేశించిన లక్ష్యం మేర తాగునీటి సరఫరా చేయాలని అన్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ లో పేర్కొన్న విధంగా త్రాగునీటి సమస్యలు రాకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలన ముఖ్యమని, గ్రామాలలో, అర్బన్ వార్డులలో అన్ని బోర్లు పనిచేసేలా చూడాలని చెప్పారు. ఎస్డిఎఫ్ ప్రత్యేక అభివృద్ధి నిధులు, గ్రామపంచాయతీ నిధులు, సంబంధిత శాఖల నిధులు బోర్లు, పైప్ లైన్ల మరమ్మతులకు వినియోగించుకోవాలని, మండల స్పెషల్ ఆఫీసర్లు కూడా క్షేత్రస్థాయిలో పర్యటిస్తారని, సమస్యలు వస్తే అధికారులందరూ సమన్వయంతో పరిష్కరించాలని ఆదేశించారు, ప్రజలకు తాగునీటిని అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. త్రాగునీటి పంపిణి, సరఫరా, మరమ్మత్తుల వివరాల రోజు వారి నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. సమీక్షలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా పరిషత్ సీఈవో ఎన్.శోభారాణి, జిల్లా పంచాయతీ అధికారి సునంద, ఆర్.డబ్లు.ఎస్. కరుణాకరన్ తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలు ఘనత కాంగ్రెస్‌దే

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అతి తక్కువ కాలంలో అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో పట్టణంలోని కౌన్సిలర్ జ్యోతి విద్యాశ్రీ కరుణాకర్ ఆధ్వర్యంలో 35వ వార్డుకు చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో రావడం ఖాయమన్నారు. దేశ ప్రజలు బిజెపి పాలనతో విసుగు చెందిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. దేశ ప్రజలను సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో రూపొందిచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేసే ఇందిరమ్మ ఇండ్లలో చర్చికంపౌండ్‌కు సుమారు 100 ఇండ్లు కేటాయించి చర్చికంపౌండ్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలకు చిన్నపాటి ఇబ్బంది వచ్చిన అండగా నిలుస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తండు శ్రీనివాస్, బొజ్జ సంజయ్, పాలకూరి వెంకటేష్, చెంచల శేఖర్, సాజిత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## తుళ్లూరు చిన్నసత్యం సేవలు మరువలేనివి

సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిధిలోని తనికెళ్లలో సిపిఐ సీనియర్ నాయకులు తుళ్లూరు చిన్నసత్యం 17వ వర్ధంతి కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీస్థూపానికి సిపిఐ జాతీయ సమితి సబ్యులు బాగం హేమంతరావు పూలమాల వేశారు. పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సబ్యులు యర్రా బాబు ఆవిష్కరించారు. ఈసందర్భంగా బాగం హేమంతురావు మాట్లాడుతు పార్టీ అభివృద్ధికి తుళ్లూరు చిన్న సత్యం చేసిన సేవలు మరువలేనివని అభివృద్దిలో ఆయనది క్రియాశీలక పాత్ర అని అన్నారు. పార్టీని ప్రతి ఎన్నికల్లోను గెలిపించేందుకు ఆయన ఎంతో కృషి చేశాడని కొనియాడారు. నీటి సంఘం అధ్యక్షుడిగా పనిచేసి రైతుల పంటలు ఎండిపోకుండా కృషిచేశాడని పేర్కొన్నారు. గ్రామశాఖ కార్యదర్శిగా పనిచేసి పార్టీకి ఆస్తులను కూడబెట్టడంలో ఆయన పాత్ర ఎంతో ఉందని అన్నారు. గ్రామంలో అందరిని కలుపుకొని పోయేవాడని వివాదరహితుడుగా పేరు సంపాదించున్నాడని వివరించారు. ప్రాజసమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమలు చేసినట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. బిజెపి పాలనలో నిత్యావసర సరుకులు , పెట్రోల్ , గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగి పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ తనికెళ్ల గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు , సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సబ్యులు యర్రా బాబు, జిల్లా నాయకులు పివిరావు , మాజీ సర్పంచ్ గడల సీతారామయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు కొణపర్తి విష్ణుమూర్తి , చెరుకుమల్లి వెంకటయ్య, పయ్యావుల నరసింహారావు , కట్ల సత్యం , కవిడ వీరభద్రం , తుళ్లూరు మురళీకృష్ణ , బాలస్వామి , బాసా నాగరాజు , గుమ్మిడెల్లి సైదారావు , గుమ్మిడెల్లి లింగమూర్తి పాల్గొన్నారు.

## నేరుగా రైతుల అకౌంట్లో డబ్బులు జమ



**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మంచినీటి సౌకర్యాలు రైతులకు ఇబ్బందులు లేకుండా అని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని పౌరసరఫరాలు డిప్యూటీ కమిషనర్ పద్మజ అన్నారు. నల్లగొండలోనే పిఎసి సెంటర్ ఆర్జాలబావి పానగల్ ఎస్ఎల్ బిసిలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఎండలు తీవ్రంగా ఉండడం వలన కొనుగోలు కేంద్రాలలో రైతులకు షెడ్లు,చీకట్లో ఉండటానికి విద్యుత్తు సౌకర్యాలు కల్పించారని సూచించారు వరి కొనుగోలు చేసిన వెంటనే సంబంధిత ట్యాగ్ చేయబడిన మిల్లులకు పంపాలని అదేవిధంగా గాని బ్యాగ్‌ల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ జిల్లాలో 370 కొనుగోలు సెంటర్ ద్వారా వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నారని ఇప్పటివరకు ఈ రాష్ట్రంలో మొట్టమొదటిగా 40 లక్షల రూపాయలు రైతుల అకౌంట్‌లో నేరుగా జమ చేయబడ్డాయని తెలియజేశారు. అదేవిధంగా నల్లగొండలోనే కనకమాలక్ష్మి సాయి వెంకటేశ్వర రైస్ మిల్స్ ని సందడి చేయడం జరిగినది కమిషనర్ ఆదేశానుసారం బాయిల్డ్ రైస్ త్వరితగతిన కంప్లీట్ చేయాలని మిల్లర్ని ఆదేశించారు. డిసిఎస్ఓ వెంకటేశ్వర్లు సిబ్బంది ఉన్నారు.

## బాణాసంచా తయారీ కేంద్రంలో విస్ఫోటనం

**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలో అక్రమంగా బాణాసంచా తయారు చేస్తున్న కేంద్రంలో శనివారం విస్ఫోటనం సంభవించింది. ఈ సంఘటనలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడగా, మరో ఇరువురు పాక్షికంగా గాయపడ్డారు. ఈ సంఘటన చిట్యాలలో కలకలం రేపింది. డిఎస్‌పి శివరాంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లాకు చెందిన కోటేశ్వర్‌రావు అనే వ్యక్తి గత కొంత కాలంగా చిట్యాల పట్టణంలలోని 4వ వార్డులోని సంతోష్‌నగర్ ప్రాంతంలో రామన్నపేటకు చెందిన మేకల యా దయ్య ఇంటికి కిరాయికి తీసుకుని ఎలాంటి అనుమతులు లేకుండా బాణాసంచా తయారీ కేంద్రాన్ని నెలకొల్పాడు. పేలుడు పదార్థాలతో 'చటపట్' బాంబులుగా పిలువబడే బాణాసంచాను తయారు చేస్తున్న క్రమంలో కోటేశ్వర్‌రావు చేతిలోనే పేలుడు సంభవించడంతో ఎడమ చేతి మణికట్టు వరకు చెయ్యి నుజ్జు నుజ్జు అయ్యింది. బాణసంచా కేంద్రంలో కూలి పని చేస్తున్న మండలంలోని వనిపాకల గ్రామానికి చెందిన గుడిసె శాంతి శరీరంపై కాలిన గాయాలయ్యాయి. పేలుడు ధాటికి డోర్ తలుపు విరిగి పక్క ఇంట్లో కిరాయికి ఉంటున్న ఎర్రగుంటతండాకు చెందిన బొంత సైది తలపై పడటంతో గాయానికి గురైంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేనికి తరలించారు. విషయం తెలియగానే స్థానిక సిఐ నాగరాజు, ఎస్ఐ సైదాబాబులు సంఘటన స్థలానికి చేరుకుని డిఎస్‌పికి సమాచారం ఇవ్వగా, వెంటనే ఆయన కూడా సంఘటన స్థలానికి చేరుకుని సంఘటన వివరాలను తెలుసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలతో వ్యాపారం చేయడం నేరమని, పేలుడు పదార్థాలు ఎక్కడి నుండి సరఫరా అవుతున్నాయో పరిశోధనలో తెలుసుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి శివరాంరెడ్డి తెలిపారు.

## హత్యాయత్నం మిస్టరీ వీడేదెన్నడో?

విచారణలో తీవ్రజాప్యం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మంజిల్లాలో సంచలనం సృష్టించిన కాంగ్రెస్ నాయకుడు సూరంపల్లి రామారావు పై హత్యాయత్నం కేసు మిస్టరీ వీడడం లేదు. ఫిబ్రవరి 28న రాత్రి మండల కేంద్రమైన కొణిజర్లలో రామారావు పై కొందరు వ్యక్తులు కత్తులతో దాడి చేశారు. ఆయన ఒక వివాహ వేడుకకు హాజరై ఇంటికి వచ్చిన సందర్భంలో ఆయన పై ఆయన ఇంట్లోనే దాడి జరిగింది. ఆయన ప్రాణాపాయ స్థితికి గురై హైదరాబాద్‌లో దాదాపు నెల రోజుల చికిత్స తర్వాత క్రమంగా కోలుకుంటున్నారు. కానీ రామారావుపై హత్యాయత్నానికి ఎవరు పాల్పడ్డారన్నది తెలియ రాలేదు. రామారావు ఇంట్లో ఉన్న సిసి కెమెరాల ఆధారంగా పోలీసులు ఎంత ప్రయత్నించినప్పటికీ సిసి కెమెరాలో ఉన్న యువకులు ఈ ప్రాంతం వారు కాదన్న ఆలోచనకు పోలీసులు వచ్చారు. స్థానికులను నలుగురైదుగురిని పోలీస్ స్టేషన్లకు తరలించి ప్రాథమిక విచారణ చేశారు. రాజకీయ కోణంలో హత్యాయత్నం జరిగిందా అన్న కోణంలోను పోలీసులు విచారణ చేశారు. రెండు రోజుల క్రితం కూడా ఓ పోలీస్ ఉన్నతాధికారి సూరంపల్లి రామారావు హత్యయత్నానికి సంబంధించి గ్రామంలో విచారణ నిర్వహించారు. దాదాపు 40 రోజులు గడుస్తున్నా రాజకీయ నాయకునిపై జరిగిన ఈ హత్యాయత్నంలో దోషులను కనుగోన లేకపోవడం ఏమిటన్న ప్రశ్న వినపడుతుంది. అసలు రామారావు పై దాడి చేసింది ఎవరు, దాని వెనక ఎవరైనా ఉన్నారా, వ్యక్తి గతమా లేక రాజకీయ కారణమా అన్నది తేలియాల్సి ఉంది. రామారావు తొలుత భూ వివాదంలో తనపై దాడి జరిగిందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. కానీ పోలీసులు మాత్రం భూ వివాదానికి సంబంధించిన వారు ఈ హత్యయత్నంలో పాల్గొన్నారా లేదా అన్న కోణంలో దర్యాప్తు చేసినప్పటికీ ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదు. ఇదిలా ఉండగా గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు తనపై దాడి చేయించారని సూరంపల్లి రామారావు రెండు రోజుల క్రితం పోలీసులకు తెలిపినట్లు సమాచారం. జిల్లాలో సంచలనం సృష్టించిన ఈ ఘటనకు సంబంధించి దోషులను గుర్తించడంలో జాప్యంపై పలు రకాల ఆరోపణలు వినవస్తున్నాయి.

## ఎకరానికి రూ.25వేలు చెల్లించాలి



ఎంఎల్ఏ గంగుల కమలాకర్, బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి వినోద్ కుమార్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ఎండిన పంట నష్టానికి ఎకరానికి రూ.25వేలు వెంటనే చెల్లించాలని, యాసంగి సీజన్ నుంచి రైతులకు రూ.500 బోనస్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఎంఎల్ఏ గంగుల కమలాకర్ నివాసంలో శనివారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ గంగుల కమలాకర్ మాట్లాడుతూ చివరి దశలో ఉన్న పంటలను కాపాడేందుకు సాగు నీరు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మద్దతు ధరకు రూ.500 బోనస్ హామీ ఈ సీజన్ నుంచే అమలు చేయాలన్నారు. పిసిసి అధ్యక్షుడి హోదాలో సీఎం రేవంత్ రెడ్డి అడ్డగోలు అబద్దాలు చెప్పి తీరా అధికారంలోకి వచ్చాక రైతుల నోట్లో మట్టిగొడుతున్నారని , రైతుల ఉసురు పోసుకుంటే ప్రభుత్వానికి పుట్టగతులుండవని కరీంనగర్ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. కరీంనగర్, మానకొండూర్ నియోజక వర్గ కేంద్రాల్లోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పాల్గొన్నారు.

### రైతుల సంక్షేమమే బిఆర్ఎస్ లక్ష్యం

**ప్రజాపక్షం/సూర్యాపేట:** తెలంగాణ రైతుల సంక్షేమమే లక్ష్యంగా బిఆర్ఎస్ పార్టీ పని చేస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్‌లో రైతు పోరుబాటలో భాగంగా నిర్వహించిన దీక్షలో రైతులు, బిఆర్ఎస్ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే 2లక్షల రుణమాఫి అమలు చేయాలని, ప్రతి క్వింటాకు రూ. 500 బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎండిపోయిన ప్రతి ఎకరానికి రూ. 25వేల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ, మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, నాయకులు నిమ్మల శ్రీనివాస్ గౌడ్, ఉప్పల ఆనంద్, మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్ రైతులను మోసం చేసింది..

**ప్రజాపక్షం/వైరా :** రైతుకు అండగా అని, బిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం వైరాలో మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ వైరా నియోజకవర్గ ఇంచార్జి బానోతు మదన్‌లాల్ ఆధ్వర్యంలో రింగు రోడ్డు వద్ద రైతు భరోసీ దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో ఖమ్మం బిఆర్ఎస్ పార్టీ ఎంపి అభ్యర్థి ఎంపి నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ రైతుకు భరోసా కల్పిస్తూ కెసిఆర్‌కు మద్దతుగా నిలవాలన్నారు. ఎకరాకు రూ.25వేలు నష్టపరిహారం ఇవ్వాలని, వారికి మద్దతుగా ఇస్తానన్న రూ.500ల బోనస్‌ను తక్షణమే చెల్లించి రైతులను ఆదుకోవాలన్నారు.



# వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కలెక్టర్ భవేష్ మిశ్రా



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** వేసవిలో ప్రజలు వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో వివిధ శాఖల అధికారులతో వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న రెండు నెలలు జిల్లా లో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు ఎండదెబ్బ వల్ల ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా జి ల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో అత్యవసర మం దులతో పాటు ఒఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉం చాలని గ్రామ స్థాయిలో ఎఎన్ఎం, ఆశా వర్కర్లకు వడదెబ్బ తగిలితే చేయవలసిన అత్యవసర వైద్య సేవల గు రించి శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రజలకు వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలని గ్రామాలలో, పట్టణాలలో, పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాలలో, కార్మికులు పని చేయు ప్రాంతా ల్లో బస్టాండ్ లలో ఒఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో అత్యవసర వైద్య సేవల కోసం అన్ని ఏర్పాట్లుతో సిద్ధం గా ఉండాలన్నారు. ఉష్ణోగ్రతలు పెరిగి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు వేడెక్కి కాలిపోయే ప్రమాదం ఉన్నందు న తగు జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. వ్యవసాయ క్షేత్రాల లో పని చేసే రైతులు మధ్యాహ్నం సమయంలో పురుగు మందులు పిచికారి చేస్తే అస్వస్థకు గురి అయ్యే అవకాశం ఉంటుందని వ్యవసాయ క్షేత్రాలలో పనిచేసే రైతులు ఉదయం 11:00 గంటల వరకు పనులు ముగించు కోవాలని తిరిగి సాయంత్రం 5:00 గంటల తర్వాత పనులు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతు వేదికలలో, గ్రామపంచాయతీలలో ఎఇఒల ద్వారా వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించాలని, అంగన్వాడీ కేంద్రాలలోని చిన్నారులు మధ్యాహ్న సమయంలో గొడుగు ఏర్పాటు చేసి ఇళ్లకు తీసుకువెళ్లి వదలాలని, అంగన్వాడీ కేంద్రాలలో పోషన్ వాటికలో ఏర్పాటు చేసిన మొక్కలు ఎండవల్ల చనిపోకుండా సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. రానున్న రెండు నెలలు చాలా కీలకమని ప్రతి వారం ఆయా శాఖల అధికారులు నివేదిక అందచేయాలని, వడదెబ్బ వల్ల ఏదైనా సంఘటన జరిగితే సంబంధిత శాఖల అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్. హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, డిపిఒ నారాయణరావు, వ్యవసాయ అధికారి విజయ భాస్కర్, ఉద్యాన అధికారి సంజీవరావు, విద్యుత్ శాఖ ఇఇ మల్హార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### 100 రోజులు ఉపాధి పనులు కల్పించాలి

కూలీలకు ఉపాధి హామీ పథకం పనులు కల్పించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. శనివారం ఐడిఒసి కార్యాలయం నుండి ఉపాధి హామీ పథకం పనులు కల్పనపై ఎంపిడిఒలు, ఎంపిఒలు, టిసిలు, టిఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉపాధి హామీ పథకం పనులకు హాజరవుతున్న కూలీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి తప్పనిసరిగా 100 రోజులు పని దినాలు కల్పించాలని అన్నారు. ప్రతి గ్రామంలో కనీసం 200 మంది కూలీలకు తగ్గకుండా పనులు కల్పించి 300 రూపాయలు వేతనం చెల్లించు విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పనులు కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఉపాధి హామీ పథకం పనులు జరిగే స్థలాల వద్ద కూలీలకు తాగునీరు, నీడ కొరకు షేడ్ నెట్స్, ఎండ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఒఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు. ఉదయం 6 నుండి 11 గంటల వరకు, అలాగే సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు వాతావరణం చల్లగా ఉన్నప్పుడు పనులు చేపట్టాలని తెలిపారు. కూలీలు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. కూలి పెరుగుదలకు చేపట్టాల్సిన అంశాలను ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కలెక్టర్ భవాని శంకర్ ప్రసాద్, జడ్‌పిసిఇఒ విజయలక్ష్మి, డిఆర్‌డిఒ, అదనపు డిఆర్‌డిఒ, అన్ని మండలాల ఎంపిడిఒలు, ఎంపిఒలు, ఎపిఎంలు టిఏలు, టిసిలు, ఫీల్డ్ అసిస్టెన్స్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ ఖానాపూర్ మండల పరిధిలోని అశోకనగర్‌లో మిషన్ భగీరథ తాగునీటి సరఫరా వ్యవస్థను జిల్లా పంచాయతీ అధికారి కల్పన, మండల ప్రత్యేకాధికారి, జడ్‌పి సిఇఒ రామిరెడ్డిలతో కలిసి పరిశీలించారు. గ్రామాల్లో చివరి ఇంటి వరకు తాగునీటి సరఫరా క్రమం తప్పకుండా జరగాలన్నారు. గ్రామంలో ప్రజలను నీటి సరఫరా తీరును అడగగా సంతృప్తి వ్యక్తం చేశారు. బోర్‌వెల్స్, చేతి పంపుల పనితీరుపై క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ మిషన్ భగీరథ త్రాగునీటి సరఫరా అనివార్య కారణాల వలన నిలిచిపోతే ప్రత్యామ్నాయంగా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మరమ్మత్తులకు గురైన బోర్లు, చేతి పంపులను వెంటనే బాగు చేయించాలని సూచించారు. సర్పంచ్‌లు లేనందున ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శి ప్రతి రోజు సందర్శించి త్రాగునీటి ఎద్దడి రాకుండా చూడాల్సిన బాధ్యత మీపై ఉందని సూచించారు. అంతకుముందు కలెక్టర్ ఓవర్‌హెడ్ ట్యాంకులకు, బోర్లను పరిశీలించి నీరు ప్రజలకు తగినంతగా సరఫరా చే స్తున్నారా అని కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఎంపిడిఒ, తహసీల్దారు, ఎంపిఒ, ఎపిఒ, గ్రామ కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలలో విక్రయించాలి

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/కౌడిపల్లి :** ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను దళారులకు అమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. శనివారం మండల పరిధిలోని మహమ్మద్ నగర్ గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ను కలెక్టర్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 410 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దాంట్లో ఈరోజు వరకు 75 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని సోమవారం నాటికి పూర్తిస్థాయిలో కేంద్రాలు ప్రారంభిస్తామని తెలిపారు. రైతులు ఆరుగాలు కష్టపడి పండించిన పంటలను దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే రైతులు నాణ్యమైన ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరను పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిఇఒ దుర్గ గౌడ్ ,నర్సాపూర్ క్లస్టర్ అసిస్టెంట్ రిజిస్టర్ శంకర్ నాయక్ ,ఎడిఎ పుణ్యవతి, ఎంపిడిఒ శ్రీనివాస్, మైపాల్ రెడ్డి, గోపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, యాదుల్ వెంకన్న ఏవో దివ్య, సెక్రటరీ ప్రసాద్ రైతులు పాల్గొన్నారు.

## ఒసి 2 బ్లాస్టింగ్ సమయాన్ని మార్చాలి

ఎఐటియుసి ఆధ్వర్యంలో గని మేనేజర్‌కు వినతి



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** భూపాలపల్లి ఏరియాలోని కెటికె ఓసి 2లో ఎండ తీవ్రత కారణంగా బ్లాస్టింగ్‌లో పని చేయుచున్నటువంటి ఔట్ సోర్సింగ్ కార్మికులు బ్లాస్టింగ్ సమయాలు మార్చలని ఎఐటియుసి ఆధ్వర్యంలో గని మేనేజర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అట్లాగే ఎండ తీవ్రతకు చలువ పందిళ్లు, మజ్జిగ, ఒఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని ఎఐటియుసి సంఘం ఆధ్వర్యంలో గని మేనేజర్‌కు మెమోరాండం ఇవ్వడం అందజేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి పిట్ సెక్రటరీ ఎండి, కరిముల్లా సహాయ కార్యదర్శి అల్లి చేరాలు, సేఫ్టీ కమిటీ మెంబర్,యన్ రవీందర్, ఔట్ సోర్సింగ్ కార్మికనాయకులు యస్,రాజేష్, ఔట్ సోర్సింగ్ నాయకులు పాల్గొన్నారు.

## రైతులను సంక్షేమం నుండి రక్షించుకుందాం

వరంగల్ ఉమ్మడి జిల్లా సదస్సును జయప్రదం చేయాలి

**ప్రజాపక్షం/ వరంగల్ :** రైతులను సంక్షేమం నుండి రక్షించుకుందామని రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ అన్నారు. వరంగల్ నగరంలోని అబ్బనికుంట రైతు భవనంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటి సమావేశం శనివారం నిర్వహించారు. ఈనెల 26న జరిగే జిల్లా సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రపంచీకరణలో భాగంగా అంతర్జాతీయ ద్రవ్యనిధి ప్రపంచ వాణిజ్య సంస్థల ఆదేశిత విధానాలు అమలు కారణంగా భౌళజాతి కంపెనీలు, కార్పొరేట్ గుత్తా పెట్టుబడిదారుల అనుకూల రైతు వ్యతిరేక విధానాలు అమలు చేయడానికి ఏమాత్రం వెనకాడక పోవడం వల్ల వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభానికి నెట్టివేయపడిందన్నారు. ప్రత్యక్షంగాను, పరోక్షంగాను నేటికి 75శాతం మంది ఉపాధిని ఇస్తున్న మన వ్యవసాయ రంగంమీదనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు మూసివేతతో కోట్లాది మంది ఉద్యోగులు, కార్మికులు పని కొల్పోయి వీధినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత ఉద్యోగాల అవకాశాలు రాలేదని నిరుద్యోగం తాండవిస్తూ యువత పెడదారి పడుతున్నారు. దేశ ప్రజలకు ఆహార భద్రత ఉండాలన్న, రైతుల ఆత్మహత్యలు నివారించాలన్న, యువతకు పని కల్పించే గ్రామీణ వలసలు తగ్గి నిరుద్యోగం తీరాలన్న లాభసాటి వ్యవసాయమే పరిష్కరమన్నారు. ఈనెల 26న వరంగల్‌లో జరిగే సదస్సుకు ముఖ్యఅతిథులుగా హైకోర్టు విశ్రాంతి న్యాయమూర్తి చంద్రకుమార్, తెలంగాణజన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, ప్రొఫెసర్ యాదగిరచార్యులు పాల్గొనడం జరుగుతుందన్నారు. అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, నాయకులు అంబయ్య, అంశాల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, దామోదర్‌రెడ్డి, తోట విజేందర్, రవీందర్, ఎల్లయ్య, కత్తి సుధాకర్, ప్రభాకర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.



## ఆరు గ్యారంటీలకు వారంటీ లేదు

● హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం ● రైతు నిరసన దీక్షలో ఎమ్మెల్యే సునీతా రెడ్డి



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలం చెందిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి మండిపడ్డారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు నిరసన దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సునీత రెడ్డి హాజరై మాట్లాడారు. రైతులు వేసిన పంటలు ఎండి అనేక ఇబ్బందులు పడుతుంటే ఈ ప్రభుత్వం ఇప్పటివరకు ఎండిన పంటల లెక్కలను గుర్తించకపోవడం బాధాకరమన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు నాణ్యమైన 24 గంటల కరెంటును అందించడం జరిగిందని ఆమె గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు కరువు కాటకాలతో అల్లాడుతుంటే ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. లో వోల్టేజ్‌తో రైతుల పంటలు సక్రమంగా పారక ఎండిపోతున్నాయన్నారు. ప్రజల నుంచి ఓట్లు దండుకోవడం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో అమలు కానీ పథకాలను ప్రవేశపెడుతూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని లేకుంటే బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ లేబర్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ దేవేందర్ రెడ్డి, జెడ్పి కోఆప్షన్ నెంబర్ మన్సూర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, మున్సిపల్ చైర్మన అశోక్ గౌడ్, వైస్ చైర్మన్ నహీముద్దీన్, శివ్వంపేట ఎంపిపి కల్లూరి హరికృష్ణ, నాయకులు శివకుమార్, చంద్రశేఖర్, యాద గౌడ్, పంబల బిక్షపతి, బాల్ రెడ్డి, జ్ఞానేశ్వర్, ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

కడియం పదవి, పైసల కోసం పార్టీ మార్పు

నేను ప్రాణం ఉన్నంత వరకు

బిఆర్ఎస్‌ను వీడను : పల్లా రాజేశ్వర్ రెడ్డి



**ప్రజాపక్షం/స్టేషన్ ఘనపూర్/జనగామ ప్రతినిధి:** ఎమ్మెల్యే కడియం శ్రీహరి పైసలకోసం, తన కూతురుకు పదవి కోసం కాంగ్రెస్ పార్టీలో చేరారని జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆరోపించారు. శనివారం స్టేషన్ ఘనపూర్ డివిజన్ కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన రైతు దీక్షలో పల్లా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి అధికారంలోకి రాగానే ఆమాటే మరిచిపోయిందని విమర్శించారు. పంటలు ఎండిపోతున్న సాగు నీరు అందించకుండా చోద్యం చూస్తున్నారని ఇంత వరకు రైతుబంధు ఇవ్వలేదని మండిపడ్డారు.బిఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి తనకూతురుకు ఎంపి టిక్కెట్ ఇవ్వాలని లేకుంటే కాంగ్రెస్‌లోకి వెళ్తానని కెసిఆర్‌ను బ్లాక్ మెయిల్ చేశాడని అందుకే ఎంపి టికెట్ కడియం కావ్యాకు ఇవ్వడం జరిగిందన్నారు. అయినా కూడా డబ్బుకు, పదవికి ఆశపడి కాంగ్రెస్‌లో చేరి బిఆర్ఎస్ పార్టీలో అంతా అవినీతి ఉందని మాట్లాడం సిగ్గుచేటన్నారు. ఆరు నూరైన రానున్న వరంగల్ పార్లమెంటు ఎన్నికల్లో కడియం కావ్యను చిత్తుగా ఓడించి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని అధిక మెజారిటీతో గెలిపించుకోవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి బస్వరాజు సారయ్య, రాష్ట్ర కార్యదర్శి ఎడవెల్లి కృష్ణారెడ్డి, ఎంపిపి చిట్ల జయశ్రీ ఉపేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు, జిల్లా నాయకుడు అక్కినపల్లి బాలరాజు, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ చల్లా చందర్ రెడ్డి, మారపల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

### నష్టపోయిన రైతులకు ఎకరాకు 25వేలు ఇవ్వాలి

పంట నష్టపోయిన రైతులకు ఎకరాలకు రూ.25వేలపరిహారం చెల్లించడంతో పాటు బోనస్‌గా క్వింటాలుకు 500 రూపాయలు ఇవ్వాలని జనగామ ఎంఎల్ఎ పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ పిలుపులో భాగంగా శనివారం జనగామ చౌరస్తా వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలో భాగంగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయాలన్నారు. రైతుబంధు, కౌలు రైతులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలని, యాసంగి ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ ముత్తిరెడ్డి యా దగిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరబోయి నబాగ్యలక్ష్మి , మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, మార్కెట్ కమిటీ మా జీ చైర్మన్ సిద్దిలింగం, తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి అభివృద్ధికి కావలసిన నిధులు తెప్పిస్తా

కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్

తూర్పు జయప్రకాశ్ రెడ్డి



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** సంగారెడ్డి అభివృద్ధి కోసం కావలసిన నిధులు తెచ్చే బాధ్యత వహిస్తానని, అభివృద్ధి కోసం పూర్తి సహకారం అందిస్తానని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాశ్ రెడ్డి అన్నారు. సంగారెడ్డిలోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం మల్కాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సమావేశానికి జయప్రకాష్ రెడ్డితో పాటు జిల్లా అధ్యక్షురాలు టిఎస్ ఐఐసి చైర్మన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రిని, ఇతర మంత్రులను కలసి సంగారెడ్డి అభివృద్ధికి అవసరమయ్యే నిధులను మంజూరు చేయిస్తానని నాయకులకు, కార్యకర్తలకు హామిచ్చారు. సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలకు ఏ సమస్య ఉన్న ఆఫీసులో తెలియజేయాలని కోరారు. జిల్లా మంత్రులు దామోదర్ రాజనర్సింహ్మా, ఇంచార్జీ మంత్రి కొండాసురేఖల సహకారంతో సంగారెడ్డిని అభివృద్ధి చేస్తానన్నారు. మున్సిపాలిటీలలో, గ్రామాల్లో మంచి నీటి సమస్య, రోడ్ల సమస్య, మహిళా సంఘాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. సదాశివపేట, కొండాపూర్‌లలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన ఇండ్ల స్థలాలను టిఆర్ఎస్ ప్రభుత్వం లాక్కుందని, తిరిగి లబ్ది దారులకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారన్నారు. మళ్లి వారికే పట్టాలు వచ్చేలా కృషి చేస్తానన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు సంగారెడ్డి నియోజకవర్గం నుండి 25వేల ఓట్ల మేజార్టీ ఇవ్వాలని , ఆదిశగా అందరూ కృషిచేయాలని సూచించారు. ఈ నెల 13వ తారీఖున జరిగే సమావేశానికి ఎంపి అభ్యర్థి నీలం మదు, సంగారెడ్డి నియోజకవర్గానికి వస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి వైద్య ఆరోగ్య శాఖ దామోదర రాజనర్సింహ్మా ,జిల్లా ఇంచార్జీ మంత్రి కొండా సురేఖ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకురాలు జయారెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు, వై.ప్రభు, సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్, ఎంపిపి మనోజ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నర్సింహారెడ్డి , బాస్కర్ రెడ్డి, మల్లారెడ్డి, సునీల్, మండల అధ్యక్షులు, ఎంపిటిసిలు, సర్పంచులు ,కౌన్సిలర్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులపై కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలు

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్య చేపడుతుందని, బిఆర్ఎస్ మీద ఉన్న కోపం రైతులపై చూపెట్టరాదని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో భూపాలపల్లి టౌన్ అధ్యక్షుడు జనార్ధన్ అధ్యక్షతన చేపట్టిన నిరసన దీక్షకు గండ్ర వెంకటరమణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఎ మాట్లాడుతూ, కెసిఆర్ హయాంలో తెలంగాణ ఒక స్వర్ణ యుగం, రైతులు అడగకముందే రైతుబంధు, 24 గంటలు నాణ్యమైన ఉచిత కరెంటు, ఇచ్చి తెలంగాణ అభివృద్ధికి తోడ్పడితే, ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతు సమస్యలు పట్టనట్టుగా వ్యవహరించడం సరికాదన్నారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న తెలంగాణలో నీటి సమస్య రాకూడదని బీడు భూములను పచ్చని పొలాలుగా మార్చే దృఢ సంకల్పంతో పక్క రాష్ట్రాల ప్రభుత్వమును ఒప్పించి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే 10 సంవత్సరాలు తెలంగాణ అన్నపూర్ణ రాష్ట్రంగా అవ అవతరించిందని పేర్కొన్నారు. కానీ రేవంత్ రెడ్డి ఏదో మేడిగడ్డలో ఒక రెండు పిల్లర్లు కూలినంత మాత్రాన పనికి రాదని తప్పుడు ప్రచారం చేస్తూ రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలు చేయకుండా మేడిగడ్డలో బ్యారేజ్ లో కాపర్ డ్యామ్ నిర్మాణం చేపట్టి రానున్న వర్షాకాలంలోపు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించి ఆదుకోవాలనిఅన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్రజ్యోతి, మున్సిపల్ చైర్ పర్సన్ ఎస్ వెంకటరాణి సిద్దు, వైస్ చైర్మన్ గండ్ర హరీష్ రెడ్డి, జెడ్‌పివైస్ చైర్పర్సన్ రఘుపతిరావు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్, వినోద, మల్లారెడ్డి, తిరుపతి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, రైతు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి:ఎర్రబెల్లి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి ఆదుకోవాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రాజీవ్‌చౌరస్తాలో ఎండిన పంటలకు మద్దతుగా చేపట్టిన రైతుల మహాధర్నాకు ఆయన హాజరై మాట్లాడుతూ ఇది కాలం తెచ్చిన కరువు కాదని కాంగ్రెస్ తెచ్చిన కరువన్నారు. రైతులు పండించిన పంటలకు క్వింటాకు బోనస్ రూ.500లు ఎప్పుడిస్తారని, రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిలు నల్ల నాగిరెడ్డి, అనిమిరెడ్డి, మండల పార్టి అధ్యక్షులు పసునూరి నవీన్, రామోజీ, జెడ్‌పిటిసిలు శ్రీనివాసరావు, శ్రీనివాస్ నాయకులు భాస్కర్‌రెడి తదితరులు పాల్గొన్నారు.



## వంద కోట్లు ఎలా వచ్చాయ్?

మూడేండ్లు ఎంఎల్‌సిగా ఉన్నా.. ఏనాడూ సిద్దిపేట రాలే

కాంగ్రెస్ 17 సీట్లు గెలిచినా రాహుల్‌గాంధీ ప్రధాని కారు

బిజెపి పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** మెదక్ జిల్లాకు బిఆర్ఎస్ నేత వెంకట్రామ్‌రెడ్డికి ఏలాంటి సంబంధం లేదని బిజెపి పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్దిపేటలో జరిగిన ప్రచార సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బిఆర్ఎస్ టికెట్ ఇ వ్వటానికి మెదక్ జిల్లా నుండి ఒక్క బిఆర్ఎస్ నాయకుడు కెసిఆర్‌కు దొరకలేదా అని ప్రశ్నించారు. మూడు ఏళ్లుగా ఎంఎల్‌సిగా పనిచేస్తున్నా ఒక్కనాడు సిద్దిపేటకు రాలేదన్నారు. సిద్దిపేట గాంధీ విగ్రహానికి దండ కూడ వేయని వ్యక్తి 100 కోట్లు ఖర్చు పెడుతాడంటే ప్రజలు నమ్మె స్థితిలో లే రన్నారు. లక్ష రూపాయల జీతానికి పనిచేసిన వ్యక్తి 100 కోట్లతో 10 ఎ కరాల భూమిని కొనుగోలు చేశారన్నారు. వెయ్యి కోట్లు ఎక్కడ నుండి వ చ్చాయో లెక్క చెప్పాలన్నారు. సిద్దిపేటకు చెందిన వ్యక్తికి టికెట్ ఇచ్చేందు కు మాజీ మంత్రి హరీష్‌రావుకు మనస్సు రాలేదన్నారు. ఎంపి రంజిత్ నుండి మొదలుకొని కడియం కావ్యవరకు మీ టికెట్ మాకు వద్దని పారిపోతున్నారన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి 17ఎంపి స్థానాలు గెలిపించాల ని సిఎం రేవంత్‌రెడ్డి కోరుతున్నారన్నారు. 17 స్థానాలు గెలిపించిన పప్పు రాహుల్ ఎన్నటికి ప్రధాని కాలేడన్నారు. మోడీకి ఓటువేస్తే దేశం బాగుపడుతుందన్నారు. ఎంఎల్ఎ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ అపజయం లేదని విర్రవీగిన కెసిఆర్‌ను ఓడించింది బిజెపి కార్యకర్తలే అన్నా రు. బిజెపి నేత చీకోటి ప్రవీణ్ మాట్లాడతూ తెలంగాణలో అత్యదిక మెజా ర్టీ సీట్లు గెలిపించాల్సిన బాధ్యత మహిళలదే అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బిజెపిలకు ఓటుతో బుద్ధి చెప్పాలి : హరీష్‌రావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట అభివృద్ధి అంటే ఓర్వలేని కాంగ్రెస్, బిజెపిలకు ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి హరీష్‌రావు పిలుపునిచ్చారు. సిద్దిపేట లావణ్య గార్డెన్‌లో జరిగిన సిద్దిపేట మండ లం, నారాయణరావుపేట మండల కార్యకర్తల సమావేశంలో ఎంపి అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డితో కలసి మాట్లడారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన సిద్దిపేటగడ్డ అభివృద్ధిపై రేవంత్‌రెడ్డి,రఘునందన్‌రావులు ఓర్వటం లేదన్నారు. పులివెందుల, కుప్పం తరహాలో బిఆర్ఎస్ అడ్డగా సిద్దిపేటకు పేరుందన్నారు. 100 అబద్దాలు ఆడి, ఆరు గ్యారంటీలు ఆని బాండ్ పేపర్లు మీద సంతకాలు చేయించుకొని నేడు మోసం చేశారన్నారు. అబద్దాలతో మోసం చేసిన రఘునందన్‌రావుకు దుబ్బాక లో చిత్తుగా ఓడించటం జరిగిందన్నారు. ఎంపి అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డి మనస్సున్న వ్యక్తి అని, ఆయన వంద కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి మీకు అండగా నిలుస్తారన్నారు. రుణమాఫీ అని మాటను కాంగ్రెస్ తప్పిందన్నారు. ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్, బిజెపిలను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఎంపి అభ్యర్థి, మాజీ కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్‌గా నాకు మంచి పేరు తేచ్చారని, ఎంపి గా ఘన విజయం అందించి ఆశీర్వదించాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నాకు కలెక్టర్‌గా గుర్తింపు నిచ్చిన గడ్డ అని, ఎంపిగా గెలిచి ప్రజాసేవ చేసి రుణం తీర్చుకుంటానన్నారు. వంద కోట్ల ట్రస్టుతో యువతకు, రైతులకు అండగా ఉంటానన్నారు. పేదలకు సహాయం చే స్తానంటే కొంతమంది విమర్శలు చేస్తున్నారన్నారు. ట్రస్టుద్వార కోచింగ్ కేంద్రాలు, వృత్తినైపుణ్యం, కేంద్రాలు ఏర్పాటు చేసి జాబ్ మేళా నిర్వహించి ఉపాధి అవకాశాలు కల్పిస్తానన్నారు. ఈకార్యక్రమంలో సుడా మాజీ చైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి,వివిధమండలాల ఎంపిపిలు, జడ్‌పిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

# లోకసభ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి వెంకటేష్ దోత్రే



**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్** : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా లోకసభ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా ఎస్పి సురేష్ కుమార్, అదనపు కలెక్టర్ వేణుతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో మే 13వ తేదీన నిర్వహించే పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఫిబ్రవరి 8వ తారీకు వరకు 4,55,437 మంది ఓటర్లు ఉన్నారని, వీరికి 676 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో 597 ఏర్పాటు చేయగా ఇప్పుడు ఆ సంఖ్య 676 పెరిగిందని, దీనిలో 47 సమస్యాత్మక, 22 మావోయిస్టు ప్రభావిత, 56 నెట్వర్క్ లేని పోలింగ్ కేంద్రాలుగా గుర్తించినట్లు వివరించారు. గత అనుభవాల దృష్ట్యా పోలింగ్ సిబ్బందికి ఇబ్బందులు కాకుండా పోస్టల్ బ్యాలెట్ వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. శిక్షణ సమయంలోనే ఫామ్ 12 ద్వారా దరఖాస్తు తీసుకుంటున్నట్లు తెలిపారు. పోస్టల్ ఉద్యోగులు మే 3 నుండి 8వ తారీఖు వరకు ఓటు వేయవచ్చన్నారు. ఓటు వినియోగం రోజు ప్రత్యేక సాధారణ సెలవు దినం వర్తిస్తుందని వివరించారు. ఫిర్యాదుల స్వీకరణ కోసం కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఫిర్యాదులను 1950 లేదా 08733279033 నెంబర్‌కు ఫోన్ చేసి చెప్పవచ్చు అన్నారు. ఫామ్ 12 డి ద్వారా వికలాంగులు, 85 ఏళ్లు దాటిన వృద్ధులు ఇంటి నుండే ఓటు వేయవచ్చని దీనికోసం ముందస్తుగా నమో దు చేసుకోవాలన్నారు. జిల్లాలో 9566 మంది ఇటువంటి వారు ఉన్నట్లు గుర్తించామని, 40 శాతం కంటే ఎక్కువగా వికలాంగ సర్టిఫికెట్ ఉన్నట్లయితే ఇంటి నుం డి ఓటు వేయవచ్చన్నారు. జిల్లా ఎస్పి సురేష్ కుమార్ మాట్లాడుతూ నెట్వర్క్ లేని పోలింగ్ కేంద్రాలు గతంలో 39 ఉండేవని ప్రస్తుతం 56కు పెరిగాయని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.9,062,630ల నగ దు, 787 లీటర్ల లిక్కర్ దీని విలువ 3,94,802 ఉంటుందని, 1.05 కిలోల గంజాయి తోపాటు, 17 మిక్సర్ గ్రైండర్లు, 43 ఎయిర్ కూలర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

**వేసవి పట్ల అప్రమత్తంగా ఉండాలి**

రానున్న వేసవికాలంలో ఎండలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. అవసరమైతే తప్ప పగటిపూట ఇంటిలో నుండి బయటకు వెళ్లకూడదని సాధ్యమైనంత ఎక్కువగా నీటిని తీసుకోవాలన్నారు. వేసవి నేపథ్యంలో ఉపాధి హామీ పనుల కేంద్రాల్లో అవసరమైన తాగునీరు, ఒఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ తో పాటు, నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ నీటి ఎద్దడి లేకుండా చూస్తున్నారని, మిషన్ భగీరథ నీరు చివరి ఇంటి వరకు ఇవ్వడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు అలా జరగని పక్షంలో స్థానిక వనరులను ఉపయోగించుకోనున్నట్లు వివరించారు.

### పకడ్బందీగా పోలింగ్ విధులు : కలెక్టర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి** : భారత ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనల ప్రకారం పకడ్బందీగా పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ విధులు నిర్వహించేలా సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం పెద్దపల్లి లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో పోలింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు. పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని 1050 మంది పోలింగ్ అధికారులకు ఏప్రిల్ 2, ఏప్రిల్ 4, ఏప్రిల్ 6 తేదీలలో మూడు రోజుల పాటు పోలింగ్ నిర్వహణకు సంబంధించి మాస్టర్ ట్రైయినర్లచే అవసరమైన శిక్షణ అందించడం జరిగింది. శిక్షణా కేంద్రం వద్ద పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాటు చేసిన కౌంటర్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట ఆర్డీఓ బి.గంగయ్య, తహసిల్దార్ రాజ్ కుమార్, ఎం.ఈ.ఓ. సురేందర్ పాల్గొన్నారు.



## రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



**ప్రజా పక్షం / ఆసిఫాబాద్:** శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఆసిఫాబాద్ ఎంఎల్ఎ కోవలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో రైతులకు మద్దతుగా నిర్వహించిన ఒక రోజు రైతు దీక్షలో పాల్గొని మాట్లాడారు. మొద్దు ప్రభుత్వాన్ని నిద్రలేపడానికి రైతు దీక్షలు చేస్తున్నామన్నారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో 200 మంది రైతులు చనిపోయారని, వారి కుటుంబాలను ఏ మంత్రి పరామర్శించడం లేదని ఆరోపించారు. రైతులకు చెందిన ఎండిన పంటపొలాలను చూడడానికి రావడం లేదని, కరెంటు లేదని, నీళ్లు లేవని, కేవలం కన్నీళ్లే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వము దిగొచ్చి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 25 వేల పరిహారం చెల్లించాలని, చనిపోయిన రైతుల కుటుంబాలకు 20 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకొని 2 లక్షల రైతు రుణమాఫీ, రైతుబంధు 15 వేలు, వడ్లకు మక్కలకు 500 బోనస్, రైతు కూలీలకు 12 వేలు, కౌలు రైతులకు 15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు, మహిళా సీనియర్ నాయకురాలు సరస్వతి, జెడ్పిటిసిలు, ఎంపిపిలు, సింగిల్ విండో చైర్మన్లు, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు, ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి పిఎసిఎస్ డైరెక్టర్ నరేష్



**ప్రజాపక్షం / మల్లాపూర్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ జువ్వాడి నరసింగరావు అన్నారు . ఈ మేరకు ముత్యంపేట సింగిల్ విండో చైర్మన్ పిఎసిఎస్ జిల్లా డైరెక్టర్ తక్కల్ల నరేష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోగా ఆయనకు కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలో కి ఆహ్వానించారు. అలాగే ఆయనతోపాటు ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు బూస పెద్ది రాజం, శ్రీనివాస్ రవి సతీష్, సాగర్ చక్రధర్ లు సైతం పార్టీ కండువా కప్పుకోగా వారికి సాదరంగా పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి జలపతి రెడ్డి, మాజీ సర్పంచ్, బొల్లం కృష్ణవేణి, నల్ల బాపురెడ్డి, మాజి ఉపసర్పంచ్ అల్లూరి మహేష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గంగాధర్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాల తరలింపుపై పునరాలోచన చేయాలి




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో ఉన్న మెడికల్ కళాశాలను రఘునాథపాలెం తరలించాలనే ఆలోచన పై ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి కార్యదర్శి ఇటికాల రామకృష్ణ తెలిపారు. శనివారం ఖమ్మం గిరి ప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ తర్వాత విద్య, వైద్య రంగం హబ్‌గా ఖమ్మం అవతరిస్తుందని ఆయన తెలిపారు.ఈ తరుణంలో ఖమ్మం నగరంలో ఉన్న వైద్య కళాశాలను రఘునాథపాలెం తరలించాలని ప్రభుత్వం చూస్తుందన్నారు. జిల్లా కేంద్ర ప్రధాన ఆసుపత్రికి అనుసంధానంగా పాత కలెక్టరేట్, ఆర్అండ్‌బి కార్యాలయాల్లో మెడికల్ కళాశాల తరగతులు ప్రారంభించారన్నారు. వైద్య కళాశాలను రఘునాథపాలెం బైపాస్ రోడ్డుకు మార్చడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం మెడికల్ కళాశాల తరలింపుపై పునరాలోచన చేయాలని ప్రస్తుతం ఉన్న ప్రాంతంలోనే నూతన భవనాలు నిర్మించాలన్నారు. వైద్య కళాశాల తరలింపుపై సోమవారం ఐఎంఏ హాల్‌లో మధ్యాహ్నం మూడు గంటలకు రౌండ్ టేండ్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు చందులాల్, శివ, రాకేష్, ప్రతాప్ రాజు, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే జరిమానాలు తప్పవు



**ప్రజాపక్షం/వేములవాడ :** ట్రాఫిక్ రూల్స్ పాటించాల్సిందే. యువకులు అతివేగంతో ఇష్టారాజ్యంగా వాహనాలనుడుతూ ట్రాఫిక్ రూల్స్‌ను అధిక్రమించడం చట్టరీత్యానిజమని, అతివేగంగా వాహనాలు నడుపుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ వారి కుటుంబ సభ్యులను ఎంతో మనోవేదనకు గురి చేస్తున్న యువకులకు నిబంధనలు పాటించకపోతే ఫైన్లు కట్టాల్సిందే అంటూ వేములవాడ ట్రాఫిక్ ఎస్ఐ దిలీప్ కుమార్ శనివారం హితబోధ చేశారు. ఇంటి వద్ద మీ తల్లిదండ్రులు ఎంతో వయప్రాసలకు ఓర్చి మీకు వాహనాన్ని కొనిస్తే మీరు రూల్స్ పాటించకుండా అతివేగంగా నడుపుతూ ప్రమాదానికి గురైతే మీతో పాటు ఎదురుగా వచ్చిన వారికి కూడా ఇబ్బందులు కలిగిస్తున్నారని, మీరు ట్రాఫిక్ రూల్స్ ను అధిక్రమిస్తూ హెల్మెట్ లేకుండా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా,నంబర్ ప్లేట్ కూడా సరిగా లేకుండా స్పోర్ట్స్ బైక్కు రైమంటు వేగంగా వెళ్తే వృద్ధులు, మహిళలు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఇలాంటి యువకుల తల్లిదండ్రులకు పలుమార్లు కౌన్సిలింగ్ చేసినప్పటికీ యువకులలో మార్పు రావడంలేదని దీనితో ఫైన్ లు విధించడం జరుగుతుందని ఇలా అయినా సరియైన మార్గంలో నడుస్తారని ఆశిద్దామని అన్నారు.

## వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నందున, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వడదెబ్బ తగలకుండా ప్రజలు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, ఎండలో బయట తిరగవద్దని, అత్యవసర పరిస్థితి అయితే తప్ప ప్రజలు బయటికి రాకూడదని, ఉదయం 11 గంటల నుండి 4 గంటల మధ్యలో ఎట్టి పరిస్థితులలో ఇండ్ల నుంచి బయటకు రావొద్దని అన్నారు. ఆశ, ఎ.ఎన్.ఎం.ల వద్ద, అంగన్ వాడీలలో ఓ.అర్.ఎస్. ద్రావణం అందుబాటులో ఉంచామని. పి.హెచ్.సి. ల యందు ఓ.ఆర్.ఎస్. ద్రావణం, ఐ. వి. ఫ్లూయిడ్స్ అందుబాటులో ఉంచామని అన్నారు.చిన్నారులు, వయోవృద్దులు ఇంటికే పరిమితం కావాలని, ప్రతిరోజు సరిపడ త్రాగునీరు తీసుకోవాలని, వదులుగా ఉన్న దుస్తువులను ధరించాలని, బయటికి వెళ్ళేటప్పుడు గొడుగు, టోపిని, సన్నని లేత రంగు కాటన్ వస్త్రాలను దరించాలని, ద్విచక్ర వాహనాలపై సుదూర ప్రయాణాలు చేయకూడదని, సూర్యుని కిరణాలు శరీరంపై పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

## వనాలు, వన్య ప్రాణులను రక్షిద్దాం




**ప్రజాపక్షం/జైపూర్** : అడవులను, వన్య ప్రాణులను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, వేసవి కాలంలో అడవులను కారు చిచ్చు నుండి కాపాడటంలో ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని అటవీ శాఖ రేంజ్ అధికారి జి. రత్నాకర్ రావు అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని అటవీ సమీప గ్రామాల్లో ప్రజలకు అటవీ సంరక్షణ అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో అడవిలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం అధికంగా ఉంటుందని, వాటిని నివారించే ప్రయత్నం చేయాలని సూచించారు. ఆకతాయితనంతో యువత అటవీ ప్రాంతంలో పార్టీలు చేసుకుని అవగాహన లేమితో నిప్పు వేయడం, పశువుల కాపరులు బీడీ సిగరేట్ లాంటివి తాగి అడవి ప్రాంతంలో పారవేయడం, వనభోజనాలకు వెల్లి వంటలు చేసుకుని నిప్పును ఆర్పకుండా రావడం, చెత్తను అడవి ప్రాంతంలో వేసి కాల్చడం లాంటి పనులు చేస్తే అడవికి అగ్గి అంటుకునే ప్రమాదం ఉందని తెలిపారు. అడవిలో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు చెట్లు అగ్నికి ఆహుతై వాటిపై ఆధారపడి ఉన్న వన్యప్రాణులు, పక్షులకు క్రిమి కీటకాలకు ప్రాణహాని ఉంటుందని వివరించారు. అగ్ని ప్రమాదాలకు గురై అడవులు అంతరించడంతో మానవాళికి కూడా తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. అటవీకి అగ్ని అంటుకుంటున్నట్లు ప్రజలు గమనించినట్లయితే నిప్పును ఆర్పివేయాలని తెలియజేశారు. అనుకోని సందర్భంలో అడవిలో ప్రమాదం జరిగితే నిప్పు చెలరేగకుండా ఆపేందుకు అడవిలో బ్లోయర్స్ తీసుకువచ్చి కూలీల ద్వారా ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ ఫైర్ లైన్స్ ద్వారా అడవిలో ప్రమాదం జరగకుండ ఉంటుందని, అదేవిధంగా అడవిలో అనుకోకుండా మంటలు చెలరేగి అడవిలో అగ్ని అంటున్నట్లు ప్రజలు గమనిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఉప అటవీ క్షేత్రాధికారి ఎస్. సాగరిక, అటవీ పాలన అధికారులు ఎ. విజయలక్ష్మి, రామ కృష్ణ సర్కార్, రేపటి రెడ్డి, అటవీ రక్షణ అధికారులు అశోక్, దీక్ష, వన సేవకులు శృతి, రాము, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు పూర్తి స్థాయి సౌకర్యాలు

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ అభ్యర్థులకు సౌకర్యాలు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు గ్రంథాలయంలో పూర్తి సౌకర్యాలు కల్పించాలని, అభ్యర్థులకు అవసరమయ్యే, రైటింగ్ పాడ్స్, పుస్తకాలు సమకూర్చాలని గ్రంథాలయ అధికారులను ఆదేశించారు. వేసవి తీవ్రత దృష్ట్యా గ్రంథాలయంలో ఇన్వర్టర్ సమకూర్చాలని, త్రాగునీటితో పాటు ఒఆర్ ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు అవసరమైన పుస్తకాలు, పత్రికలను ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, గ్రంథాలయ అధికారులు పాల్గొన్నారు.

## రైతుల దుస్థితికి ముమ్మాటికీ కాంగ్రెస్, బిఆర్ఎస్‌లే కారణం : బండి



**ప్రజాపక్షం/కరీంనగర్ :** కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసాలకు కేరాఫ్ అడ్రస్ అని, ఆ పార్టీది ఆపన్న హస్తం కాదని, భస్మాసుర హస్తమని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపి బండి సంజయ్ ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పాంచ్ న్యాయ్ పేరుతో మళ్లీ కొత్త హామీలతో ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యిందన్నారు. కరీంనగర్‌లోని ఎంపి కార్యాలయంలో బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణను పదేళ్ల పాటు పాలించిన కెసిఆర్ రాష్ట్రంలో రైతుల దుస్థితికి ప్రధాన కారణమన్నారు. 30 లక్షల ఎకరాల్లో పంట నష్టపోతే ఏనాడూ సాయమందించని కెసిఆర్ సిగ్గు లేకుండా రైతుల పట్ల ప్రేమను ఒలకబోస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ మోసపూరిత పార్టీలేనని, రైతులు, నేతన్నల దుస్థితికి రెండు పార్టీలే కారణమని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని నేతన్నల దుస్థితికి నిరసగా వారిని ఆదుకోవాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 10న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సిరిసిల్లలో దీక్ష చేస్తున్నట్లు ప్రకటించారు. నయీం ఆస్తులపై విచారణ జరపడంతో పాటు ఆస్తులను దోచుకున్న కెసిఆర్ కుటుంబంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో నేతన్నలకు బకాయిలివ్వకుండా ఆత్మహత్య చేసుకునేలా చేసింది బిఆర్ఎస్ హయాంలోనేన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండు పార్టీలు అవగాహనతోనే వెళ్తున్నాయన్నారు. చిత్తశుద్ధి ఉంటే కాళేశ్వరంపై సిబిఐ విచారణ జరపాలన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో కెసిఆర్ కుటుంబం హస్తముందని, దోషులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, తన ఫోన్ సైతం ట్యాపింగ్ చేశారన్నారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా

## విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్** : అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదర్శ పాఠశాలల కమిటీల ఏర్పాటు,చేపట్టనున్న పనులపై నిర్వహించిన సమీక్షా సమావేశం లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మట్లాడుతూ జిల్లాలోని పట్టణ,గ్రామీణ ప్రాంతాలలోని 672 పాఠశాలలలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటుచేయడం జరిగిందని అన్నారు.ప్రతి పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం,నిర్వహణ,త్రాగునీరు,విద్యుత్ సదుపాయం,విద్యుత్ బిల్లు తగ్గించుటకు సౌర పలకాల ఏర్పాటు వంటి వాటిని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా తీర్మాణాలు చేసి పనులను చేపట్టాలని సూచించారు.ప్రతీ పాఠశాలలో కమిటీలను ఏర్పాటు చేసి గ్రామాలలో మహిళా సమాఖ్య అధ్యక్షులు,పట్టణాలలో పట్టణ సమాఖ్య అధ్యక్షులు చైర్మన్ గా ఉంటారని తెలిపారు. ప్రతి కమిటీ పేరు మీద బ్యాంక్ ఖాతా తెరవాలని సూచించారు.బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించడం అవసరమైన వసతుల కల్పన కు ప్రణాళికలు తయారు చేయడం, రోజువారీ సమీక్ష మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణ,ఆర్థిక వనరులను సక్రమంగా వినియోగించేలా చూడడం,వంటి పనులపై దృష్టి సారించాలన్నారు.పాఠశాలలలో మరుగుదొడ్ల నిర్మాణానికి గ్రామీణ ప్రాంతాలలో ఈజీఎస్ కింద,పట్టణ ప్రాంతాలలో మున్సిపాలిటీలా ఆధ్వర్యంలో చేపట్టాలని అన్నారు. చేపట్టిన పనులను నాణ్యత ప్రమాణాలను పాటించి పూర్తి చేయాలనీ సూచించారు.పనుల ప్రారంభానికి ముందు, తర్వాత నివేదికలతో పాటు ఫోటోలను సమర్పించాలని సూచించారు. పాఠశాల అభివృద్ధిలో ఏ ఎల్ ఎఫ్ ఎస్ హెచ్ జి సభ్యులను భాగస్వాములు గా చేసి గుణాత్మక విద్య లక్ష్యం దిశగా అడుగులు వేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,డిఈఓ రవీందర్ రెడ్డి,డిఆర్డిఓ విజయలక్ష్మి ,సిపిఓ బాబురావ్,జడ్పి సిఈఓ గోవింద్,ఇంజనీరింగ్ శాఖల అధికారులు అశోక్ కుమార్,శంకరయ్య,సంతోస్,ఎంపిడిఓ లు,ఎంఈఓలు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

**కస్టమ్ మిల్లింగ్ రైస్(సిఎంఆర్) సరఫరాను వేగవంతం చేయాలి**

నిర్మల్ రూరల్ : కస్టమ్ మిల్లింగ్ రైస్(సిఎంఆర్) సరఫరాను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లు, రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల అధికారులతో సిఎంఆర్ సరఫరా, లక్ష్యాలు తదితర అంశాల పై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,కస్టమ్ మిల్లింగ్ రైస్ 202324 సంవత్సరం సిఎంఆర్ లక్షాలను వేగవంతంగా చేయాలని సంబంధిత మిల్లర్లును ఆదేశించారు. నిరంతరం మిల్లింగ్ చేయాలని, ఈ నెల 10లోపు పూర్తీ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. మిల్లుల వారీగా మిల్లింగ్ ధాన్యం నిల్వల పై రిపోర్టులను అందజేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మిలర్ల వారిగా లక్ష్యం,పూర్తి చేసిన సీఎంఆర్ సరఫరా,పెండింగ్‌పై చర్చించారు.

## నిర్లక్ష్యం నీడలో మాత శిశు ఆసుపత్రి

పారిశుద్ధ్య నిర్వహణ లేక చెత్తతో నిండిన పరిసరాలు



**ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి** : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గోదావరి రోడ్డులో గల మాతా శిశు ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వాహణ లోపించింది. ఆసుపత్రి పరిసరాల్లో ఎటు చూసిన చెత్త చెదారంతో నిండి కంపు కొడుతుంది. ఆసుపత్రి నిర్వహణలో వైద్యాధికారులు, జిల్లా ఉన్నతాధికారులు పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఆసుపత్రి నిర్వాహణపై అనేక మార్లు ఫిర్యాదులు అందిన సంబంధిత శాఖల అధికారులు నిమ్మకు నీరేత్తినట్లు వ్యవహరించడంతో ఆసుపత్రికి వచ్చే మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు తరలించాల్సిన చెత్తను సంబంధిత కాంట్రాక్టర్, పారిశుద్ధ్య నిర్వాహకులు రోజుల తరబడి తరలించకపోవడంతో చెత్త కుల్లి దుర్వాసన వెదజల్లుతుంది. ఆసుపత్రి పరిసరాల్లో నిర్వహిస్తున్న హోటళ్ల యజమానులు సైతం నిరుపయోగ వస్తువులు, మిగులు తిను బండాలు అక్కడే పడేయడంతో మరింత దుర్వాసన వెదజల్లుతుంది. మాతా శిశు సంరక్షణకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆసుపత్రిలో కాన్పుల కోసం వచ్చే మహిళలు ఆసుపత్రి నిర్వాహణ చూసి భయాందోళనకు గురవుతున్నారు. పుట్టిన పిల్లలకు ఇన్ఫెక్షన్ సోకుతుందనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చుట్టూ కుల్లిన చెత్తతో ఆసుపత్రి పరిసరాలు ఉండటంతో క్రిమి కీటకాలు చేరి మరింత అంధవికారంగా కనిపిస్తుంది. నిత్యం వందలాది గర్భిణీ మహిళలు వైద్య పరీక్షలకు, ప్రసూతి కొరకు ఆసుపత్రికి వస్తుంటారు. గర్భిణీల, శిశువుల పట్ల ఎంతో శ్రద్ధ, శుభ్రత పాటించాలని చెప్పే వైద్యాధికారులు, జిల్లా శిశు సంక్షేమ, మున్సిపల్ అధికారులు ఆసుపత్రి నిర్వాహణపై ఎలాంటి శ్రద్ద చూపడం లేదని ఆసుపత్రికి వచ్చే మహిళలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైన ఆసుపత్రి పరిసరాల్లో ఉన్న చెత్తను ఎప్పటికప్పుడు తరలించి, ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలని స్థానికులు, గర్భిణీ మహిళలు కోరుతున్నారు.

## హత్యకేసులో నిందితుడు అరెస్టు

రిమాండ్‌కు తరలింపు

**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి** : ఏప్రిల్ 2వ తేదిన జరిగిన సిరం మహేష్ హత్య కేసులో నిందితుడైన దర తిరుపతిని శనివారం రోజున అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు డిఎస్పీ నాగేంద్ర చారి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన సిర మహేష్‌కు గత 12 సంవత్సరాల క్రితం పద్మతో వివాహం జరగగా వీరికి ఇద్దరు కూతుర్లు కలరు. గత మూడు సంవత్సరాల భార్యభర్తల గొడవలతో భార్యతో విడిపోయి ప్రస్తుతం సిరం మహేష్ ఒంటరిగా ఉంటున్నాడు. గత సంవత్సరం నుండి మహేష్ వేములవాడలో బిల్డింగ్ మేస్త్రీల వద్ద కూలీగా పని చేస్తున్నాడు. గత ఆరు నెలల నుండి భగవంతరావునగర్‌కు చెందిన బుట్టి శ్రీనివాస్ యొక్క రేకుల రూములో కిరాయికి ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. కాగా భగవంతరావు నగర్‌కు చెందిన దర తిరుపతి కూడా బిల్డింగ్ మేస్త్రిల వద్ద కూలీగా పని చేస్తూ సిరం మహేష్‌తో స్నేహం ఏర్పడింది. గత నాలుగు నెలల నుండి సిరం మహేష్ యొక్క రూములో దర తిరుపతి ఉంటున్నాడు. కాగా తిరుపతి కూడా ఒంటరి జీవితం గడుపుతున్నాడు. ఇతనికి పెళ్లయి గొడవలతో భార్య చాలా రోజుల క్రితం వదిలిపెట్టి వెళ్లిపోయింది. సిరం మహేష్ రూములో ఉంటున్నందుకు కిరాయి డబ్బులు తిరుపతి ఇవ్వడం లేదు. కిరాయి లేకుండా ఫ్రీగా ఉంటున్నాడని సిరం మహేష్ దర తిరుపతిని రోజు సూటిపోటి మాటలతో వేధిస్తున్నాడు. రూము ఊడ్వమని, వంట చేయమని తాగుడు ఎక్కువ అవుతుందని పని చేస్తలేవని, ఎందుకని నిన్ను రూములో ఉండనివ్వకుంటే నువ్వు ఫుట్‌పాత్ మీద బతకాల్సి వస్తుందని రోజు మానసికంగా వేధించడంతో అతని వేధింపులు బుట్టి శ్రీనివాస్‌కు చెప్పుకుంటూ దర తిరుపతి బాధపడుతుంటేవాడు. తేది 01.04.2024 రోజున రాత్రి మహేష్ రూముకు వెళ్లి మృతునికి బాగా మద్యంతాగించి, మద్యం మత్తులో ఉండగా నిందితుడు పెద్ద సిమెంట్ బండరాయి తీసుకువచ్చి మృతుని ముఖంపై పలుమార్లు కొట్టి చంపి అక్కడి నుండి పారిపోయినాడు. నమ్మదగిన సమాచారం మేరకు నిందితున్ని చెక్కపల్లి రోడ్డులో సబ్ స్టేషన్ వద్ద వేములవాడ ఇంచార్జీ సిఐ శ్రీనివాస్ తమ సిబ్బంది తో వాహన తనిఖీలు చేస్తుండగా, పట్టుకుని క్రైస్ సీన్ రీ కన్స్ట్రక్షన్ చేసి అక్కడ పొదల్లో దాచిన రక్తపు మరకలు గల నిందితుని బట్టలు, హత్యకు ఉపయోగించిన సిమెంట్ బండ రాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించామని వేములవాడ డిఎస్పీ నాగేంద్ర చారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ సిఐ శ్రీనివాస్, ఎస్ఐ అంజయ్య పాల్గొన్నారు.

# కాంగ్రెస్ జన జాతర సక్సెస్

లక్షలాదిగా తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు

మ్యానిఫెస్టో వివరించడంపైనే రాహుల్‌గాంధీ ఫోకస్

కెసిఆర్‌పై సిఎం రేవంత్‌రెడ్డి విమర్శలకు స్పందన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తుక్కుగూడలోని రాజీవ్ గాంధీ ప్రాంగణంలో శనివారం జరిగిన 'కాంగ్రెస్ జన జాతర' బహిరంగ సభకు జనం పోటెత్తారు. శాసనసభ ఎన్నికలకు ముందు గత సెప్టెంబర్‌లో ఇదే ప్రాంగణంలో జరిగిన సభ కంటే ఎక్కువగా లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు సభకు తరలివచ్చారు. అధికారంతో వచ్చిన ఉత్సాహంతో పెద్దఎత్తున 'హస్తం' పార్టీ శ్రేణులు సభకు హాజరయ్యారు. సభకు వచ్చే ఔటర్ రింగ్ రోడ్డు, దానికి అనుసంధానంగా ఉండే జాతీయ రహదారులన్నీ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. పలు జాతీయ రహదారులపై ట్రాఫిక్ జామైంది. మండుటెండను సైతం లెక్క చేయకుండా కాంగ్రెస్ కార్యకర్తలు సభా ప్రాంగణానికి ముందే చేరుకున్నారు. సుమారు 7.07 గంటల సమయంలో రాహుల్‌గాంధీ బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకున్నారు. ఆయన వెంట సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాదాస్‌మున్షీ ఉన్నారు. వేదిక నుంచి జనంలోకి నడిచి వెళ్ళే విధంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక మంచెపై రాహుల్‌గాంధీ ఎక్కి ముందు వరకు సాగి, చేతులు ఊపుతు సభికుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఆ తరువాత 7.11 గంటలకు వేదికపై తనకు కేటాయించిన స్థానంలో ఆసీనులయ్యారు. అనంతరం 7.16 గంటల సమయంలో తెలుగులో అనువదించిన కాంగ్రెస్ మ్యానిఫెస్టో, పాంచ్ న్యాయ్, కాంగ్రెస్ గ్యారంటీ దరఖాస్తులను రాహుల్‌గాంధీ ఆవిష్కరించారు. అనంతరం ఆయన 7.20 గంటలకు తన ప్రసంగాన్ని ప్రారంభించి, రాత్రి 8 గంటల వరకు 40 నిమిషాల పాటు మాట్లాడారు. ప్రధానంగా పాంచ్ న్యాయ్‌లను ఆయన వివరించారు. యువ్ న్యాయ్, శ్రామిక్ న్యాయ్, నారీ న్యాయ్, కిసాన్ న్యాయ్, సామాజిక్ న్యాయ్‌లలో ప్రధానమైన ఒక్కో గ్యారంటీని వివరించారు. మిగతా గ్యారంటీలు ఒక్కో న్యాయ్ కింద ఐదు చొప్పున ఉన్నాయని వాటన్నిటిని క్షుణంగా చదవాలని కోరారు.

**తెలంగాణ మార్గంలోనే..** తెలంగాణలో తాము ఇచ్చిన ఆరు గ్యారంటీలను అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్నామని, ఆమార్గంలోనే జాతీయస్థాయిలో కూడా గ్యారంటీలను ఇస్తున్నామని రాహుల్‌గాంధీ తెలిపారు. కెసిఆర్ పేరును నేరుగా ప్రస్తావించకుండా మీ మాజీ సిఎం అంటూ ప్రసంగించారు. తెలంగాణతో తమ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసి భావోద్వేగం కలిగించారు. చిన్న పిల్లాడు పిలిచినా తెలంగాణలో వాలిపోతానన్నారు. రాహుల్‌గాంధీ సభకు వచ్చాక మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు సభ నిర్వహించగా, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలుగులో రాహుల్ ప్రసంగాన్ని అనువదించారు. రాహుల్ ప్రసంగంలోని ఐదు గ్యారంటీలలో ప్రధానంగా సామాజిక న్యాయం, మహిళా న్యాయం అంశాలను వివరించేందుకు ప్రత్యేక దృష్టి సారించారు.

### ఆకట్టుకున్న ముఖ్యమంత్రి ప్రసంగం

ఎప్పటిలాగానే పిసిసి అధ్యక్షుడు, సిఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగంతో సభికులను ఆకట్టుకున్నారు. ఒకవైపు మాజీ సిఎం కెసిఆర్‌పై వాగ్బాణాలను విసురుతూ, సమాంతరంగా మోడీని తూర్పారబట్టారు. మోడీ గురించి మాట్లాడుతున్నప్పుడు రాహుల్‌గాంధీ వైపు చూస్తూ హిందీలో మాట్లాడారు. హమ్‌సబ్ రాహుల్ భాయ్‌కా పరివార్ అంటూ భావోద్వేగంతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రసంగానికి ప్రారంభానికి ముందు రాహుల్‌గాంధీ పాటను వేయగా, సిఎం సైతం సభికులకు ఉత్సాహం కలిగించేలా చేతులు ఊపారు. సాయంత్రం 6గంటలకు సభ ప్రారంభమైంది. తొలుత టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సభలో వరుసగా కాంగ్రెస్ నేతలు చిగురింత పారిజాతరెడ్డి, అనితారెడ్డి, ఎంఎల్‌ఏ మల్‌రెడ్డి రంగారెడ్డి, కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, సంపత్‌కుమార్, మహ్మద్ అలీ షబ్బీర్, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు తదితరులు ప్రసంగించారు. రాత్రి 8:30 గంటల ప్రాంతంలో సభ ముగిసింది.

## లౌకికవాద శక్తులను గెలిపిద్దాం

సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా



**ప్రజాపక్షం/ ఖమ్మం :** దేశంలో మతోన్మాద బిజెపిని ఓడించి లౌకిక వాద శక్తులను గెలిపించుకుందామని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం మణుగూరు సిపిఐ కార్యాలయంలో సరెడ్డి పుల్లారెడ్డి అధ్యక్షతన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో ఎస్‌కె సాబీర్‌పాషా మాట్లాడుతూ రెండవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత బిజెపి దళితులపై, బహుజనులపై దాడులు చేయిస్తుందని, ప్రశ్నించే వారిని అణగదొక్కుతుందన్నారు. రక రకాల చట్టాలతో ప్రజలను నిర్బంధంలోకి నెట్టివేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ సంస్థలను రాజకీయ కక్ష సాధింపుకు వినియోగిస్తున్నారని, ఇడి, సిబిఐ బిజెపి జేబుసంస్థలుగా మారాయని, వాటితో బిజెపి రాజకీయ వ్యతిరేకులపై దాడులు చేస్తున్నారని విమర్శిస్తున్నారు. పదేండ్ల బిజెపి పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, పేదలను విస్మరించి కార్పొరేట్ల సేవలో మోడీ సర్కార్ మునిగి తేలుతుందన్నారు. అనేక ప్రజా వ్యతిరేక చట్టాలను తీసుకు వచ్చిన మోడీ సర్కార్ ఇప్పుడు రైతు చట్టాలను తాత్కాలికంగా నిలుపుదల చేసినప్పటికీ భవిష్యత్తులో అధికారంలోకి వస్తే మరోసారి అమలు చేస్తారని ఆరోపించారు. మతోన్మాద బిజెపిని ఓడించి,లౌకిక ప్రజాస్వామ్య శక్తులను గెలిపించడమే కర్తవ్యంగా పని చేయాలన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు నరాటి ప్రసాద్, ముత్యాల విశ్వనాథం, మున్నా లక్ష్మి కుమారి, కల్లూరు వెంకటేశ్వరరావు, కె.వెంకన్న, దేవరకొండ శంకర్, శ్రీనివాస్, ఎండి సలీం, యార్లగడ్డ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రామమందిరం పేరుతో రాజకీయలబ్ది

12న జిల్లా సదస్సు విజయవంతం చేయండి

వామపక్ష పార్టీల నాయకుల పిలుపు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** దేశంలో రామ మందిరం పేరుతో మత రాజకీయాలను ప్రోత్సహించి ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం బిజెపి ప్రయత్నిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక ఏఐటియుసి కొమురయ్య భవన్‌లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ సిపిఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు, సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 12న వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా సదస్సును కార్మికులు మేధావులు ప్రజాతంత్ర వాదులు వామపక్ష భావజాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల ను ప్రజలు గమనించాలన్నారు. దేశంలో ప్రభుత్వరంగ సంస్థలను బడా పెట్టుబడిదారులకు అదాని, అంబానీలకు మోడీ ప్రభుత్వం కట్టబెడుతుందన్నారు. మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగ మనుగడకు ప్రమాదమన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని ఈ ఎన్నికల్లో ప్రజలు గద్దె దించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సోతుకు ప్రవీణ్ కుమార్, క్యాతరాజు సతీష్, వెలిశెట్టి రాజయ్య, సుధాకర్ రెడ్డి, రాంచేందర్, వేముల శ్రీకాంత్, ఎండి సాబీర్, గొనెలా తిరుపతి, ప్రశాంత్, గణేష్ పాల్గొన్నారు.

## చట్టసభల్లో కమ్యూనిస్టులుండాలి

మాజీ ఎంఎల్‌సి చెరుపల్లి సీతారాములు



**ప్రజాపక్షం/చిట్యాల :** ప్రస్తుత రాజకీయ పరిస్థితులల్లో చట్టసభల్లో ప్రజల తరపున గళం విప్పే కమ్యూనిస్టులు ఉండాల్సిన అవసరం ఉందని సిపిఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంఎల్‌సి చెరుపల్లి సీతారాములు అన్నారు. చిట్యాల మున్సిపాలిటీ కేంద్రంలో శనివారం జరిగిన సమావేశానికి హాజరై మాట్లాడారు. చరిత్రను వక్రీకరించి మతాల పేరుతో ప్రజల మధ్య ఘర్షణ వాతావరణం సృష్టించే బిజెపిని ఓడించాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఎం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా ఎండి జహంగీర్‌ను గెలిపించాలని, అతని గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని సీతారాములు సూచించారు. తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ నిత్యావసరన వస్తువుల ధరలు పెంచి, ఎలక్టోరల్ బాండ్ల ద్వారా కోట్లాది రూపాయలు పొందిన బిజెపి విధానాలను ఎక్కడిక్కడ ఎండగట్టాలని కోరారు. అరూరి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ, లింగస్వామి, లక్ష్మి నారాయణ, సుగుణమ్మ, మెట్టు పరమేష్, బొబ్బలి సుధాకర్‌రెడ్డి, అరూరి శంభయ్య, కందగట్ల గణేష్, నకిరేకంటి రాములు, లింగస్వామి, రమాదేవి పాల్గొన్నారు.

## మహారాష్ట్రలోకి ప్రవేశించిన ఏనుగు



**ప్రజాపక్షం/పెంచికల్ పేట్ :** మహారాష్ట్ర నుండి దారి తప్పి తెలంగాణలోని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రవేశించి హల్‌చల్ చేసిన ఏనుగు తిరిగి మహారాష్ట్ర అటవీ ప్రాంతంలోకి వెళ్లినట్లు అటవీ శాఖ అధికారులు ధృవీకరించారు. ఏనుగు వెళ్తున్న సమయంలో ప్రాణహిత నది ఒడ్డున ఉన్న మహారాష్ట్ర చిన్న వట్ర ప్రాంతంలో ఉన్న మత్స్యకారుడు గంగాధర్ చెందిన కోడి పుంజును, కోడి పిల్లలని చంపి, వారు చాపల కోసం నివాసం ఉంటున్న వంట గుడిసెను ధ్వంసం చేసింది. ఆ సమయంలో గుడిసెలో మత్స్యకారులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. శనివారం ఉదయం పెంచికల్ పేట్, బెజ్జూరు రేంజి అటవీ శాఖ సిబ్బంది మురళి గూడ గ్రామం దగ్గరలోని ప్రాణహిత నదీ పరివాహక ప్రాంతంలో వెతకగా ఏనుగు పాదముద్రలు కనిపించాయి. వాటిని ట్రాక్ చేస్తు ప్రాణహిత నదీ అవతలకు వెళ్ళి చూడగా అక్కడ కూడా ఏనుగు పాదముద్రలు కనిపించాయి. నది అవతల కనిపించిన ఏనుగు పాదముద్రలను అనుసరించిన అధికారులు ఏనుగు ప్రాణహిత నదీ దాటి అక్కడ ఉన్న మహారాష్ట్ర అడవిలో కి వెళ్ళినట్లుగా నిర్ధారించుకోవడం జరిగింది. మహారాష్ట్ర అటవీ శాఖ సిబ్బందితో కూడా చర్చించగా మహారాష్ట్ర వైపుగా ఏనుగు వచ్చినట్లు అటవీ శాఖ అధికారులు నిర్ధారించారు. దీంతో స్థానిక ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

## బిజెపిని ఓడిద్దాం..రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మారుపాక అనిల్ కుమార్



**ప్రజాపక్షం/భువనగిరి :** ఈ దేశం మూలవాసులైన దళితులపై దాడులను తీవ్రతరం చేసిన బిజెపిని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి రాజ్యాంగాన్ని రక్షించుకుందామని డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) యాదాద్రి భువనగిరి జిల్లా కౌన్సిల్ సమావేశం శనివారం సిపిఐ జిల్లా కార్యాలయంలో కాశపాక దయాకర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో అనిల్‌కుమార్ మాట్లాడుతూ బిజెపి మోడీ నేతృత్వంలో అధికారంలోకి వచ్చాక దేశంలో మతసామరస్యం తీవ్రంగా దెబ్బతిందన్నారు. లౌకికదేశాన్ని హిందూ రాజ్యంగా మార్చడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం శరవేగంగా పావులు కదుపుతుందన్నారు. మోడీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలన్నిటిని తన గుప్పట్లోకి తీసుకుందన్నారు. స్వతంత్ర న్యాయవ్యవస్థ అస్తిత్వం ప్రమాదంలో పడిందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ కన్ను సన్నుల్లోని బిజెపి పదేండ్ల పాలనలో దేశం సరిహద్దుల్లో ఉద్రిక్తతలు, దేశంలోపల మత విద్వేషాలు మినహా దేశ ప్రజలకు మేలు జరగలేదన్నారు. దేశంలో 20శాతం దళితులు ఉండగా వారికి బడ్జెట్లో కేటాయింపులు 20శాతం ఎందుకు కేటాయించట్లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని ఎందుకు రద్దు చేశారో చెప్పాలన్నారు. దళితులు, గిరిజనులు, మహిళలు, ఆదివాసీల రక్షణకు పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కే.శ్రీనివాస్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కాశపాక దయాకర్, ఎర్రోళ్ల లింగస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధానకార్యదర్శి సిలిగంజి వీరస్వామి, ఎల్లంకి మహేష్, ఉప్పుల శాం తికుమార్, ఇంజా హేమలత,కొమ్ము బాలు నరసింహ, చుక్క చంద్రశేఖర్, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరాకు పటిష్ట చర్యలు

ప్రత్యేక అధికారి, అగ్రికల్చర్ డైరెక్టర్ బి.గోపి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** వేసవి సందర్భంగా తాగునీటి సరఫరాకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా తాగునీటి ఎద్దటి నివారణ ప్రత్యేక అధికారి, అగ్రికల్చర్ డైరెక్టర్ బి.గోపి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రిజ్వాన్ బాషషేక్, అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ వేసవి సందర్భం గా భూగర్భజలాలు అడుగంటిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మాట్లాడుతూ సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించడం జరిగిందన్నారు. సమావేశంలో ఆర్‌డిఓలు కొమురయ్య, వెంకన్న, జెడ్‌పి సిఈఓ అనిల్‌కుమార్, డిఏఓ వినోద్‌కుమార్, డిఈఓ రాము, మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వర్లు తదితిరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాలల్లో పనులు పూర్తిచేయాలి : కలెక్టర్ ప్రావీణ్య



**ప్రజాపక్షం/వరంగల్ (గీసుకొండ):** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో రూ.25వేల లోపు ఉన్న పనులను తక్షణం చేపట్టి పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం గీసుకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ విధి విధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించగా సమావేశానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, తలుపులు, కిటికీలు తదితర అత్యవసర పనులను పూర్తిచేయాలన్నారు. మన ఊరు మన బడి కార్యక్రమం కింద చేపట్టిన పనుల్లో ఇప్పటికే 80 నుంచి 90 శాతం పనులు పూర్తయితే మిగిలి పనులను పూర్తిచేసి వాటిని సద్వినియోగంలోకి తీసుకరావాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీఈఓ వాసంతి, ఎంఈఓ సత్యనారాయణ, మండల నోడల్ అధికారి రవీందర్, పీఆర్ ఏఈ సుధాకర్, సెర్ప్ ఏపీఎం సురేష్‌కుమార్, మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రామైక్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి తాగునీటిని సరఫరా చేయడం బాధ్యత

సందీప్ కుమార్ సుల్తానీయా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా వేసవిలో నీటి సరఫరా చాలా కీలకమని, అన్ని గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా చేయడం బాధ్యతగా తీసుకోవాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానీయా అన్నారు. హైదరాబాద్‌లోని మిషన్ భగీరథ ప్రధాన కార్యాలయంలో శనివారం సందీప్ కుమార్ సుల్తానియా, ఇంజనీర్‌ఇన్‌చీఫ్, మిషన్ భగీరథ శాఖ జి. కృపాకర్ రెడ్డి, ఇతర చీఫ్ ఇంజనీర్లు, ఎస్.ఇలు, మిషన్ భగీరథ ఓ అండ్ ఎమ్ పంప్ సెట్స్, సివిల్ ఏజెన్సీలైన మేఘా ఇంజనీరింగ్, రాఘవ కన్స్ట్రక్షన్స్, ఎన్‌సిసి, ఎల్ అండ్ టి, ఐహెచ్‌పి, కోయ అండ్ కంపెనీ, ప్రతిభ ఇండస్ట్రీస్, జివిపిఆర్, కెఎల్ఎస్ఆర్ తదితర సంస్థలతో నీటి సరఫరా, నిర్వహణపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా సందీప్ కుమార్ సుల్తానీయా మాట్లాడుతూ పంపు సెట్లలో లేదా పైప్‌లైన్‌లో లేదా విద్యుత్ సరఫరాలో ఏదైనా చిన్న మరమ్మత్తు కానీ వైఫల్యం కానీ సంభవించినట్లైతే కొన్ని ఆవాసాలకు సరఫరా ఇబ్బంది కలిగే అవకాశముందన్నారుజ గృహాలకు నిరవధికంగా 100 శాతం సరఫరా చేయడానికి ఓ అండ్ ఎమ్ ఏజెన్సీ సమర్థవంతంగా నిర్వహించడం చాలా ముఖ్యమైనదన్నారు. అన్ని పంపు సెట్ల మరమ్మతులను ఏప్రిల్ 12 నాటికి పూర్తి చేయాలని నిర్దేశించారు. ఈ విషయంలో పంప్ సెట్స్ ఏజెన్సీలు తక్షణమే కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి, సంబంధిత చీఫ్ ఇంజనీర్లకు సమర్పించాలి. అలాగే ఏజెన్సీలు పంపు సెట్స్ సంబందించిన స్పేరు పార్టులను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు.పైప్లైన్ మరమ్మతులన్నింటిని 12 గంటల్లో హాజరు కావాలని ప్రిన్సిపల్ సెక్రటరీ, ఓ అండ్ ఎం ఏజెన్సీలకు నిర్దేశించారు. డిపార్‌లమెంట్ నిర్దేశించిన సమయానికి తాము ఖచ్చితంగా కట్టుబడి ఉంటామని, ప్రస్తుతం ఉన్న మరమ్మతులకు, భవిష్యత్తులో జరిగే మరమ్మతులకు సానుకూలంగా హాజరవుతామని ఏజెన్సీలు హామీ ఇచ్చాయి. రాష్ట్రంలో ఉన్న సమస్యాత్మక ఆవసాలను గుర్తించి, వాటిపై ప్రత్యేక శ్రద్ధవహించి, ప్రతిరోజూ నీటి సరఫరా అయ్యేటట్టు చూడాలని సంబదిత చీఫ్ ఇంజనీర్లును సందీప్ కుమార్ సుల్తానీయా ఆదేశించారు.

## నేతన్నల బకాయిలు ఎందుకు ఇవ్వలేకపోయారు?

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** అధికారంలో ఉన్నప్పుడు నేతన్నల బకాయిలు ఎందుకివ్వలేక పోయారని మాజీ సిఎం కెసిఆర్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. రైతులపై కెసిఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆయన విమర్శించారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కేకే మహేందర్‌రెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ కరీంనగర్ పర్యటనలో మాజీముఖ్యమంత్రి కెసిఆర్ మాట్లాడిన మాటలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రతిపక్ష నేతగా పంటలు పరిశీలించడానికి రావడానికి చూస్తే గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా ఆయన పరిపాలించిన తీరు, ఆయన అవలంబించిన రైతు వ్యతిరేక విధానాలు గుర్తుకు వస్తున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో సిరిసిల్ల నేతన్నలకు రూ.275 కోట్ల బకాయి పడ్డారని, ఇక్కడి ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న కేటీఆర్ ఆనాడు ఎన్నికల కంటే ముందు పాత బకాయి ఇస్తే కార్మికుమా చేతుల్లో ఉండారని బకాయిలు ఆపారన్నారు. మా ప్రభుత్వం నేతన్నల బకాయిలను ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. శుక్రవారం కెసిఆర్ చేసిన వ్యాఖ్యలను జిల్లా కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

## మైనింగ్ విస్తరణపై ప్రజాభిప్రాయసేకరణ

ఆర్‌డిఒ శ్రీనివాసులు

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** పబ్లిక్ హియరింగ్‌లో ప్రజలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయవచ్చునని హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని సర్వారం గ్రామంలో శ్రీనివాస ఎడిఫైస్ ప్రైవేట్ లిమిటెడ్ చేపట్టనున్న మైనింగ్ విస్తరణకు పబ్లిక్ హియరింగ్ నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు, ఎన్జీవోస్, నాయకులు, ప్రజలు, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలు వ్యక్తంచేశారు. ఈ ప్రాంతంలో మైనింగ్ చేయడం వలన దుమ్ము ఏర్పడి పంటలు పండక నష్టపోయామని, ఇండ్లు పగుళ్లు ఏర్పడటంతో పాటు అనారోగ్యానికి గురవుతున్నామని తెలిపారు. నష్టపరిహారం చెల్లించాలని, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మైనింగ్ ప్రాంతంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సురేష్ తెలిపారు.

## బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు !

(మొదటి పేజీ తరువాయి)

ఇరిగేషన్ శాఖను సర్వనాశనం చేశారని విమర్శించారు. తమపై కెసిఆర్ ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేశారని, కెసిఆర్ తరహా తాము పాస్ పోర్ట్లు అమ్మి, కాంట్రాక్టర్లకు బ్రోకర్ల లాగా పనిచేయలేదని ఎద్దేవా చేశారు. ఎవరినో తొక్కడం కాదని, ఈ ఎన్నికల్లో జనం కెసిఆర్‌ను బొంద పెడతారన్నారు. ఇవ్వాళ బ్రోకర్, జోకర్ వ్యాఖ్యలు చేస్తున్న కెసిఆర్ ఆనాడు సిఎంగా ఉండి మెడిగడ్డ పై ఎందుకు నోరు విప్పలేదని నిలదీశారు. కెసిఆర్ తరహా వేరే రాష్ట్రాల్లో మాట్లాడితే ఉరి తీస్తారన్నారు. సూర్యాపేట, పాలేరుకు కెసిఆర్ మొహం చూసి నీళ్ళు ఇవ్వలేదని, తమ షెడ్యూల్ ప్రకారమే ఇచ్చామని అన్నారు. కెసిఆర్ అంతా పొగరుబోతు వ్యక్తిని తాను ఇంకొకరిని చూడలేదన్నారు. రాష్ట్రంలో నెలకొన్న కరువును కెసిఆర్ తెచ్చిందేనని, కాంగ్రెస్ తెచ్చింది కాదని పునరుద్ఘాటించారు. జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ కెసిఆర్ చవట దద్దమ్మ కాకపోతే ధనిక రాష్ట్రాన్ని రూ 8లక్షల కోట్ల అప్పు చెయ్యలేదా అని అన్నారు. పదేళ్ల కెసిఆర్ పాలనలో పంట నష్టానికి ఎప్పుడైనా నష్టపరిహారం ఇచ్చారా అని ప్రశ్నించారు ఫామ్ హౌస్‌లో పండుకునే కెసిఆర్ ప్రభుత్వాన్ని నడిపారన్నారు. నాలుగు మాసా ల కాంగ్రెస్ పాలనను చూసి కెసిఆర్ ఉలిక్కి పడుతున్నారన్నారు. కెసిఆర్‌కు దమ్ముంటే మేడిగడ్డ కాదని, పాలమూరు కు పోదామా అని సవాల్ విసిరారు. మిషన్ భగీరథ లో వేల కోట్ల రూపాయాల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. కెసిఆర్ తలకిందులుగా తపస్సు చేసినా ఒక్కా ఎంపి సీటు కూడా రాదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ ఓడిపోతే బిఆర్‌ఎస్‌ను రద్దు చేసుకుంటమానే ధైర్యం ఉన్నదా అని కెసిఆర్‌ను సవాల్ విసిరారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తాము రేపటి నుంచి ఫీల్డ్‌లో ఉం టామని, ఎవరు ఎవరిని తొక్కుతారో చూద్దామన్నారు. కరీంనగర్ కు ఐదు ఏళ్ళు ఎంపిగా తాను, కెసిఆర్ ఉన్నారని, రచ్చ ఎలా? చేస్తారో చూద్దామన్నారు.

## సరిహద్దుల్లో ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

ధృవీకరించారు. వివరాల ప్రకారం మావోయిస్టు పార్టీ ప్లీనరీ సమావేశం తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో జరుగుతుందనే పక్కా సమాచారం మేరకు సిఆర్‌పిఫ్, డిఆర్‌జి, కోబ్రా బలగాలు శనివారం తెల్లవారుజామునే కర్రెగుట్ట నలువైపులా చుట్టుముట్టాయి. మావోయిస్టులు సమావేశం నిర్వహిస్తున్న సమీప ప్రాంతానికి చేరుకోవడంతో అలికిడి గమనించిన మావోయిస్టులు ఒక్కసారిగా భద్రతా బలగాలపై కాల్పులకు తెగబడ్డారు. దీంతో ఆత్మరక్షణ కోసం భద్రతా బలగాలు సైతం ఎదురు కాల్పులు జరిపారు. ఇరు వర్గాల మధ్య సుమారు రెండు గంటల పాటు హోరాహోరీ కాల్పులు చోటు చేసుకున్నాయి. పోలీసుల తూటాల ధాటికి తాళలేని మావోయిస్టులు అక్కడి నుండి అడవుల్లోని జారుకున్నారు. సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించడంతో ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను భద్రతా బలగాలు గుర్తించాయి. ఇదిలా ఉండగా ఎన్‌కౌంటర్ జరుగుతుండగా అడవుల్లోనికి జారుకున్న మావోయిస్టుల కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు.

## ఎన్‌ఐఎ అధికారుల కారుపై రాళ్ల దాడి

(మొదటి పేజీ తరువాయి)

ఎన్‌ఐఏ పోలీసులకు ఫిర్యాదు చేసిందని వెల్లడించారు. ఎన్‌ఐఎ అధికారుల వాహనంపై దాడి చేసిన గుంపు నిందితులను తీసుకెళ్లకుండా అడ్డుకున్నారు. అనంతరం అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఘటనతో కేంద్రం అప్రమత్తమైంది. అరెస్టు చేసిన నిందితులతో, ఎన్‌ఐఏ అధికారులు ఉన్న భూపతినగర్‌కు భారీగా కేంద్ర బలగాలు చేరుకుంటున్నాయి. 2022 డిసెంబర్ 3న భూపతినగర్‌లో జరిగిన పేలుడులో ముగ్గురు వ్యక్తులు మరణించారు. అనంతరం ఈ కేసు దర్యాప్తును ఎన్‌ఐఏకు అప్పగించారు.

### ఎన్‌ఐఎకు ఏ హక్కు ఉంది? : మమతా బెనర్జీ

ఈ ఘటనపై బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు. అర్ధరాత్రి ఎన్‌ఐఎ ఎందుకు దాడి చేసిందని ప్రశ్నించారు. తొలుత దాడి చేసింది మహిళలు కాదని ఎన్‌ఐఎ అధికారులేనని అన్నారు. అందుకే చేసేది లేక తిరిగి దాడికి పాల్పడ్డారన్నారు. ఎన్‌ఐఎ, సిబిఐ బిజెపికి సోదరులైతే ఇడి, ఐటి ఆ పార్టీకి ఫండింగ్ బాక్సులంటూ విమర్శించారు. 'వారికి (ఎన్‌ఐఎ) పోలీసు అనుమతి ఉందా? అర్ధరాత్రి ఎవరైనా అపరిచితుడు తమ స్థలానికి వస్తే ఎలా స్పందిస్తారో, అదే విధంగా స్థానికులు స్పందించారు. ఎన్నికలకు ముందు వారిని ఎందుకు అరెస్టు చేస్తున్నారు? ప్రతి బూత్ ఏజెంట్‌ను అరెస్టు చేయాలని బిజెపి ఎందుకు అనుకుంటోంది? ఎన్‌ఐఎకు ఏ హక్కు ఉంది? బిజెపికి మద్దతిచ్చేందుకే వాళ్లు ఇదంతా చేస్తున్నారు. కాషాయ పార్టీ నీచ రాజకీయానికి వ్యతిరేకంగా ప్రపంచం మొత్తం పోరాడాలని పిలుపునిస్తున్నాం' అని మమతా మండిపడ్డారు.

### ఇలాంటి గుండాయిజానికి అనుమతి లేదు : బంగాల్ గవర్నర్

ఎన్‌ఐఎ అధికారులపై జరిగిన దాడిపై స్పందించిన బంగాల్ గవర్నర్ సివి ఆనంద్ బోస్, దీన్ని చాలా తీవ్రమైన సమస్యగా అభివర్ణించారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించాలన్నారు. 'దర్యాప్తు సంస్థలను బెదిరించే ప్రయత్నం ఎవరికీ క్రెడిట్ తెచ్చిపెట్టదు. ఈవిషయాన్ని ఉక్కు చేతితో ఎదుర్కొవాలి. ఇలాంటి గుండాయిజానికి ఎట్టిపరిస్థితిల్లోనూ అనుమతి లేదు' అని బంగాల్ గవర్నర్ అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com